నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

7 ఫిబ్రవరి 1961

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం

టెలిగ్రామ్సు : నవభారతి   టెలిఫోన్ : 488

సూర్యారావుపేట * విజయవాడ-2

విషయ సూచిక

విశ్వవిద్యాలయములు - విద్య	సంపాదకీయము	3
కుల (మా) స్వామి శతకము	విశ్వనాథ సత్యనారాయణ	7
నాట్యశాస్త్రమ్	పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి	9
కాతన్త్ర వ్యాకరణం	శ్రీనివాస సోదరులు	17
యశోధరా స్వయంవరము	శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి	23
ఆశ్చర్య చూడామణి	శనగన నరసింహస్వామి	25
జైమిని భారతం (అశ్వమేధ పర్వం)	రెంటాల గోపాలకృష్ణ	29
ఆంధ్రభాష - అవ్యవస్థ	"గాండీవి"	37
ఆధ్యాత్మిక భౌతికవాదములు పరస్పర విరుద్ధములా?	కాశీనాథుని సాంబశివరావు	44
బృందావనమ్	కే. వేం. నృ. అప్పారావు	52
వీణావాసవదత్తము	పాలావఝుల రామశాస్త్రి	53
వెన్నెల	మపాసా	59

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 3 | విజయవాడ * ఫిబ్రవరి 1961 | సంచిక 4

విశ్వవిద్యాలయములు - విద్య

ఈనాడు విశ్వవిద్యాలయముల విద్యా విధానమును గురించి హెచ్చుగా తర్క వితర్కములు చేయుచున్నారు. విశ్వవిద్యాలయము లనునవి వ్యవహార విద్యా సముపార్జనమునకు తోడ్పడవలయునని కొందరు, జ్ఞాన సముపార్జనమునకు తోడ్పడ వలయునని మరికొందరు, తర్కించి నిర్ణయము చేయుచున్నారు. ఈ తర్క వితర్కములను చేయువారిలో యే పరమార్థము యిమిడియున్నదో. సామాన్యులకు తెలియదని కొందరు, విజ్ఞులకు కూడ తెలియబడదని మరి కొందరు, సాధ్యాసాధ్యములను గురించి విషయ మీమాంస చేయుటకు ప్రయత్నించుచున్నారు. ఇవి సత్ప్రయత్నములా, కావా? యనునది చర్చించి నిర్ణయించు కొనవలయును.

విద్య ప్రధానమా ? వివేకము ప్రధానమా ? విషయము ప్రధానమా ? విషయ జ్ఞానము ప్రధానమా ? భాష ప్రధానమా ? భాషాస్వరూప స్వభావములు ప్రధానములా ? భావము ప్రధానమా ? భావౌన్నత్యము ప్రధానమా ? వస్తువు ప్రధానమా ? వస్తు విశేషణము ప్రధానమా ? వస్తుగుణము ప్రధానమా ? యీ మొదలైన ప్రశ్నలు అనేకములుగా ఉదయించి, తర్కవితర్కములకు దోహదము చేయుచున్నవి. తర్క వితర్కములద్వారా యెప్పటికప్పుడు విద్యాప్రమాణములు మార్పుచెందుచున్నవి. ఈ మార్పులు ఆ యా కాలముల స్వభావ స్వరూపములకు ప్రతిబింబములని చరిత్రాత్మకమైన పరిశీలన పరిజ్ఞాన పారిభాషిక వ్యవహార విద్యా విశేషణములతో ఋజువుచేయ ప్రయత్నించుచున్నారు. ఈ ప్రయత్నములకు పరిమితములు లేవని యీ వాదములు చేయువారి తార్కిక జ్ఞానము తెలియజేయుచున్నది.

విద్య, మానవ వ్యవహార నిర్ణయ ప్రమాణమునకు యేర్పడినది. ఈ వ్యవహార ప్రమాణ నిర్ణయమును ఒక్కొక్క విధముగా ఒక్కొక్కరు ఒక్కొక్క కాలమున అర్థముచేసుకొని వారు నిర్ణయించినదే వ్యవహార ప్రమాణముగా యేర్పడి నడుపబడుచున్నది. విద్యయొక్క పరమార్థము మానవుని వ్యవహార ప్రయోజనమే. మనము సాంఘిక వ్యవస్థను నిర్మించినా, సాంఘిక వ్యవస్థలకు సంబంధించిన చట్టములను చేసినా యీ ప్రయోజనమును ఆశించిమాత్రమే చేయుచున్నాము. ఈ చట్టబద్ధమైన వ్యవహార ప్రయోజనాపేక్షతోనే యీ వస్తు పరిశీలన, పరిజ్ఞాన సముపార్జ

నము రాకపోకల ప్రయాణసౌకర్య ప్రయోజనా పరిజ్ఞాన పరిశీలనముచేసి,తర్కించి యెప్పటికప్పుడు నూతన రూపములను యేర్పరచుచున్నాము. ప్రతిఒక్క పరిశీలన, మానవుని వ్యవహార ప్రయోజనాపేక్షతోనే జరుపబడుచున్నదని మనము గ్రహించవచ్చును. ఈ వ్యవహార జ్ఞానమునకు మానవుని సౌకర్యాపేక్ష ప్రధాన కారణముగా భాసించు చున్నది. మానవుని కాలము, ఈ ప్రపంచములోని కాలములో బహు స్వల్పమైనది మాత్రమే కావడము వలన తన కాలములోనే తా నపేక్షించిన సర్వ సౌకర్యములను అనుభవించవలయునను రాగాపేక్షా భావమే యీ తర్క వితర్కముల నన్నింటికి కార్య కారణ భావముగా రూపము యేర్పడి, వ్యవహార నిర్ణయము చేయ సంకల్పించుకొని, విషయ నిర్ధారణకు, వివేక నిరూపణకు. వ్యవహార సదుపాయమునకు, విద్యా ప్రమాణ నిర్ణయము చేయబడి కార్యరూపము పొందుచున్నది. ఈ వీటన్నిటికి కారణము ఒక్క వ్యవహార సంబంధమైన విషయ నిర్ణయమే పరిష్కార మార్గమైతే మరి యీ తర్కవితర్కములకు తావుండకూడదు. మరి తర్క వితర్కములు జరుగుచునే యున్నవి. ఈ తర్క వితర్కములలో వ్యవహార విద్యా నిర్ణయమునకు, జ్ఞాన సముపార్జనా నిర్ణయమునకు మధ్య అగాధమున్నటుల తెలియుచున్నది. దీనికి పరిష్కార మార్గము కావలయును. ఈ పరిష్కార మార్గము సామాన్యమైనదికాదు. ఈ సృష్టి కార్యమేర్పడిన నాటినుండి నేటివరకు యిది తెగని సమస్యగానే, పరిష్కరించబడని సమస్యగానే పరిగణించబడు చున్నది.

ఈ సమస్యపై మన పూర్వీకులు చర్చించి ఒక నిర్ణయమునకు వచ్చినటుల స్పష్టపడుచున్నది. వ్యవహార విద్యయనగానేమి? జ్ఞాన విద్య యనగానేమి ? ఈ రెంటికి ఒకే మార్గమనుసరించవలయునా? లేక ద్వివిధమార్గములు అనుసరించ వలయునా? ఈ ప్రశ్నలు యెవరికివారు వేసుకొని తర్కించి సుస్పష్టమైన నిర్ణయము చేసియున్నారు.

ఆర్థిక, సాంఘిక, రాజకీయ. రసాయనిక పదార్థ తత్త్వశాస్త్రములను, కావ్య, సంగీత, శిల్ప, చిత్రకళా శాస్త్రములను, భూగర్భ, వృక్ష, జీవ, జంతు, జల శాస్త్రములను,భూమి ఆకాశ వాయు అగ్ని సముద్ర నక్షత్ర శాస్త్రములను అభ్యసించి వ్యవహార ప్రయోజనమును పొందవచ్చుననిరి. ఇవి భౌతికాపేక్షలను సమకూర్చునవి మాత్రమేనని వారు చెప్పియుండలేదు. ఇంద్రియ పరిజ్ఞానము, సకల శాస్త్ర సమన్వయ పరిజ్ఞానము ఒక్కటేనని, మనకుమాత్రమేగాక ఆత్మఅనునది సర్వభూతముల యందు వ్యాప్తిచెంది యున్నదని, సర్వభూతములయందు వ్యాప్తిచెందియున్న ఆత్మ స్వరూపమును యెవ్వరు గ్రహించగలరో వారికిమాత్రము జ్ఞానమున్నదని తెలియవలయునని, ఈ జ్ఞానసముపార్జనకు సర్వభూతములలోను మానవుడను భూతమందున్న ఆత్మవికాసముచెందియున్నదని,తనకు తానుప్రయత్నించి ముక్తిపొందు

టకు యిచ్ఛాశక్తిని నిగ్రహించుకొనుటకు మానవుడను భూతములో అంతర్యా తమైయున్న ఆత్మకు ప్రత్యేకమైన శక్తియున్నదని, స్పష్టముగా నిర్వచించిరి. వ్యవహార విద్య సామాన్యజనులకు పరిమితమైనదని, విశేష ప్రజ్ఞాశక్తిగలవారికి ఆత్మజ్ఞానము పొందవలయుననువిద్య నుపాసించవచ్చునని వివరించిరి. ఈ రెండింటికి వేరువేరు ప్రమాణములను యేర్పరచి వేరువేరు ప్రయత్నములు చేయవలయునని నిర్ణయించిరి. మన పూర్వీకుల నిర్ణయములను, యీనాడు మన మభ్యసించే నవీన విద్యా నిర్ణయమును అవగాహన చేసుకొనలేక పరస్పర విరుద్ధములైన అభిప్రాయములను కల్పించుకొని, విద్యా విధానముపై దురభిప్రాయములను కల్పించు కొనుచున్నాము. ప్రపంచములోని విద్యావంతులందరూ అన్ని కాలములలోను ఒకే అభిప్రాయము చెప్పి యున్నారు. విద్య లౌకికమైనది. అంటే లోక ప్రయోజనమును ఆశించి యేర్పడి యున్నది. ఇది మానవులకు మాత్రమే పరిమితమై యున్నది మానవసంఘము మాత్రమే దీనిని ఆచరించి, ప్రయోజనమును పొంది, తద్వారా వచ్చిన ప్రయోజనము ద్వారా సంతృప్తి గలిగినదని, మన కాలనిర్ణయములో మనమన మనస్సులలో మనము కల్పించుకొని, మనమన కాలములను వెళ్ళబుచ్చుకొనుటకు యిదొక సదుపాయము మాత్రముగా కర్మ నిర్వహణమునకు తోడ్పడుచున్నది.

ఈ ప్రపంచము మానవులకు మాత్రమే పరిమితికాదు. మానవ పరిమితమైనది మాత్రమే ప్రపంచము కాదు. ఈ ప్రపంచములోని సృష్టి అంతయు రమణీయమైనది ఈరమణీయమైన ప్రపంచములో మానవు డనువాడుకూడ నున్నాడు. ఈ వీడొక్కడే యీప్రపంచమునకు తానే కర్తనని, తన విధి నిర్వహణలోనే యీ ప్రపంచమంతయు నడుపబడుచున్నదని, తా నీ ప్రపంచమున కంతటికి సృష్టికర్తనని తానన్నియూ చేయగలనని అనుకొనుటలోనే అపహాస్య భావ మిమిడియున్నదని విజ్ఞులు తలంచుచున్నారు. జ్ఞానులు చిరునవ్వు నవ్వి మిన్నక చూచుచున్నారు. లౌకిక విద్యను వ్యవహార విద్య యని, వ్యవహార విద్యనే లౌకిక విద్య యని మనము అర్థము చేసుకొన వలయును. జ్ఞానము, జ్ఞానవిద్య వ్యవహారమునకు తోడ్పడవు. లాభనష్టముల అంచనాలను యెప్పటికప్పుడు తెలియజేయలేవు. ఈ విద్యల రెండింటిని మానవుడే కల్పించుకొన్నాడు మానవుడే యీ రెంటితో సతమతమగుచున్నాడు విషయ వివేక సముపార్జనమును విజ్ఞానమనుచున్నాడు. మానవని అంతర్గతమైన చిత్తప్రవృత్తుల పరిశీలన పరిజ్ఞానమును ఆత్మ విద్య యనుచున్నారు. ఈ అనుకొనిన భావములలోనే వ్యత్యాసమున్నది అది యీచిక్కులన్నిటికి కారణభూతమై యున్నది. ఆత్మవిద్య తన అంతస్తును గురించి తెలుసుకొనుటకు మాత్రమేగాక, సర్వభూతములలో యిమిడి యున్నది ఒకే ఆత్మయని ఎవ్వడు దర్శించగలడో, ఆ దర్శించిన భావ స్వరూప స్వభావములనే జ్ఞానమని భావించుటకు మన పూర్వీకులనిర్ణయము మాత్రము తోడ్పడునని మనము గ్రహించ వచ్చును ఇది

యెంత వరకు మనము గ్రహించలేమో అంతవరకు మనము యీవాదోపవాదములను, తర్కవితర్కములను చేసుకొనుచునే యుందుము. ఈ తర్కవితర్కము లన్నియు మనవ్యవహారజ్ఞానమునకు మాత్రమే పరిమితములని యెరుగవలయును.ఇవి ఆత్మవిద్యకు మాత్రము దోహదము చేయవని తెలియవలయును.

మన విశ్వవిద్యాలయముల విద్య, ప్రపంచములోని అన్ని విశ్వవిద్యాలయముల విద్య, వ్యవహారమునకు మాత్రమే పరిమితమైయున్నది. ఆత్మజ్ఞానము కావలయునను వారు విశ్వ విద్యాలయములద్వారా అభ్యసించవచ్చు ననుకొనుట అవివేకమని మాత్రమే చెప్పవచ్చును. విశ్వవిద్యాలయములను ఆత్మ విద్యా ప్రభోధమునకు తోడ్పడవలయునని కోరుట లోక వ్యవహారమునకు ప్రతిబంధకము మాత్రమేనని తెలిసికొని వ్యవహరించవలయును.

విశ్వనాథమధ్యాక్కఱలు

కుల (మా) స్వామి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

మరియెల్ల యిచటి దౌ బ్రదుకు మాకు సంబంధించినంత
వరకును వృద్ధులై యపుడె చనిపోవవచ్చును వలయు
అరయ మా కభిమతమద్ది వట్టి దుఃఖా భాసమసలు
హరు సంబు నందమూర్నిలయ ! విశ్వేశ్వరా ! కులస్వామి !

వగలేని దొక్కఁడే మాట పుట్టిన ప్రతిజీవి ముసలి
యగుదాక నెట్టులో యటుల బ్రతికి తానపుడు
నొగిని బల్లెత్తు మాట నిను ననము నీ యూసెత్తుకోము
హర ! నాథ ! నందమూర్నిలయ ! విశ్వేశ్వరా ! కులస్వామి !

ఎవ్వఁడో జనియించు బ్రతుకు నెవ్వఁడో యెవ్వఁడో చచ్చు
నెవ్వఁడో యనుమాట తర్క నిర్ణయమిది ఋషి ప్రోక్త
మవ్వల నివ్వల దాని కనుబంధమగు పొడిగింపు
లవ్వారి నందమూర్నిలయ ! విశ్వేశ్వరా ! కులస్వామి !

మానసంబున నూహ చేసినకొలంది మరి యేమి లేద
కాని యోజించుట మానివేసినఁ గ్రమ్ము దుఃఖమ్ము
తానిది పశులక్షణమ్ము పశుపతీ ! దమియించు చిద్సు
నానంద నందమూర్నిలయ ! విశ్వేశ్వరా ! కులస్వామి !

ఇంకొక్కఁడు కలదు శైలపతి చమత్కృతి సృష్టిలోన
జంకి నిరంత యోజన పౌనర్పంగ సాధ్యంబు కాదు
వంకరటింకరల్ తెరువునం జను బండి యీమేన
హంకేళి నందమూర్నిలయ' విశ్వేశ్వరా! కులస్వామి!

సర్వ మీ లోకమే యయిన వారికి జగమున సగము
పర్విన వైరాగ్యమైన వారికిఁ బడ దూహాలందు
బర్వు తేలిక ధాత్రి వీరలకు సమపాళమ్ము వారి
కార్వగా నందమూర్నిలయ ! విశ్వేశ్వరా ! కులస్వామి !

ఏ వానికో భవత్పాద జలజ సాహిత్య రమ్యంబు
భావంబు పాపము దేహమింద్రియ ప్రవణమై యుండు
ఈవు కృపాదృష్టిఁ జూడకున్నచోఁ గృచ్ఛ్రింబు వాని
కావల నందమూర్నిలయ ! విశ్వేశ్వరా. కులస్వామి!

ఇది యేమొ తపమని నేను మరియు నీవేమను కొనెదో
కోదుమనేఁ గాదని నీవ యపుడను కొన్నచోఁ మేలె
కోదుకక నే నవుకొనియుఁగాదను కొన్నచో నీవు
సది వృధా నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి

ఎన్నివిధాలుగా జగము లోక సంస్కృతిబద్ధమగునో
అన్నివిధాలు నింకన్ని విధములు నమరించినావు
నిన్నుఁబొందఁగ నెంచు వాని కింకన్ని నీప్రయోగమ్ము
లన్నలా! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి

నన్ను నీ వడిగిన వాని వాని జన్మనుబట్టి యేరు
కొన్నట్టి దైవముల్ గాగ జనమేచి కొందురు నేను
చిన్నిక్రొన్నెల తల చీరె చుంగైన శివునేరి కొంటి
నన్నాను నందమూర్నిలయ. విశ్వేశ్వరా! కులస్వామి!

•

ఎవడేరు కొన్న దైవమ్ము వానికి నీవిశ్వనాథుఁ
డవుర! నీపేరె విశ్వేశ్వరుండు నే నది పెట్టలేదు
ఎవడో మహాభిమాని యిడెనందునా! యేమహోఘంబు
రవులునో నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

పంచభూతమ్ములు సూర్యచంద్రులు పరమచైతన్య
మంచన నీవిశ్వమున్న దెల్ల నీ యాకార మిద్ది
పంచాస్త్ర వైరి విశ్వేశ్వరుడని యాపై నెవండు మన
నాంచిత! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!

ఆ లక్షణంబు లెవ్వానికో కలవనుటది వేఱు
ఆ లక్షణంబులే యైన నీవస్మ దారాధ్యమైతి
హాలాహల నిపాన సమయ వృత్త నాట్యారంభ దోర్హ
[illegible]లింగ్య! నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి !

శ్రీ భరతముని ప్రణీత

నాట్యశాస్త్రమ్

ఆంధ్ర భారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్, పిహెచ్. డి.

షష్ఠోఽధ్యాయః

రస ప్రకరణము

తదేషాం రసానా ముత్పత్తి వర్ణ దైవత నిదర్శనా న్యభి వ్యాఖ్యాస్యామః. ౪౪

రసములకు విశేష లక్షణములు చెప్పవలెనని తలచి వీటి ఉత్పత్తి క్రమమును, వర్ణములను, అధిష్ఠాన దేవతలను, నిదర్శనములను వివరించవలసియుండుటచే భరతుడిందుల కుపక్రమించు చున్నాడు.

దేనివలన నేరసము జన్మించుచున్నది? ఈకార్య కారణములకుగల సంబంధ మేమి? అను ప్రశ్నలు ఉత్పత్తి క్రమ వివరణలో రాగలవు.

తేషా ముత్పత్తి హేతవశ్చత్వారో రసాః, తద్యథా -
శృఙ్గారో, రౌద్రో, వీరో, బీభత్స ఇతి. ౪౫

అత్ర-

శృఙ్గా రాద్ధి భవేద్ధాస్యో రౌద్రాచ్చ కరుణో రసః
వీరాచ్చై వాద్భుతోత్పత్తిర్బీభత్సాచ్చ భయానకః ౪౬

శృఙ్గారాను కృతిర్యాతు సహాస్యస్తు ప్రకీర్తితః
రౌద్రస్యై వచయత్కర్మ సజ్ఞేయః కరుణో రసః ౪౭
వీరస్యా పిచయత్కర్మ సోఽద్భుతః ప్రకీర్తితః
బీభత్స దర్శనం యత్ర జ్ఞేయః సతుభయానకః ౪౮

శృంగారము మొదలగుగాగల రసములలో కొన్ని రసములు మిగిలిన రసముల ఉత్పత్తికి తోడ్పడుచున్నవి. శృంగారము రౌద్రము, వీరము, బీభత్సము అను నాలుగు రసములు మిగిలిన రసములకు ఉత్పత్తి హేతువులు. శృంగారము నుండి హాస్యము, రౌద్రమునుండి కరుణ, వీరమునుండి అద్భుతము, బీభత్సము నుండి భయానకము జన్మించు చున్నవి. శృంగారమున కనుకృతి హాస్యమని, రౌద్రానుకృతి కరుణయని, వీరానుకృతి అద్భుతమని బీభత్సానుగతము భయానకమని భరతుడు చెప్పుచున్నాడు. ఇట్లు నాలుగు ప్రధాన రసములని, నాలుగు జన్య రసములని రాగలవు.

అథవర్ణాః —

శ్యామో భవతి శృఙ్గారః సితో హాస్యః ప్రకీర్తితః
కపోతః కరుణశ్చైవరక్తో రౌద్రః ప్రకీర్తితః ౪౯
గౌరో వీరస్తు విజ్ఞేయః కృష్ణశ్చైవ భయానకః
నీలవర్ణస్తు బీభత్సః పీతశ్చైవాద్భుతః స్మృతః. ౫౦

పూజాదికమున ధ్యానమునకు, ముఖరాగము నభినయించుటకు ఉపయోగించు రసవర్ణములు చెప్పబడుచున్నవి. శృంగారమునకు శ్యామము, హాస్యమునకు తెలుపు, కరుణకు కపోతము, రౌద్రమున కెరుపు, గౌరము వీరరసమునకు,నలుపు భయానకమునకు, నీలము బీభత్సమునకు, అద్భుతమునకు పసుపు రంగులుగా చెప్పబడినవి. శాంతమునుకూడ వీటితోబాటు రసముగా నెంచువారు శాంతమునకు స్వచ్ఛవర్ణమని పఠించుచున్నారు.

అథ దైవతాని —

శృఙ్గారోవిష్ణు దైవత్యో హాస్యః ప్రమథ దైవతః
రౌద్రో రుద్రాధి దైవత్యః కరుణో యమ దైవతః. ౫౧
బీభత్సస్య మహాకాలః కాలదేవో భయానకః
వీరో మహేంద్ర దేవః స్యాదద్భుతో బ్రహ్మ దైవతః, ౫౨
ఏవ మేతేషాం రసానా ముత్పత్తి వర్ణదైవతా
న్య భివ్యాఖ్యాతాని. ౫౩

ఇక నొక్కొక్క రసమునకుగల అధిష్ఠాన దేవతలను చెప్పుచున్నాడు. శృంగారమునకు కామదేవుడగు విష్ణువు, హాస్యమునకు ప్రమథ గణములు, రౌద్రమునకు త్రైలోక్య సంహారకర్తయగు రుద్రుడు, కరుణకు యముడు, కంకాల శ్మశానాదికముగల మహాకాలుడు బీభత్సమునకు, భయానకమునకు కాలదేవుడు. వీరమునకు మహేంద్రుడు, అద్భుతమునకు బ్రహ్మ అధిదేవతలు. శాంతమును తొమ్మిదవ రసముగా గ్రహించువారు దీని కధిదేవత బుద్ధుడందురు.

ఇట్లు రసముల కన్నింటికి ఉత్పత్తి క్రమను, వర్ణములు, అధిదేవతలు చెప్పబడినవి.

ఇదానీ మనుభావ విభావవ్యభిచారి సంయుక్తానాం
లక్షణనిదర్శనాన్యభి వ్యాఖ్యాస్యామః స్థాయిభా
వాంశ్చ రసత్వముపనేష్యా మః. ౫౪

అనుభావ, విభావ, సంచారి భావములతో సంవలితములై ఉన్న స్థాయి భావములకు రసత్వమెట్లు సిద్ధించునో చెప్పబోవు చున్నాము. రస లక్షణములు, ఉదాహరణలు వివరించబడగలవు.

తత్రశృంగారో నామరతిస్థాయి భావప్రభవః
ఉజ్జ్వల వేషాత్మకః యత్కించిల్లోకేశుచిమేధ్య
ముజ్జ్వలం దర్శనీయంవా తచ్ఛృంగారే ణోపమీ

యతే- యస్తావ దుజ్జ్వలవేషః స శృంగారవానిత్యు
చ్యతే. యథా చ గోత్ర కులాచారోత్ప న్నాన్యాప్తోప
దేశ సిద్ధా నిపుంసాం నామాని భవంతి తథై వైషాం
రసానాం భావానాంచ నాట్యా శ్రితానాం చార్థా నామాచారో
త్ప న్నాన్యాప్తోపదేశ సిద్ధాని నామాని ఏవమేష ఆచార
సిద్ధో హృద్యో జ్జ్వలవేషాత్మ కత్వాచ్ఛృంగారో రసః
సచస్త్రీ పురుష హేతుకః, ఉత్తమ యువ ప్రకృతిః ॥॥

రతి అనుస్థాయిభావము నుండి జన్మించునది శృంగారమను రసము. ఇది ఉజ్జ్వలమైన వేషము కలిగినది. లోకములో నేదైన శుచిగను, ప్రకాశవంతముగను, దర్శనీయముగను ఉన్నచో దానిని శృంగారముతో పోల్చుటగలదు. ఉజ్జ్వలమైన వేషముగల వానిని శృంగారవంతుడందురు. గోత్రము, కులము, ఆచారము అను వానినుంచి బయలుదేరి ఆప్తోపదేశ సిద్ధములుగా పురుషుల పేర్లు వచ్చునట్లు రసములకు, భావములకు, నాట్యము నాశ్రయించుకొనిన విషయములకు గూడ ఆచారమునుండి, ఆప్తోపదేశము ద్వారాను పేర్లు వచ్చుచున్నవి. మనోజ్ఞము, ఉజ్వల వేషాత్మకము నగుటచే ఆచార సిద్ధమైన నామముతో శృంగార రసమనుచుంటిమి. స్త్రీ పురుషుల సంబంధ జనితమైన ఈ రసము ఉత్తమ యువతిని, ఉత్తమ యువకుని, ఆశ్రయించుకొని యున్నది.

తస్యద్వే అధిష్ఠానే - సంభోగో, విప్రలంభశ్చ
తత్ర సంభోగస్తావత్ ఋతు మాల్యానులేపనాలం
కారేష్ట జన విషయ వర భవనోపభోగోపవన
గమనాను భవన శ్రవణ దర్శన క్రీడా లీలాదిభిః
విభావైరుత్పద్యతే తస్య నయన చాతుర్య భ్రూక్షేప
కటాక్ష సంచార లలిత మధురాంగ హారవాక్యాదిభి
రనుభావై రభినయః ప్రయోక్తవ్యః వ్యభిచారిణ
శ్చాస్యా లస్యౌ గ్ర్యజుగుప్సా వర్జ్యాః.

సంభోగనిష్ఠమైన శృంగారము ఒకటి. విప్రలంభ శృంగార మింకొకటి. వసంతాది ఋతువులు, పుష్పములు, అను లేపనము, అలంకరణములు, విదూషకాదులగు ఇష్టజనులు, గీతాదులు, ప్రాసాదము, ఉపవనగమనము, పీటితోగల, అనుభూతి, శ్రవణ దర్శనములు, జల క్రీడాది లీలలు మొదలగు విభావముల నాశ్రయించుకొని వచ్చునది సంభోగ శృంగారము. నయన చాతుర్యము, కనుబొమల కదలిక, కటాక్ష సంచారము, లలిత మధురాంగ హారములు, వాక్యములు మొదలగు అనుభావములతో దీనినిఅభినయింపవలెను ఇచట ఆలస్యము, ఉగ్రత, జుగుప్స అను సంచారి భావములు మాత్రము పనికిరావు. మిగిలిన వాటిని ప్రయోగించ వచ్చును.

విప్రలంభ కృతస్తు నిర్వేదగ్లాని శంకాసూయాశ్రమ
చింతౌత్సుక్యనిద్రా స్వప్న విబోధ వ్యాధ్యున్మాదాపస్మార
జాడ్య మరణాది భి రనుభావై రభినేతవ్యః

నిర్వేదము, గ్లాని, శంక, అసూయ, శ్రమ, చింత, ఔత్సుక్యము, నిద్ర, స్వప్నము, మేల్కొనుట, వ్యాధి, ఉన్మాదము, అపస్మారము, జాడ్యము మొదలగు అనుభావములతో విప్రలంభ శృంగారమును అభినయించవలెను.

అత్రాహ — యద్యయం రతి ప్రభవ శృంగారః
కథమస్య కరుణా శ్రయిణో భావా భవంతి అత్రో
చ్యతే — పూర్వ మేవాభిహితం సంభోగ విప్ర
లంభ కృతః శృంగార ఇతి. వైశిక శాస్త్ర కారైశ్చ
దశావస్థోఽభిహితః. తాశ్చ సామాన్యాభినయే
వక్ష్యామః కరుణస్తు శాపక్లేశవిని పతితేష్ట.
జనవిభవ నాశవధ బంధ సముత్థో నిరపేక్ష
భావః ఔత్సుక్య చింతా సముత్థః సాపేక్షభావో
విప్రలంభ కృతః ఏవ మన్యః కరుణోఽన్యశ్చ
విప్ర లంభ ఇతి. ఏవ మేష సర్వ భావ సంయుక్తం
శృంగారో భవతి.

శృంగారము, రతియను స్థాయిభావము నుండి వచ్చునదైనచో కరుణ రసమునకు చెందిన సంచార్యాది భావముల నేలచెప్పితిరి? అని అడుగవచ్చును. కాని వెనుక సంభోగము, విప్రలంభము అను రెండు అవస్థల నాశ్రయించుకొని రెండు విధముల శృంగార రసములున్నవని చెప్పితిమిగదా! కామశాస్త్రకారులు చెప్పిన శృంగారములోని దశావస్థలను సామాన్యాభినయ ప్రకరణమున వివరించగలము.

శాపము, క్లేశము, ఇష్టజనుల విభవనాశములు, బంధనము, వధ అను వాటి నుంచి బయలుదేరుచు నిరపేక్షాత్మకమైనది కరుణ రసము. ఔత్సుక్యము, చింత అను వాటి నుంచి బయలుదేరుచు సాపేక్షాత్మకమైనది విప్రలంభము. కావున విప్రలంభము వేరు, కరుణవేరు అని తెలిసికొనవలెను.

అపిచ—

సుఖ ప్రాయేషు సంపన్నః ఋతు మాల్యాది సేవకః
పురుషః ప్రమదాయుక్తః శృంగార ఇతి సంజ్ఞితః

వసంతాది ఋతువులు, పుష్పమాలలు మొదలగు విభావములతో నున్న పురుషుడు స్త్రీ యుక్తుడై యుండి సుఖానుభూతిని కలిగి యున్నచో నా యవస్థను శృంగారమందురు.

అపిచాత్ర సూత్రాను విద్ధే ఆర్యే భవతః
ఋతు మాల్యాలం కారైః ప్రియ జన గాంధర్వా కావ్య సేవాభిః
ఉపవన గమన విహారైః శృగార రసః సముద్భవతి
నయన వదన ప్రసాదైః స్మిత మధుర వచోధృతి ప్రమోదైశ్చ
మధురైశ్చాంగ విహారైస్తస్యాభినయః ప్రయోక్తవ్యః

వసంతాది ఋతువులు, పుష్పమాలలు, అలంకారములు, ప్రియజనులు, సంగీతము, కావ్యసేవ, ఉపవన గమనము, విహారము అను వాటి నాశ్రయించుకుని

వచ్చునది శృంగార రసము, నయనచాతురి, వదన ప్రసాదము, చిరునవ్వు, మధుర వాక్కు ధృతి, ప్రమోదము, మధురములైన అంగహారములు అను వానిద్వారా ఈ శృంగారమును అభినయించవలెను.

అథహాస్యో నామ హాసస్థాయి భావాత్మకః
సచ వికృత పరవేషాలంకార ధార్ష్ట్య లౌల్యకుహ
కాసత్ప్రలాప వ్యఙ్గ దర్శనదోషోదాహరణాధిభి
ర్విభావై రుత్పద్యతే. తస్యోష్ఠనాసా కపోలస్పందన
దృష్టివ్యాకోశాకుఞ్చన స్వేదాస్యరాగపార్శ్వ గ్రహణా
దిభిరను భావైరభినయః ప్రయోక్తవ్యః. వ్యభిచారి
ణశ్చాస్యావహిత్థాలస్యతంద్రానిద్రాస్వప్న ప్రబోధా
సూయాదయః.

ద్వివిధశ్చాయం—ఆత్మస్థః, పరస్థశ్చ. యథా
స్వయం హసతి తదాత్మస్థః. యదాతుపరం హాసయ
తితదా పరస్థః.

హాస స్థాయి భావాత్మకమైనది హాస్యరసము. హాసమనబడుస్థాయి భావ మాస్వాదింపబడునపుడు సామాజికులకు లోకవృత్తాను కరణమగు వికృతవేషాదుల ద్వారా హాస హేతువుకలదు. విభావసాధారణ్య రసప్రతీతిలో కన్పించుటచే అన్ని విధముల హాస్యములయందు హాసమేకస్వభావముతో గలదు.

కేశాదిరచన, కటకాద్యలంకారము అనునవి దేశకాలప్రకృతి వయోఽవస్థా విపరీతముగాగా హాస్యరసమునకు విభావములు కాగలవు. అనగా సర్వరసముల యందు హాస్యత్వము ప్రబుద్ధముగా గలదని, సర్వరసములు హాస్యమున అంత ర్భూతములని తాత్పర్యము. నిర్లజ్జత, విషయములయందనియతత, కఠగ్రీవాది స్పర్శనము, అబద్ధములాడుట, అంగవిగమము అనువానిదర్శన, భయహేతులకు భయముకల్గుట మొదలుగాగలదోషములు, వికృతవేషాదులు, అకార్యకరణము మొదలగు వానివర్ణన అనునవిచ్చటగల విభావములు. పెదవులు, ముక్కు, కపోలము అను వాని స్పందనము, దృష్టివికాసనిమీలనములు, దృష్ట్యాకుంచనము, చెమట పోయుట, ముఖరాగము, పార్శ్వపీడనము అను అనుభావములచే హాస్యమభి నేయము కావలెను. శారీరకస్థితియగు నిద్ర, సంచారిభావజన్యమగు మోహావిబోధ ములు, ఆలస్యము సంచారిభావమగు అసూయ మొదలగున విచట కన్పించ గలవు.

ఆత్మస్థము, పరస్థముఅని హాస్యము రెండురకములు. ఇతరుడు నవ్వుచుండగా చూచి, తనువిభావములను గమనించకపోయినను నవ్వుటలోకమునగలదు. గాంభీర్య ముద్రనాదరించుటవలన అనుదితహాసము కలిగినను, విభావాదులను చూచినతర్వాత స్వకీయహాసావలోకనము కలుగగా మనమునవ్వుటకలదు.

అత్రాను వంశ్యే ఆర్యే భవతః-
విపరీతాలంకారై ర్వికృతాచారాభి ధానవేషైశ్చ
వికృతైరర్థ వికారైర్హసతీతిరసః స్మృతోహాస్యః. ౬౪
వికృతాచారైర్వాక్యైరఙ్గ వికారైశ్చ వికృతవేషైశ్చ
హాసయితి జనం యస్మాత్తస్మా జ్జ్ఞేయో రసో హాస్యః. ౬౫

పైనవివరించిన అర్థమును కారికారూపమున చెప్పుచున్నాడు విపరీతాలంకారములు, వికృతములగు ఆచారములు, పేర్లు, వేషములు వికృతములగు అంగవికారములు అను వాటిద్వారా నవ్వును కలుగజేయురసము హాస్యమనబడుచున్నది. వికృతములైన ఆచారములు, వాక్యములు, అంగవికారములు, వికృత వేషములు, అను వానిచేనవ్వింపజేయురసమును హాస్యమందురు.

స్త్రీనీచప్రకృతా వేషభూయిష్ఠం దృశ్యతేరసః.
షడ్భేదాశ్చాస్య విజ్ఞేయాస్తాంశ్చ వక్ష్యామ్యహంపునః, ౬౬
స్మితమథహసితం విహసిత ముపహసితం చాపహసితమతి హసితమ్
ద్వౌ ద్వౌ భేదౌస్యాతాముత్తమమధ్యమ ప్రకృతే. ౬౭

స్త్రీలయందు, నీచపాత్రలయందు హాస్యరసము ఎక్కుడుగా కన్పించుచున్నది.

ఆరుతెరగులుగా హాస్యరసముకలదు. స్మితము, హసితము, విహసితము, ఉపహసితము, అపహసితము, అతిహసితము అని ఈ ఆరింటిని పిలతురు. ఉత్తములు మధ్యములు, అధములునగు పాత్రలలో ఒక్కొక్కరికి రెండేసి రెండుచొప్పున ఈ, ఆరింటిని విభజించవలెను.

తత్ర—

స్మితహసితే జ్యేష్ఠానాం మధ్యానాం విహసితోపహసితేచ
అధమానా మపహసితం హ్యతిహసితం చాపివిజ్ఞేయమ్ ౬౮

ఉత్తమప్రకృతులకు స్మితహసితములు చెప్పబడినవి. విహసితము, ఉపహసితము అనునవి మధ్యప్రకృతులయందు కన్పించునవి. అపహసితము, అతిహసితము అనునవి అధమప్రకృతులకు నిర్దేశింపబడినవి.

అత్రశ్లోకాః—

ఈషద్వికసితైర్గణ్డైః కటాక్షైః సౌష్ఠవాన్వితైః
అలక్షిత ద్విజం ధీరముత్తమానాం స్మితం భవేత్.
ఉత్ఫుల్లానన నేత్రంతు గణ్డైర్వికసితై రథ
కిఞ్చిల్లక్షిత దంతంచ హసితం తద్విధీయతే.

అథమధ్యమానామ్—

ఆకుఞ్చితాక్షిగణ్డం యత్సస్వనం మధురంతథా
కాలాగతం సాస్యరాగం తద్వైవిహసితం భవేత్.
ఉత్ఫుల్లనాసికం యత్తు జిహ్మదృష్టి నిరీక్షితమ్
నికుఞ్చితాంగక శిరస్తచ్చోపహసితం భవేత్.

అథాధమానామ్—

అస్థానె హసితం యత్తు సాస్రునేత్రం తథైవచ
ఉత్కంపితాంసక శిరస్తచ్చా పహసితం భవేత్. ౬౩
సంరబ్ధ సాస్రునేత్రంచ వికృష్ట స్వరముద్ధతమ్
కరోపగూఢ పార్శ్వంచ తచ్చాతి హసితం భవేత్. ౬౪

ఆరు తెరగుల కన్పించు హాసములను ఈ యారు శ్లోకములలో నిర్వచించుచున్నాడు. స్వాభావికము, హృదయంగమమునగు హాసమును స్మితమందురు. సౌష్ఠవముతో నన్వితములగుచు కొద్దిగా వికసించిన కపోలములు, కటాక్షములు ఉండగా మధురమంథరవలనా వర్తనములు కన్పించగలవు. అప్పుడు దంతములు ఇతరులకు కనబడకుండా ఉన్నచో స్మితముసిద్ధించును. ఇట్టిస్మితమున సమగ్రావగాహన, తీక్ష్ణమగు బుద్ధి. వివేచనాత్మకమగు మనోహృదయములు కన్పించగలవు.

ముఖము. కన్నులు, కపోలములు బాగుగావికసింపగా దంతములు కొద్దిగా కన్పించినచో స్మితమునకు కలుగు రూపాంతరమే హసితమనబడుచున్నది.

తన నిజస్వరూప స్వభావములను వర్తమానస్థితియందు తనకు తానై తెలిసికొనుటకు యత్నించు నపుడు కల్గునది హసితము.

ఆకుంచితమగుకన్నులు, కపోలము మధురమగు స్వనము, కాలాగతమగు ముఖరాగము అనునవి విహసితమున గలవు. అప్రయత్నముగా ఇతరులను హేళన చేయునట్లు కన్పించు నపుడు విహసితము రాగలదు.

జిహ్మాయనబడు దృష్టితో నిరీక్షణము. ఉత్ఫుల్లమగు నాసిక, నికుంచితములగు బుజములు, శిరస్సు, ఉండగా ఉపహసితము వచ్చును ముఖవికారములను సహాయముగా తీసికొను ఉపహసితమున హేళన, బాగుగా కన్పించగలదు.

శోకాద్యవసరములగు అనుచిత సమయములయందు నవ్వుట, కంటతడిబెట్టుచు నవ్వుట, ఉత్కంపితములగు బుజములు, శిరస్సు కలియగా అపహసితము వచ్చును. అసందర్భముగాను, అనుచితముగాను వచ్చు అపహసితము శకారాదుల యందు గాననగును.

సంరబ్ధమగు కన్నీరు తోను. ఉద్ధతము. శ్రవణకటువు నగు స్వరముతోను. కరోపగూఢమగు పార్శ్వము తోను వచ్చునది అతిహసితము. వేషభాషా ప్రవృత్తులలో మానసిక బాధను తెల్పుచు. భయక్రోధాదులను చూపుచు ప్రవర్తింపబడునది.

హాస్యస్థానాని యానిస్యుః కార్యోత్పన్నాని నాటకే
ఉత్తమాధమ మధ్యానామేవంతాని ప్రయోజయేత్. ౬౫

రూపకమున నాయాస దర్భముల ననుసరించి ఏయే హాస్య స్థానములను ప్రయోగించవలెనో వాటిని ఉత్తమమధ్యాధమ పాత్రలకనుగుణముగా ప్రదర్శించవలెను.

ఇత్యేషస్వ సముత్థ ప్రథా పరసముత్థశ్చ విజ్ఞేయః
ద్వివిధస్త్రి ప్రకృతిగతస్త్ర్యవస్థభావో రసోహాస్యః. ౬౬

స్మితము, విహసితము, అపహసితము అనువాటి ద్వారా ఉత్పన్నమగునది అన్యసంక్రాంతముగాని ఆత్మస్థమగు హాస్యము. హసితము, ఉపహసితము అతిహసితము అనువాని ద్వారా ఉత్పన్నమగుచు అన్యసంక్రాంతమగునది పరస్థమగు హాస్యము.

రెండు విధములుగాను, మూడు ప్రకృతులతోను మూడు అవస్థలతోను ఉన్న రసమును హాస్యమందురు.

అథ కరుణోనామ శోకస్థాయిభావప్రభవః.
శాపక్లేశ వినిపతితేష్టజన విప్రయోగ విభవనాశ
వధ బంధ విద్రవోపఘాత వ్యసన సంయోగాదిభిర్విభా
వైః సముపజాయతే తస్యాశ్చ పాతపరిదేవనముఖ
శోషణ వైవర్ణ్య స్రస్తగాత్రతా నిశ్శ్వాస స్మృతిలోపాదిభి
రను భావై రభినయః ప్రయోక్తవ్యః. వ్యభిచారిణ
శ్చాస్య నిర్వేదగ్లాని చింతౌత్సుక్యావేగ భ్రమ మోహ
శ్రమ భయవిషాదదైన్య వ్యాధి జడతోన్మాదాపస్మార
త్రాసాలస్య మరణస్తంభవేపథువై వర్ణ్యాశ్రు స్వరభేదాదయః. ౬౭

శోకస్థాయి భావమునుండి జనించునది కరుణ రసము. శృంగార హాస్యములతో తుల్యమగు వ్యభిచారిభావములుండుటచే కరుణ రసము నిచట భరతుడు వివరించుచున్నాడని టీకాకారుడనినాడు. కాని సాపేక్షభావముగల శృంగారమును వివరించి, నిష్కామ భావనగల నిరపేక్ష భావమగు హాస్యమును ప్రపంచించి, నిష్కామ భావనలేని నిరపేక్ష భావమగు కరుణను చెప్పుటయే ఉద్దేశ విభాగక్రమమని గుర్తెరుగవలెను.

అశక్య ప్రతీకార హేతూపలక్షణమగు శాపము, క్లేశము అను వాటియందు పడిన ఇష్టజనులనుండి కలుగువిరహము. విభవనాశము, వధ బంధనము, దేశోచ్చాటనము, అగ్న్యాదిజమగు మరణము, వ్యృగయాజూది వ్యసన జనితమగు అనర్థము మొదలగు విభావములవలన కరుణరసముత్పన్న మగుచున్నది

. కన్నీరు దైవోపాలంభము, ఆత్మోపాలంభము, ముఖశోషణము, వైవర్ణ్యము, స్రస్తగాత్రము, నిశ్వాసోచ్ఛ్వాసములు, స్తంభప్రళయరూపమగు స్మృతిలోపము, మొదలగు అను భావములచే నీ రస మభినేయ మగుచున్నది.

శారీరకస్థితులగు వ్యాధి, అపస్మారము, మరణము, మనస్స్థితియగుజడత, సంచార్యనుగతములగు మోహము, ఉన్మాదము, చపలత, సంచారిభావములగు గ్లాని, ఆలస్యము, శ్రమ, ఆవేగము, ఔత్సుక్యము, త్రాస, దైన్యము, విషాదము, చింత, నిర్వేదము అనునవిచట కన్పించగలవు. స్తంభము, వేపథువు, వైవర్ణ్యము, కన్నీరు, స్వరభేదము అను సాత్త్వికభావములు చిత్తవృత్త్యాత్మకములుగా కన్పించగలవు. వ్యభిచారి త్వాభినే యత్వోప జీవనార్థమే ఈసాత్త్వికభావములిచట నిర్దేశింపబడినవి.

కాతన్త్రవ్యాకరణం

[లఘువృత్తి సహితం]

శతావధానులు, శ్రీ శ్రీనివాస సోదరులు

ద్వితీయాధ్యాయము - ద్వితీయ పాదము

౨౦. అన్త్వసన్తస్య చాధాతోః.

ఇక్కడ 'అన్తు' అన్తమందున్న లిఙ్గమంటే 'అన్తు' అని వినబడేదని గ్రహించాలి అందుచేత 'మన్తు' 'వన్తు' ప్రత్యయాన్తలిఙ్గాలు గ్రహించబడుతాయి. పైనఉధాహరించబడిన 'భవన్తు' శబ్దం సర్వనామగణపాఠంలోది. ఇదిగాక 'శన్తృజ్' అంతమైనఇంకో 'భవన్త్' శబ్దం ఉంది. ఇది ధాతులిఙ్గం కనుక దీనికి ఈసూత్రం వర్తించదు. కనుక భవన్త్ + సి. "వ్యఞ్జనాచ్చ" (కా. ౨. ౧. ౪౯.) 'సి' లోపించగా - భవన్త్ - "సంయోగాన్తస్య లోపః" (కా. ౨ ౩ ౫౪) - 'త్' లోపించగా 'భవన్' అనేరూపం వస్తుంది. భవన్-భవన్తౌ-భవన్తః, భవన్తమ్ భవన్తౌ. అదన్- అదన్తౌ- అదన్తః, అదన్తమ్-అదన్తౌ. శరాన్ జస్యతీతి 'శరజస్' వస్త్రం, వస్తే ఇతి 'వస్త్రవస్' 'శరజస్, వస్త్రవస్ అనేవి 'అస్' చివరవినపడే లిఙ్గాలు. అయినా వీటికి ప్రస్తుతసూత్రం వర్తించదు ఎందువల్ల? ఇవిక్విబన్తాలు. కనుక ధాతులిఙ్గాలు. 'అధాతోః' అనిసూత్రంలో వుందిగదా' కనక-శరజః. శరజసౌ, శరజసః, శరజసం, శరజసౌ. వస్త్రవః వస్త్రవసౌ, వస్త్రవసః, వస్త్రవసం, వస్త్రవసౌ.

౨౧ ఇన్ హన్ పూషార్యమ్ణాం శౌచ.

'శి' సమ్బుద్ధికాని 'సి' పరమైనప్పుడు 'ఇన్' 'హన్'లు అన్తంలోవున్న లిఙ్గాలకూ పూషన్, అర్యమన్ అనే లిఙ్గాలకూ ఉపధాదీర్ఘం వస్తుంది. సుధనిన్ (కులమ్)— సుధనిన్ + జస్- సుధనిన్ + శి-సుధనీన్ + ఇ-సుధనీని (కులాని). ఇలానే సువృత్రహాణి, స్వర్యమాణి, సుపూషాణి. కరిన్ + సి-కరీన్ + సి- "వ్యఞ్జనాచ్చ" (కా. ౨. ౧. ౪౯)- 'సి' లోపించగా-కరీన్-"లిఙ్గాన్తనకారస్య" (కా. ౨. ౩. ౫౮)-నకారం లోపించగా-కరీ. ఇలానే -వృత్రహన్ + సి -వృత్రహా. పూషన్ + సి-పూషా. అర్యమన్ + సి-అర్యమా. సమ్బుద్ధిలోనైతే ఉపధాదీర్ఘంరాదు గనుక-హేకరిన్ + సి హేకరిన్ "నసమ్బుద్ధౌ" (కా. ౨.౩.౫౭) అనేసూత్రంవల్ల లిఙ్గాన్తనకారం లోపించదు. ఇలానే హేవృత్రహన్, హేపూషన్, హేఅర్యమన్. 'సి' పరమైనప్పుడు మాత్రమే ఉపధాదీర్ఘం వస్తుంది కనుక - కరిన్ + ఔ - కరిణౌ. కరిణః, కరిణమ్. కరిణౌ, కరిణః, వృత్రహణౌ, వృత్రహణః, వృత్రహణం వృత్రహణౌ. వృత్రహణః. అర్యమణౌ, అర్యమణః, అర్యమణం. అర్యమణౌ, అర్యమణః. పూషణౌ, పూషణః, పూషణం, పూషణౌ. పూషణః. సుధని, సుధనినీ, సుపూష, సుపూషణీ. స్వర్యమ. స్వర్యమణీ.

౨౨. ఉశనస్పురుదంశోऽనేహసాంసావనన్తః

సమ్బుద్ధి కాని 'సి' పరమైనప్పుడు ఉశనస్, పురుదంశస్, అనేహస్ అనే లిఙ్గాల చివరి సకారానికి బదులు 'అన్' చేరుతుంది. ఉశనస్ + సి - ఉశన + అన్ + సి - "అకారే లోపమ్" (కా.... ౨-౧-౧౭. ఉశన్ + అన్ + సి - ఉశనన్ + సి - "ఘుటిచాసమ్బుద్ధౌ" (కా ౨ ౨-౧౭.)- ఉపధా దీర్ఘం రాగా - ఉశనాన్ + సి - "వ్యఞ్జనాచ్చ" (కా. ౨-౧-౪౯) - 'సి' లోపించగా - ఉశనాన్ - "లిఙ్గాన్త నకారస్య" (కా. ౨-౩ ౫౮) -నకారం లోపించగా ఉశనా. ఇలానే పురుదంశా, అనేహా. సమ్బుద్ధికి ఈవిధి వర్తించదు కనుక హేఉశనస్ + సి-'సి' లోపించగా హే

ఉశనస్-హేఉశనః. ఇలానే హేపురుదంశః హేఅనేహః.

౨౩. సఖ్యుశ్చ.

సమ్బుద్ధికాని 'సి' పరమైనప్పుడు సఖి శబ్దానికూడా అన్త్యానికి బదులు 'అన్' వస్తుంది. సఖి + సి సఖ్ + అన్ + సి-సఖన్ + సి. "ఘుటిచాసమ్బుద్ధౌ" (కా. ౨. ౨. ౧౩) -ఉపధా దీర్ఘం రాగా-సఖాన్ + సి. "వ్యఞ్జనాచ్చ" (కా. ౨. ౧. ౪౯) 'సి'లోపించగా-సఖాన్ "లిఙ్గాన్తనకారస్య" (కా. ౨ ౩.౫౬) నకారం లోపించగా 'సఖా' అనే రూపం సిద్ధిస్తుంది. సమ్బుద్ధి కీవిధి వర్తించదు గనుక-హేసఖి + సి-"హ్రస్వనదీశ్రద్ధాభ్యఃసిర్లోపమ్" (కా. ౨. ౧. ౫౧)-'సి'లోపించగా-హేసఖి-"సమ్బుద్ధౌచ" (కా. ౨.౧. ౫౬)-'ఇ'కి బదులు 'ఏ' రాగా హేసఖే అవుతుంది.

౨౪. ఘుటి త్వై.

'సి' తప్ప ఇతరఘుట్ ప్రత్యయాలు పరమైనప్పుడు సఖి శబ్దాన్త్యానికి బదులు 'ఐ' వస్తుంది. సఖి + ఔ-సఖై + ఔ-సఖాయ్ + ఔ -సఖాయౌ, సఖాయః, సఖాయం, సఖాయౌ. పరమసఖాయౌ, పరమసఖాయః. పరమసఖాయం, పరమసఖాయౌ. ఈవిధిఘుట్ ప్రత్యయాలకు మాత్రమే వర్తిస్తుంది. కనుక-సఖి + శస్-సఖి + అస్-"శసోఽకారఃసశ్చనోఽస్త్రియామ్" (కా. ౨ ౧. ౫౧) -అకారానికి బదులు పూర్వరూపమైన ఇకారమూ సకారానికి బదులు నకారమూ వచ్చి-సఖి + ఇన్ -'సఖీన్' అవుతుంది.

౨౫. దివఉద్వ్యఞ్జనే

'దివ్'కువ్యఞ్జనాదియైన ప్రత్యయం గాని పదంగాని పరమైనప్పుడు 'వ్' కు బదులు 'ఉ' కారం వస్తుంది. దివ్ + భిస్-ది + ఉ + భిస్-ద్యుభిః. ద్యుభ్యామ్. ద్యుషు దివ్ + గతః. ది + ఉ + గతః-ద్యుగతః, దివ్ + త్వమ్-ది + ఉ + త్వమ్-ద్యుత్వమ్. యకారం పరమైనప్పుడు మాత్రం ఈవిధివర్తించదు. దివ్ + యమ్-దివ్యమ్.

౨౬. ఔ సౌ

'సి' పరమైనప్పుడు దివ్ శబ్ద వకారానికి బదులు 'ఔ' వస్తుంది. దివ్ + సి-ది + ఔ + స్-ద్యౌః. హేద్యౌః, సుద్యౌః, హేసుద్యౌః.

౨౭. వామ్యా.

అమ్'పరమైనప్పుడు దివ్ శబ్ద వకారానికి బదులు'ఆ'రావచ్చు, రాకపోనూవచ్చు. దివ్ + అమ్-ది + ఆ + అమ్-ద్యామ్ పక్షాన్తరంలో -దివ్ + అమ్ + -దివమ్ అతిద్యామ్, అతిదివమ్.

౨౮. యుజేరసమాసే నుర్ఘుటి.

'యుజిర్' ధాతువుకు క్విబన్తరూపమైన యుజ్ అనే లిఙ్గానికి-అదిసమాసాన్తావయవం కాకపోతే-ఘుట్ ప్రత్యయాలు పరమైనప్పుడు నకారం ఆగమంగా వస్తుంది. ఇది ఘుట్ ప్రత్యయవిషయం గనుక ఇక్కడ నకారం లిఙ్గాన్త్యస్వరానికి చేరుతుంది. కనుక యుజ్ + సి "చవర్గదృగాదీనాంచ" (కా ౨ ౩.౪౮) అచేసూత్రం ప్రకారం పదాన్తంలోగాని, వ్యఞ్జనాది విభక్తి పరమైనప్పుడుగాని చవర్గాన్తలిఙ్గాలకూ దృశ్, స్పృశ్ మొదలైన లిఙ్గాలకూ చివరివర్ణానికి బదులు గకారం వస్తుంది. కనుక-యుగ్ + సి ఇప్పుడులిఙ్గాన్త్యస్వరానికి నకారం ఆగమంగా చేరుతుంది. కనుక-యు + న్ + గ్ + సి. "మనోరనుస్వారోధుటి" (కా ౨ ౪ ౪౪), "వర్గేవర్గాన్తః"(కా ౨.౪.౪౫) అనే సూత్రాలవల్ల నకారానికి బదులు అనుస్వారమూ దానికి బదులు కవర్గాన్తమైన ఙకారమూ వస్తాయి. యు + ం + గ్ + సి-యు + ఙ్ + గ్ + సి- "వ్యఞ్జనాచ్చ" (కా. ౨ ౧. ౪౯)-'సి' లోపించగా. యు + ఙ్ + గ్-యుఙ్గ్- "సంయోగాన్తస్య లోపః" (కా. ౨. ౩ ౫౪) -గ్ లోపించగా-యుఙ్ అనేరూపం సిద్ధిస్తుంది హేయుఙ్. యుజ్ + ఔ-యు + న్ + జ్ + ఔ-నకారానికి

బదులు అనుస్వారమూ దానికిబదులుఞ్ రాగా -యు + ం + జ్ + ఔ- యు + ఞ్ + జ్ + ఔ- యుఞ్జౌ. యుఞ్జః యుఞ్జమ్, యుఞ్జౌ. సమాసాన్తావయవమైతే ఈవిధివర్తించదు కనుక ఘుట్ ప్రత్యయాలు పరమైనప్పుడు నకారాగమనుంరాదు. అశ్వయుజ్ + సి-అశ్వయుగ్ + సి-అశ్వయుగ్ అవుతుంది. "వా విరామే" (కా. ౨. ౩. ౬౨) అనే సూత్రం ప్రకారం పదాన్తంలో 'ధుట్' వర్ణాలకు బదులు వర్గ ప్రథమంగాని, తృతీయంగాని ఉండవచ్చు. కనుక అశ్వయుక్, అశ్వయుగ్ అనే రెండు రూపాలుంటాయి. కనుక-అశ్వయుక్-అశ్వయుగ్. అశ్వయుజౌ, అశ్వయుజః, అశ్వయుజమ్, అశ్వయుజౌ.

౨౯. అభ్యస్తాదన్తిరనకారః

ధాత్వవయవమైన అక్షరము రెట్టించబడినప్పుడు. మొదటి అక్షరాన్ని అభ్యాసమనీ మొదటి రెండవాఅక్షరాలను కలిపి అభ్యస్తమనీ అంటారు, 'దా'అనే ధాతువు రెట్టించబడినరూపందదా(తి). ఇందులో'ద'అభ్యాసం. 'దదా'అభ్యస్తం దీనికి 'శన్తృఙ్' ప్రత్యయం చేరిస్తే దదా + శన్తృఙ్-దదా + అన్త్ అవుతుంది. "అభ్యస్తానామాకారస్య" (కా. ౩ ౪. ౪౨)అనేసూత్రం ప్రకారం గుణవిధాయకంకాని సార్వధాతుక ప్రత్యయం చేరినప్పుడు అభ్యస్తం చివరిఆకారం లోపిస్తుంది కనుక- దద్ + అన్త్- దదన్త్ అవుతుంది. దీన్నిలిఙ్గంగాగ్రహించి ఘుట్ ప్రత్యయంచేర్చినప్పుడు ప్రస్తుతసూత్రం ప్రకారం నకారం లోపిస్తుంది దదన్త్ + సి దదత్ + సి-"వ్యఞ్జనాచ్చ" (కా ౨. ౧. ౪౯)-'సి'లోపించగా 'దదత్' అవుతుంది దదత్. దదతౌ, దదతః దదతమ్ దదతౌ. హేదదత్ ఇలానే దధత్ జుహ్వత్, జక్షత్, జాగ్రత్, చకాసత్ మొదలైనవి. అభ్యస్తం కాని దానికైతే-చర + శన్తృఙ్ -చర + అన్త్ + సి-చరన్త్ + సి-సి-లోపించగా-చరన్త్-సంయోగాన్తంలోపించగా చరన్' చరన్తౌ, చరన్తః చరన్తం, చరన్తౌ. హేచరన్. నపుంసకలిఙ్గంలో అఘుట్ స్వర వ్యఞ్జనాలు పరమైనప్పుడు-చరన్త్ + సి-"అనుషఙ్గశ్చాక్రుఞ్చేత్"(కా. ౨. ౨. ౩౯ అనేసూత్రం ప్రకారం క్రున్చ్, ఇకారాను బన్ధంగల ధాతువులతో ఏర్పాటయ్యే లిఙ్గాలూ తప్పమిగిలిన లిఙ్గాల్లోఅఘుట్ స్వరవ్యఞ్జనాలు పరమైనప్పుడు అనుషఙ్గం (అన్త్యవ్యఞ్జనానికి వెనకవున్న నకారం) లోపిస్తుంది. కనుక-చరత్ + సి-"నపుంసకాత్స్యమోర్లోపః" (కా. ౨: ౨. ౬) 'సి'లోపించగా-చరత్. అభ్యస్తాలకైతే అనుషఙ్గమేవుండదు గనుక-దదత్.

౩౦. వా నపుంసకే.

నపుంసకంలో ఘుట్ ప్రత్యయం పరమైనప్పుడు అభ్యస్తానికి పరమైన 'అన్తి'లో నకారం వుండనూవచ్చు. లేకపోనూవచ్చు. దదన్త్ + జస్-"జస్శసోఃశిః"(కా.౨.౨.౧౦) -దదన్త్ + శి- దదన్త్ + ఇ- దదన్తి- పక్షాన్తరంలో నకారంలోపించి-దదతి, ఇలానే శస్' పరమైనప్పుడున్నూ- దదన్తి. దదతి. జాగ్రన్తి జాగ్రతి. జక్షన్తి. జక్షతి అభ్యస్తాలు కాని వాటికి వికల్పంలేదు కనుక-పచన్తి అదన్తి. సున్వన్తి.

౩౧. తుదభాదిభ్య ఈకారే.

తుదాదులకూ. భా మొదలైన ఆకారాన్త ధాతువులకూ పరమైన'శన్తృఙ్' కు స్త్రీకృతమైన ఈకారమూ"ఔరీమ్" (కా. ౨. ౨. ౯) అనేసూత్రం ప్రకారం నపుంసకంలో వచ్చిన ఈకారమూ పరమైనప్పుడు నకారం ఉండనూవచ్చు లోపించనూవచ్చు. తుద్ + అన్ + శన్తృఙ్ + ఈ- తుద్ + అ + అన్త్ + ఈ- "అకారేలోపమ్"(కా. ౨. ౧. ౧౨) తుద్ + అ + అన్త్ + ఈ-తుదన్తీ తుదతీ ఇలానేవిశతీ. విశన్తీ. భాతీ భాన్తీ. ఇక్కడ తుదాదులంటే వికరణ ప్రత్యయముూ. భవిష్యదర్థకమైన 'స్య' చేరిం తరువాత అకారాన్తాలుగాఉండే

ధాతువులని గ్రహించాలి కనుక భవిష్య+
శన్తృ+ఈ-అదన్తమైన అఙ్గం కనుక భవి-
ష్యతీ. భవిష్యన్తీ. అద్ + శతృ + ఈ-అద్
+అన్త్ + ఈ-శన్తృ చేరటానికిముందున్న
అఙ్గం అకారాన్తంకాదు గనుక ఇక్కడ విక
ల్పంలేదు. నకారం తప్పకుండాలోపిస్తుంది.
కనుక అద్ +అత్ + ఈ-అదతీ. సు+ను+
అన్త్ + ఈ సును + అన్త్ + ఈ-అఙ్గం అకా
రాన్తంకాదు కనుక నకారంలోపించి-సును
+అత్ + ఈ-సున్వతీ రుధ్-+అన్త్ + ఈ
-రున్ధ్ +అత్+ఈ- రున్ధతీ. తన్ + ఉ+
అన్త్+ఈ-తను + అన్త్+ఈ. తను + అత్
+ఈ-తన్వతీ. క్రీ + నా+అన్త్ + ఈ-క్రీణాదీ
+అన్త్ + ఈ-క్రీణా+అత్ + ఈ- "క్ర్యాద
నాం వికరణస్య" (కౌ. ౩.౪. ౪౩) క్రీ మొ
లైన ధాతువులకు గుణకారకం కాని సార్వ
ధాతుక ప్రత్యయం పరమైనప్పుడు వికరణ
ప్రత్యయమైన 'నా'లో ఆకారంలోపిస్తుంది.
శకారం అను బన్ధంగాగల 'శన్తృ' ప్రత్య
యం సార్వధాతుకం. కనుక "క్రీణా" లో
ఆకారం లోపించి-క్రీణ్ +అత్ + ఈ-క్రీణతీ
అవుతుంది. అయితే ఈసూత్రంలో చెప్పిన
వికల్పం పరిమితమైంది. కనుక భ్వాదులకూ.
దివాదులకూ, చురాదులకూ. నకారంతో
కూడినరూపాలేగాని అదిలేనిరూపాలు రావు.
భవన్తీ. పచన్తీ .దీవ్యన్తీ. సేవ్యన్తీ చోరయన్తీ,
కథయన్తీ. ఈ'ఈ'కారాన్తాలన్నీ నదీ సంజ్ఞ
కాలని గ్రహించాలి.

సర్వనామ గణపఠితమైన భవన్త్ శబ్దం
మీద స్త్రీకృతమైన ఈ కారం చేరినప్పుడు
మాత్రం 'భవతీ' అనే రూపమేవస్తుందని
గమనించాలి.

ఇంక నపుంసకంలో 'ఔ' విభక్తిచేరినప్పు
డున్నూ వ్యవస్థమైమాదిరే గ్రహించాలి.
తుదతీ (కువే), తుదన్తీ (కువే) భాతీ (కువే),
భాన్తీ (కువే). భవిష్యతీ. భవిష్యన్తీ (కువే)-
ఇవి వికల్పపక్షం. పచన్తీ, దీవ్యన్తీ, చోర
యన్తీ.(కువే)-వికల్పంలేనివి. అదతీ, సున్వతీ,
రున్ధతీ, తన్వతీ, క్రీణతీ (కువే)-నకారంరాని
రూపాలు. ఇవి నపుంసకంలో ప్రథమా,
ద్వితీయావిభక్తుల ద్వివచనరూపాలన్నమాట.
అభ్యస్తాలవైతే-దదత్ + ఈ-దదతీ (కువే).

౩౨. హన్తేర్ఘ్నిరుపధాలోపే.

'హన్'లో "అవమసంయోగాదనోఽల్లోపః,
అలుప్తవచ్ఛపూర్వవిధౌ" (కా. ౨. ౨. ౫౩.
వివరణకు చూ.కా ౨ ౨. ౧౩క్రింద) అనే
సూత్రం ప్రకారం అకారం లోపించినప్పుడు
హకారానికిబదులు ఘకారం వస్తుంది. వృత్ర
హన్ + శస్-వృత్రహన్ + అస్ - వృత్రహన్
+అస్-వృత్రఘన్ +అస్-వృత్రఘ్నః.వృత్ర
ఘ్నా, వృత్రఘ్నే. వృత్రఘ్నః, వృత్రఘ్నః,
వృత్రఘ్నోః. వృత్రఘ్ని-వృత్రహణి. ఉపధా
లోపంరానప్పుడైతే వృత్రహన్+ఇన్ + అన్
+తి వృత్రహన్ +ఇ+అ+తి-"నలోపశ్చ"
(కా. ౩. ౫. ౪౬.) వృత్రహ+ఇ+అ+తి-
వృత్రహే +అ+తి వృత్రహాయ్ +అ+తి
-వృత్రహాయతి.ఇక్కడ'హా'బదులు'ఘ రాదు.

౩౩. గో రౌ ఘుటి.

కేవలగోశబ్దానికి ఘుట్ ప్రత్యయం పర
మైనప్పుడు 'ఓ' కారానికి బదులు'ఔ' కారం
వస్తుంది. గో+సి-గౌ+సి-గౌ+స్-గౌః.గో
+ఔ-గౌ+ఔ- గావ్ +ఔ- గావౌ,గావః.
గో+అమ్-ఇక్కడ ఉత్తర సూత్రం ప్రస్తుత
సూత్రాన్ని బాధిస్తుంది. కనుక రూపనిష్పత్తికి
ఉత్తరసూత్రంక్రింద చూసుకోవాలి. కేవల
గోశబ్దాని కనటంచేత అది సమాసావయవ
మైనప్పుడు ప్రస్తుతసూత్రంవర్తించదు. కనుక-
చిత్రగుః,చిత్రగూ చిత్రగవః హేచిత్రగో,
హే చిత్రగూ, హేచిత్రగవః, చిత్రగుం,
చిత్రగూ.

౩౪. అమ్ శసోరా.

అమ్, శస్ పరమైనప్పుడు గోశబ్దం ఓకా
రానికి బదులు 'ఆ' వస్తుంది. గో+అమ్-గా
+అమ్-గామ్.

౩౫. పన్థి మన్థి ఋభుక్షీణాం సౌ

'సి'పరమైనప్పుడు పన్థి. మన్థి. ఋభుక్షి శబ్దాలచివరి ఇకారానికి బదులు 'ఆ వస్తుంది. పన్థి + సి-పన్థ్ + ఆ + స్-పన్థాః. హేపన్థాః మన్థాః, హేమన్థాః. ఋభుక్షాః, హేఋభుక్షాః.

౩౬. అనన్తో ఘుటి.

'సి'కాని ఘుట్ ప్రత్యయం పరమైనప్పుడు పన్థి-మన్థి. ఋభుక్షి శబ్దాలకు చివరి ఇకారానికి బదులు 'అన్' చేరుతుంది. పన్థి+ఔ -పన్థన్ + ఔ- "ఘుటిచాసమ్బుద్ధౌ" (కా. ౨ ౨. ౧౩.)-నకారానికిముందున్న అకారానికిదీర్ఘంవచ్చి-పన్థాన్+ఔ-పన్థానౌ, పన్థానః, పన్థానమ్, పన్థానౌ. మన్థానౌ. మన్థానః. మన్థానమ్, మన్థానౌ, ఋభుక్షాణౌ,ఋభుక్షాణః ఋభుక్షాణమ్, ఋభుక్షాణౌ.

౩౭. అఘుట్ స్వరే లోపమ్.

అఘుట్ స్వరంపరమైనప్పుడు పన్థి-మన్థి-ఋభుక్షి శబ్దాలఅన్త్యస్వరం లోపిస్తుంది. పన్థి + శస్-పన్థ్ + అస్. ఇక్కడఉత్తరసూత్రం ప్రకారం నకారంలోపించి-పథ్ +అస్-పథః అవుతుంది. పథా. పథే। పథః, పథి ఇలానే మథః, మథా. మథే. మథః. మథి. ఋభుక్షః. ఋభుక్షా. ఋభుక్షే ఋభుక్షః, ఋభుక్షి.

౩౮. వ్యఞ్జనే చైషాం నిః.

అఘుట్ స్వరమూ వ్యఞ్జనమూ పరమైనప్పుడు పన్థి, మన్థి. శబ్దాల నకారం లోపిస్తుంది. పన్థి+శస్-పన్థి+అస్-పూర్వసూత్రం ప్రకారం అన్త్యస్వరం లోపించగా-పన్థ్ + అస్-ఈసూత్రం ప్రకారం నకారంలోపించగా -పథ్ +అస్- పథః. మథః పన్థి+భ్యామ్- నకారం లోపించగా- పథిభ్యామ్, పథిభిః, పథిభ్యః, పథిషు. మథిభ్యామ్, మథిభిః, మథిభ్యః మథిషు. పన్థి+ఇకణ్ +సి-పన్థ్ + ఇక +స్ - పథ్ + ఇక + స్ - పథికః. మథికః పన్థి+ఇన్+అన్ + తి- పథ్+ఇన్+అ+తి- పథ్ +ప+అ+తి- పథ్+అయ్ +అ+తి పథయతి. మథయతి. పథిత్వమ్. మథిత్వమ్ పథ్యుత్తమః. మథ్యుత్తమః. పథిగతః.మథిగతః

౩౯. అనుషఙ్గశ్చాక్రుఞ్చేత్.

క్రుఞ్చ్లోనూ ఇకారం అనుబన్ధంగా గల ధాతువుల్లోనూతప్ప మిగిలిన లిఙ్గాల్లో అనుషఙ్గం అన్త్యవ్యఞ్జనానికి వెనుకవున్న (నకారం) ఘుట్ కాని విభక్తి ప్రత్యయాల స్వరమూ, వ్యఞ్జనమూ పరమైనప్పుడు లోపిస్తుంది. మహన్త్ + శస్-మహన్త్ +అస్-మహత్ +అస్-మహతః, మహతా. మహతే, మహతః, మహతి. విద్వన్స్ +శస్-విద్వన్స్+అస్-విద్వస్అస్- ముందుచెప్పబోయే "అఘుట్ స్వరాదౌసేట్క స్యాపి వన్సేః పకబసోత్వమ్" (కా. ౨. ౨. ౪౬) అనే సూత్రం ప్రకారం అఘుట్‌స్వరప్రత్యయం పరమైనప్పుడు వెనుక 'ఇ' ఉన్నా ఉండక పోయినా'వన్స్'లో'వ'కుబదులు'ఉ'వస్తుంది. కనుక-విద్+వ + న్ +అస్-విద్ +ఉ+స్ + అస్-విదుస్+అస్-"నామికరపరః ప్రత్యయ వికారాగమస్థః సిఃషంను విసర్జనీయషాన్తరోఽపి" (౨. ౪. ౪౦)(వివరణకు చూ. ౨ ౧. ౭)-'విదుస్''లో సకారానికి షకారం వచ్చి విదుష్+అస్-విదుషః అవుతుంది. మహన్త్+త్వమ్- మహత్ +త్వమ్- మహత్వమ్. విద్వన్స్ + యణ్ + మ్- విదుస్ + యణ్ +మ్-వృద్ధి రానౌ నణే(కా.౨.౬.౪౯) ణకారానుబన్ధమైనది. యణ్ ప్రత్యయం. ఇటువంటి ప్రత్యయం పరమైనప్పుడు లిఙ్గానికి ఆది స్వర వృద్ధివస్తుంది ఆరుత్తరేచవృద్ధిః (కా. ౩. ౮ ౩౫) వృద్ధిఅంటే ఋఋాలకు బదులు ఆర్, ఇఈ ఎఏలకు బదులు ఐ. ఉఊ ఒఓలకు బదులుఔ రావటం. కనుకవిదుస్లో ఇకారానికి బదులు ఐ కారంవచ్చి-వైదుస్ + య + మ్-నామిపరమైన సకారనికి షకారం-వైదుష్ + య+మ్-వైదుష్యమ్. 'అక్రుఞ్చేత్' అనటంచేత- 'క్రుఞ్చ్ గతౌ' అనే ధాతువునుండి ఏర్పడినలిఙ్గం-క్రుఞ్చ్. దీనికి

అఘుట్ స్వరవ్యఞ్జనాలు పరమైనప్పుడు అను షఙ్గం లోపించదు. కనుక క్రున్చ్ + టా. క్రున్చ్ + ఆ - మనోరమస్వారోధుటి (కా. ౨. ౪. ౬౪) "వర్గేవర్గాన్తః" (కా. ౨ ౪. ౪౫) - క్రుంచ్ + ఆ - క్రుఞ్చ్ + ఆ - క్రుఞ్చా. క్రున్చ్ + భ్యామ్ - "చవర్గదృగాదీనాఞ్చ" (కా ౨. ౩. ౪౮) చకారానికి బదులు 'గ' కారంవచ్చి క్రున్గ్ + భ్యామ్- ఘుఙ్వర్ణమైన 'గ'కుముందు నకారానికి అను స్వారమూ దానికిబదులు ఙకారమూవచ్చి. క్రుఙ్గ్ + భ్యామ్ సంయోగాన్తలోపంవచ్చి - క్రుఙ్ + భ్యామ్ క్రుఙ్భ్యామ్ అవుతుంది. "కసిగతి శాసనయోః." ఇది ఇకారం అనుబన్ధంగా గల ధాతువు ఇటువంటి ధాతువుల చివరి వ్యఞ్జనానికిముందు నకారంఅను షఙ్గంగా చేరుతుంది కనుక 'కన్స్' అవుతుంది 'సు' ఉపపదంగా చేరిస్తే 'సుకన్స్' అనే లిఙ్గం ఏర్పడుతుంది సుకన్స్ + అస్- సుకంస్ + అస్- సుకంసః. సుకన్స్ + భ్యామ్- సంయోగాన్తలోపంవచ్చి 'సుకన్భ్యామ్'అవుతుంది సుహింసః, సుహిన్భ్యామ్.

౪౦. పుంసః అన్ శబ్దస్య లోపః.

'పుమన్స్' అనేలిఙ్గానికి అఘుట్ స్వర వ్యఞ్జనాలు పరమైనప్పుడు 'అన్'లోపిస్తుంది. పుమన్స్+శస్-పుమన్స్ + అస్- పుమ్స్ + అస్-"మనోరమ స్వారోధుటి"(కా ౨.౪.౪౪) పుంస్ + అస్- పుంసః. పుమన్స్ + భ్యామ్- పుమ్స్ + భ్యామ్ సంయోగాన్తస్య లోపః. (కా ౨. ౩. ౫౪) పుమన్స్ + సు పుమ్స్ + సు- సంయోగాన్తలోపం. వచ్చి పుమ్ + సు- పిమ్సు-మనోరమస్వారోధుటి(కా. ౨.౪ ౪౪) పుంసు. పుమ్ + భ్యామ్ పుమ్భ్యామ్. పుమన్స్ + త్వమ్-పుమ్స్ + త్వమ్-పుంస్త్వమ్ ఘుట్ స్వరంపరమైనప్పుడీవిధి వర్తించదు పుమన్స్ + ఔ. "సాన్తమహతోర్నోపధాయాః (కా. ౨. ౨ ౧౭)-పుమాన్స్ + ఔ.

(సశేషం)

చందాదారులకు వినతి

"నవభారతి" పత్రికకు అన్నివిధాలా సహాయ సహకారాలు ఇస్తూవస్తున్న పాఠకులకు, అభిమానులకు కృతజ్ఞతను తెలియజేస్తున్నాము.

ఇంతవరకూ తమ చందాలనుపంపటం పడనివారు, వెంటనే తమ చందాసొమ్మును పంపి, యథాతథంగా తమ సహాయ, సహకారము లిచ్చి, అన్ని విధాలా తోడ్పడవలసిందిగా విజ్ఞప్తిచేస్తున్నాము.

మేనేజరు, నవభారతి

యశోధరాస్వయంవరము

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, బి. ఎ., బి. ఇడి.

క్షోణితలేశ నందనులు సుందర మూర్తులు జవ్వనంపు గీ
ర్వాణులు దేశదేశముల వారరుదెంచి సభాంగణమ్మునన్
శ్రేణులుగా యథావిధి వసింప యశోధర వచ్చి నిల్చె క
ల్యాణ లతాంతదామ సమలంకృత కోమలపాణి పద్మయై

నాడు వసంత పంచమి దినమ్మున శాక్యనృపాలు కోటలో
చేడియలెల్ల కానుకలు చేకొని యేగగ కంఠ హారమున్
వేడుకతో నొసంగిన పవిత్ర మనోహరమూర్తి, గౌతమున్
చూడగ నుత్సహించి వెఱచున్ వెనువెంటనె సిగ్గుపెంపునన్

వచ్చిన రాకుమారులకు స్వాగతమిచ్చి వచించె భూవరుం
"డచ్చట నున్న సింహ హనువన్ ధనువెక్కిడి యొక్క కోలతో
చెచ్చెర సప్తతాలముల భిన్నము చేయగ జాలు వానికిన్
సచ్చరితన్ మదీయ తనుజాత నొసంగెద నీయశోధరన్".

ఏమి స్వయంవరమ్ము! మనసిచ్చిన చెల్వుని కంఠసీమ నీ
దామ మలంకరింపగల దాననొ లేదొ ! పణంబు పెట్టుటల్
నేమమె రాకుమారికని చింతిలుచుండె యశోధరా లతాం
గీ మణి సంశయాత్మయయి క్రీగను చూడ్కుల చూచి గౌతమున్

చూచి భయార్తుడైన నృపసూనుడొకండును; వింటి నెక్కిడం
దోచక సిగ్గుతో నవనతుండయి మళ్లెడు నింకొకండు; ల
క్ష్యోచితమార్గముం దొలగి యొక్కొక కోలను వేయువారునై
లేచిరి తత్సభన్ విడిచి; లేమ మనమ్ము వికాసమందగా.

అల్లన గౌతముండు దరియంజని చాపము నెక్కు పెట్టగా
నల్లలితాంగి యాతని జయమ్మునకై మదిలోన వేయి దే
వుళ్లకు మ్రొక్కుచుండ ధనువున్ విడి యొక్క శరమ్ము పోయి భే
దిల్లగ జేసె తాలముల దివ్యులు మెచ్చగ పుష్పవృష్టితో

పతొలి జన్మలందు చిగురించిన ప్రేమ రసాను బంధమో
ఆ తరళాయతాక్షి హృదయమ్ము సమర్పితమయ్యె శాక్య భూ
నేతృ ననుంగు పట్టికి వినిర్మలమూర్తికి; తత్స్వయంవరా
యాత సమస్త సభ్యుల జయ ధ్వనులంతట మున్ను ముట్టగన్.

అమ్మదిరాక్షి కాతడును ఆతనికా తరళాక్షి యెంత ది
వ్యమ్మగు కూర్పోయంచు జనులందరు మిక్కిలి సంతసింపగా
నెమ్మది లోన గల్గిన యనిర్వచనీయ సుఖానుభూతి గే
ల్దమ్ముల నున్న దామమును రాజకుమారుని కంఠ మందిడెన్.

మహాకవి శ్రీ శక్తిభద్ర విరచిత

ఆశ్చర్యచూడామణి
(నాటకము)

ఆంధ్రీకర్త : శ్రీ శనగన నరసింహస్వామి ఎం. ఏ.

ప్రథమాంకము

(నాంద్యంతమున సూత్రధారుడు ప్రవేశించును)

శ్రీమాహేంద్రమణీ మనోజ్ఞ భుజరాజీ వీచులన్, సర్వశ
య్యా మౌళీ మకుటాంత రత్న సుషమా
హారాళి డిండీర చాం
ద్రీ మాధుర్యము తోడ, శంఖధృతి,
నబ్ధింబోలి, దుగ్ధాబ్ధి పై
గో ముంజిమ్మెడు శార్ఙ్గధన్వి, మిము
సాకుం గాత సంప్రీతిమై.

(పరిక్రమించి, నేపథ్యము వంక జూచి
ఆర్యా. ఇటురమ్మ.

నటి- (ప్రవేశించి) ఆర్య వచ్చితిని.

సూత్ర- ఆర్యా,
జన హృదయాబ్ధి రంజనము
సంఘటియించు ప్రయోగమేది, దే
నిని భరతాది మౌనులును
నేర్చి గ్రథించిరి మున్ను, దేశికేం
ద్రుని పటుశిక్షణాబలము
తో నటమిత్ర స్సుసాధ మేది, దా
నిని గురునాట్య భారమును
నే వహియింతు నరేంద్రుకైవడిన్.

నటి- ఆర్యుల అధికార గౌరవమును ఆకారమే సూచించుచున్నది.

సూత్ర- కాకేమి. సుందరీ, అసాధారణ మార్గము పెక్కురకు దుర్గమము కదా.

నటి ఆర్య. అసాధారణ మని సెలవిచ్చుచున్నారేమి?

సూత్ర- ఆర్యా, "దక్షిణాపథము నుండి వచ్చిన 'ఆశ్చర్య చూడామణి' అను నాటకమును అభినయామ్రేడిత సౌభాగ్యమును గాతిలకింప నభిలషించుచున్నారము" అని ఆర్యమిత్రుల శాసనము.

నటి- ఆర్యా. అత్యాహితము కదా యిది. దక్షిణదిశనుండి నాటకనిబంధనము వచ్చె - నేని ఆకసము పూవులు పూచును, ఇసుక నుండి తైలము పుట్టును.

సూత్ర- ఆర్యా, ఇట్లనకుము. గుణమును గ్రహింపుము. జన్మభూ నివేశమును విడువుము.

గుణము ప్రమాణము, దిగ్విభ
జనమున గుణమున్ గణింప జనదుసుమా, నీ
స్తనయుగి నొప్పవె హరిచం
దనమును, నీ హార గౌర తారావళులున్.

నటి. (తన్ను జూచికొని) యుక్తమే. ఆదేశము రత్నాకరము గదా. ఆర్య, నిజప్రజ్ఞారూపమును నిబంధనవ్యాజమున దేశాంతరమునకు బంపనెంచు నాకవియెవరు?

సూత్ర-ఆర్యా, వినుము. ఉన్మాదవాసవదత్తా ప్రభృతి కావ్యకర్తయైన శక్తిభద్రకవి. ప్రజ్ఞావిలసితమిది కావున నీవుగూడ పాత్రావధాన మొనరింపుము. నేనుగూడ నార్యమిత్రులకు విన్నపము జేయుదును. ఏమిది' విజ్ఞాపనవ్యగ్రుడనగు నాకేదో శబ్దమువలె వినిపించు చున్నదే. నిశ్చయింతును.

(నేపథ్యమున జ్యాఘోషము చేయబడును)

సూత్ర- ఆ! తెలిసినది.

నారిం గూడి వనమ్మునన్
జే రిన రామునకు గృహము నిర్మింప, ధనుః
జ్యా రవమున వన మృగముల
దూరముగా లక్ష్మణుండు త్రోలెడు నిదిగో :

[నిష్క్రమింతురు.]

స్థాపన

(అంత ధనుర్బాణపాణియై లక్ష్మణుడు ప్రవేశించును.)

జ్యానిర్ఘోషము జేసి హింస్రమృగసంచారము వారింతు, శాలా నిర్మాణమొనర్తు పరముల, పూలందీర్చెదన్ శయ్యా, వే
త్రాసీకమ్మున గూర్తు విష్టరము, నార్ద్రాంభోజరాజీ రజశ్శ్రీ సద్గాంబుకణమ్ములన్ క్షితి నభిషిక్తంబు గావించెదన్

(అట్లు చేసి) ఆర్యశాసనమెట్లో యీవిధముగా ననుష్ఠించితిని ఆహా! విపన్నులకవస్థ మేధావిని యగుగదా, గోదావరీ తటైక దేశమునం దార్యతోగూడి తరంగ మారుతములచేత నధ్వపరిశ్రమము నపనయించికొనుచున్న యార్యులకీ పర్ణశాలా నిర్మాణము పరిసమాప్తమైనదని విన్నవించెదను. (పరిక్రమించి చూచి) ఓహో! అరణ్యవిరుద్ధము గదా యీయాకృతి.

శతదళ దైర్ఘ్యమున్నగు విశాల విలోలవినేత్ర రేఖతో, నతమగు భ్రూవుతోడ, కమనమ్మగు చన్గవరీవితోడ, న ద్భుతమును గూర్చుచున్ హొయలుపోవుచు నిచ్చటికేగు దెంచు నీ
రతనము జన్మమున్ గనిన రాజ్యము నేలయొ, కాక నింగియో!

(చిత్తవికారము నిరూపించి) ఇదియేమి. రామానుజుడగు లక్ష్మణుడను గదా నేను.

ఈలలితాంగిచేత మహియేని వియత్తలమేన్ సనాథమై పోలునుగాక, యీ చపలబుద్ధుల తర్కమికేల, తాతవాక్పాలన కోసమై వనికివచ్చిన నిగ్రహుడన్న, తద్వచో వేలను దాటబోని రఘువీరున కంగజబాధ చెల్లునే?

(అంత లలిత సుకుమార వేషముతో శూర్పణఖ ప్రవేశించును)

శూర్ప.- అరే! ఇతడు ముమ్మూర్తుల నతడే

లక్ష్మ.- ఈ యాచరితము ప్రతికూలము. ఏలయన.

వరముని సంప్రదాయము లవార్యముగా తలదాల్చి నేన్ దిర
స్కరణము తోడ కర్కశముగా పరికించినగూడ, కంపమున్
బొరయుచు మోము వాంచు విరిబోణి, వతంసభరమ్ము నుండి ష
ట్చరణగణమ్ము మెల్లమెల జారుచునుండ కడింది సిగ్గుతో.

శూర్ప.- (తనలో) ఇతడేమనునో. కానిమ్ము. ముందింత మాత్రము పలుకరించెదను. (ప్రకాశముగా) ఆర్యా, ఇటు రమ్ము,

లక్ష్మ.- తపస్వులు స్త్రీలవిషయమున లోకజ్ఞులు కారు. (మౌనముగా పోవును)

శూర్ప.- (కొంచెమనుగమించి) ఆర్య, శరణాగత స్త్రీ జనమునందు మీరుచూపు నుపేక్షణ మసదృశముగా నున్నది.

లక్ష్మ.- కాదు కాము ఇపుడవస్థాంతర శోచనీయుడగుగురుని యలంఘనీయశాసనము వలన నిన్నుపేక్షించుచున్నాడను.

శూర్ప.- అయిననో, నీమె విషయమున గురుజన మాజ్ఞాపించినప్పుడు గూడ నుపేక్షించుట తగదు గదా.

లక్ష్మ.- (కోపముతో) ఏమి, నన్నాజ్ఞాపింపగలవారెవరు?

శూర్ప.- (భయము నిరూపించి) అనుగ్రహించుగాక. అనుగ్రహించుగాక. ఆర్యుడు. ఆర్య రాముడే యాజ్ఞాపించుచున్నాడు

లక్ష్మ.- (తనలో) అయ్యో ఆర్యునీమె ముందే చూచినది. అగుగాక. గురువచన ముహూర్త భాజనీ భూతయగునీ పూజ్యురాలిని జేర్చెదను (ప్రకాశముగా) భద్రా! ఆర్యుడేమని యాజ్ఞాపించుచున్నాడు.

శూర్ప ఆర్యా. వినుడు.

లక్ష్మ అవహితుడను

శూర్ప.- ఆర్య నాతో గూడి తన్నుపరిచరింప నార్య రాముడు మిమ్మాజ్ఞాపించుచున్నాడు.

లక్ష్మ.- (హాస్యమును బరావర్తించి)

నారలు చీర, విల్లుగహనమ్ము, కుశమ్ములు సెజ్జ, వన్య మాహారము, నీరమోడు జటికాళిపరిష్కృతి, పీని నీవునై
కోరకు వేయునేల, మృగకోటి గతిన్ బ్రదుకీడ్చు సంయమీడ్
వార మదేడ, తన్నియమవైరి మనోభవుడేడ, కామినీ!

శూర్ప- మోసము మోసమిది. ఆర్యుడార్యతో గూడి వర్తించుటలేదా.

లక్ష్మ- భద్రా, ఆర్యావృత్త పరమార్థము నెఱుగవు.

శూర్ప. ఏమి యేమి.

లక్ష్మ- ఆర్యులు, తీర్ణప్రతిజ్ఞులగుదాక ప్రకృతి మండలమును, గురుజనమును, భరతుని జూడబోరు. అంతవఱకును ధర్మమే యవలంబింతురు.

శూర్ప- అయిననో నామె యిచట నేమి చేయును?

లక్ష్మ- నేను చేయునదియే.

శూర్ప- ఆమె యార్యునుపచరించునట్లే నేను గూడ నిన్నుపచరింతును.

లక్ష్మ- భద్రా ఇది కూడ ప్రార్థనీయమా. బుద్ధిమంతులగు సర్వజనులును దాస్య నిష్కృతికొఱకు యత్నించుచుండగా, నీవు ముగ్ధవై స్వయముగా దాస్యమును కోరుకొనుచుంటివి.

శూర్ప- ఆర్యా, స్నేహము గుణదోషములను విచారించునా?

లక్ష్మ- (తనలో) ఇట్లు పలుకు నీమెనేమని ప్రత్యాదేశింతును (విచారించి) అగుగాక తెలిసినది (ప్రకాశముగా) భద్రా! ఆర్యుని పర్ణగృహప్రవేశానంతరము నిన్నభిప్రేత స్థానమున జూతును

శూర్ప- అయినచో నార్యా, పర్ణశాలా పార్శ్వమునందేయుండి ప్రతీక్షించెదను.

లక్ష్మ- (తనలో) సరియే కానిమ్ము కాలక్షేప మంతరాయము కాకపోదు. (ప్రకాశముగా) నీయిష్టమగుగాక!

శూర్ప- చిత్తము. (నిష్క్రమించును)

లక్ష్మ- (సవిమర్శముగా) ఈమె పరీక్షాస్పదము.

వనచరవీరులైన తెగువన్ జొరరాని వనమ్మిదేడ? ఇం
దనఘవధూటి యీ కువల యచ్ఛవిచోరవి
నేత్ర యేడ? కాం
చన శతపత్త్రి మాధురస సంగ్రహజీవనరాజహంస క
న్యను లవణార్ణవోర్మికల యందెవడైననునమ్మజాలునే.
పూర్వోద్దిష్ట మైన ప్రదేశమిది.

(అంత రాముడు సీతతో ప్రవేశించును)

రాము- దేవి, నగరాధివాసముకంటె వనాధి వాసము నాకు సవిశేషముగా తోచుచున్నది.

విరిపూల సెత్తావి కెరటాలు విరజిమ్ము, వనభూములు
ద్యానవనపదమ్ము:
సెలయేటి చిరునవ్వులొలుకు నీరదనీల, ధాత్రీధర
మ్ములు కృతిమాద్రి:
పులుగు ఱెక్కల గాలినలలెత్తు నీ నిమ్నగాళి
ఘర్మాభిషేకాస్పదమ్ము:
కమలాకరముమీదుగా వీచు శీతల, వాతపోతమ్ములు
వ్యజన బలము.
శాకమూల ఫలమ్ములు షడ్రసయుత, భోజనమ్ములు,
రానేల పూలపాన్పు:
పర్ణశాలిక జాళువా పైడిమేడ, వనమృగమ్ములు నిజ
పరీ వారజనము.

సీత- ఆర్యపుత్ర, సాకేతమునందలి గురు జనము పరితపింపకుందురేని, జీవితకాల మిచ్చటనే నివసింపవలెననియున్నది.

లక్ష్మ (చూచి) వీడుగో, వీడుగో, ఆర్యుడు. అహో! విధికర్మ కష్టముకదా! కాదు. కాదు. కైకేయిది. అంబ. కైకేయి!

నీ మూలమునగదా రామచంద్రస్వామి
చీనాంశుకములు త్యజించినాడు;
నీ మూలమునగదా నిష్ఠుర కాషాయ
వల్కలాంబరములు వడసినాడు,
నీ మూలమునగదా భూమిజ వృకపాద
చిహ్నరజోవీథి చేరినాడు,
నీ మూలమునగదా నిర్దోషి భరతుండు
మించిన వగచే కృశించినాడు:

నీదు మూలమ్మునం గదా నిత్య తుష్ట
మైన కోసల జనము పర్యాకులితము,
నీకును నసహ్య వైధవ్యమే కలిగిన
దిట్లు సర్వంకషమ్ము నీ హేయకర్మ

ఆర్యుని సమీపించెదను. (సమీపించి) జయమగుగాక, ఆర్యులకు.

రాము- లక్ష్మణ, నీయారంభము ముగిసినదా?

లక్ష్మ- ఆర్యా, కాకేమి?

రాము- అయినచో, నచ్చటికి త్రోవ జూపుము,

లక్ష్మ- చిత్తము- ఆర్య, ఇటు. ఇటు.

(అందఱు పరిక్రమింతురు)

రాము- [లక్ష్మణుని ముఖరాగము జూచి]

ముదిమిని పూర్వరాఘవులు మోహముగోని గమించు నీవనీ
పదమును జేరి మౌనిజనపావనపాదము లర్చనేయుటో,
సదమలసింధు తీర్థముల స్నానములాడి యఘమ్ము లాచుటో,
యొదవెను తమ్ముడా! మనకు నొప్పుగ నైకనెపమ్మనం గదా.

లక్ష్మ- గుణవంతుల కగుణులుండరని లోకము సత్యమే చెప్పినది

రాము- లక్ష్మణ, ఇప్పుడుకూడ నీవు తల్లిమీది సంరంభమును విడువకున్నాడవేమి?

లక్ష్మ- ఆర్య,

చన్నులు చేపి తల్లులు లసన్నయనమ్ముల జూడ తండ్రినీ
చిన్ని శిరాన జిమ్మ కలశీజల మంత్ర జలమ్ము నేతువుం
బన్ని వసిష్ఠమంత్ర జయ మంత్ర బలమ్మున నడ్డగించె నే
యన్నువ కాళరాత్రివలె నాయమ నిర్దయ తల్లియౌనె కో?

రాము .(వీనులు మూసికొని) పాపము శాంతించుగాక. పాపము శాంతించుగాక. హతరాజ్యమునందలి భక్తిచే నీవు స్వమాత నధిక్షేపించుచున్నాడవు. అహో సంతోష బాహుళ్యల మనస్సు అధర్మైకరతమగును గదా. చూడు బాలుడ,

నయవిదులన్ గమించు మహి నారి కళత్రము, మిత్రు లస్త్ర సం
చయము, సహోదరాత్మజులు శత్రువు, ఉత్కట కల్మషాప్తి న
త్యయమున నారక, మ్మిక సితా తపవారణమొండు, చామర
ద్వయము వినాగ, క్షత్రియుని పాలికి వేఱొక లాభమున్నదే?

లక్ష్మ- నేను రాజ్యాభిలాషముచేత చెప్పుట లేదు

రాము- నీకు మఱియొక కోపకారణమేమి?

లక్ష్మ- క్రమము తారుమారైనదని.

రాము- అయినచో, నీకు మొట్టమొదట నిందింపదగిన వాడను నేను. ఇంద్రకల్పుడగు రాజు స్నేహపర్యాకులోచనుడై యభిషేకార్థము పిలిచినంతనే సింహాసనము దరిసిన నిర్లజ్జుడు వీడు.

సీత- ఆర్యపుత్రులు చెప్పినది సత్యమే

లక్ష్మ- 'వయస్సులో నేను పండితిని' అని తాతపాదులు మీకు రాజ్యమీనెంచిరి.

రాము- నాకంటె భరతుడు చిన్నవాడు.

లక్ష్మ- 'పృథివిని రక్షించుటకు నేనశక్తుడను' అని తాతపాదులు మీకు రాజ్యమీనెంచిరి.

రాము- బాలుడ దానవోన్మూలనము జేసి స్వర్గమును గూడ రక్షించిన తేజమాత్మదేవతయగు పృథివిని రక్షింపజాలదా?

లక్ష్మ- కాని పుత్రస్నేహము వలన నామె చాపలము చూపినది.

రాము- బహుపుత్రుల కొక్కనియందీ పక్షపాతముండుట లోకస్వభావము. నీకు మాత్రము భ్రాతృస్నేహము సాధారణమా?

లక్ష్మ- పెక్కు మాటలేల? సర్వధా తాతపాదుల మరణకారణ మామెయే.

రాము- కాదు కాదు. తాతపాదుల విషయమున నాగురుజనము నిరపరాధము.

మునిసుతు డొక్క డంధ పితృమూర్తులకున్ నియమాంబువున్ గొనం
జని సరయూనదిన్ స్వకలశమ్మను ముంచిన మించు తత్పటు
ధ్వని విని వేటకోర్కి వఱువాత నటంజను రాజు వన్య వా
రణమను భ్రాంతినేసె నిటు ప్రాణము బానెను కాలవశ్యుడై.

సీత- తాదృశ విధిచేత నట్లుజరుగవచ్చును.

లక్ష్మ- అట్లయినచో నేనే యపరాద్ధుడను. ఆర్యు డనుగ్రహించుగాక కథాప్రసంగ

మునిలోబడి దూరము తెలియకుండగనే పర్ణశాలను జేరితిమి. ఆర్యుడు ప్రవేశించుగాక.

రాము. లక్ష్మణ, నీవుకూడ నేకాంతమున నలసట దీర్చుకొనుము.

లక్ష్మ- చిత్తము. (నిష్క్రమించును)

రాము- (పర్ణశాలలో ప్రవేశించి, కలయబరికించి, విస్మయముతో) దేవి, చూడు. చూడు. వత్స లక్ష్మణుని సర్వతోముఖ నైపుణ్యము.

నెట్టెన్ జ్యాకరటం కృతిన్ వన మృగానీకమ్ము
వేగమ్ముగా,
గట్టెన్ సద్మము నాకు లేరి, పడకన్ గల్పించె
క్రొంబూవులన్,
బెట్టెన్ విష్టర మిందు వేత్రలతలన్ నిర్మించి,
కాంతారపుం
జెట్టుల్ పూజకు పూలకై తడిపెబో నింధూదక
ప్రాప్తిచే.

సీత- అర్యపుత్ర. కుసుమపల్లవ సమృద్ధిచేత పర్ణశాలావిభూతి, ప్రాసాద బహుమానము నధఃకరించుచున్నది.

రాము- దేవి, ఇది వివిక్తస్థానము. వనాంత మారుతములు సేవింపుము.

నీ సుకుమారోష్ఠము నిః
శ్వా సమరుద్ధాటి వాడి వణకెడును, రజో
ధూసరకుచాంశుకమ్మను
వే సడలింపుము అశంక విధి శుకవాణీః

సీత- చిత్తము. [నిష్క్రమింతురు.]

-: ఇది పర్ణశాలాంకము :-

(సశేషం)

జైమిని భారతం

(అశ్వమేధ పర్వం)

శ్రీ రెంటాల గోపాలకృష్ణ

౧

[కురుక్షేత్ర యుద్ధం తరువాత ధర్మరాజు దుఃఖసముద్రంలో మునిగిపోయాడు. దాయాదులను చంపిన పాపానికి పరితపించ సాగాడు. అప్పుడు వ్యాసులవారు వచ్చి అశ్వమేధయాగం చెయ్యమనీ, అది సకల పాపహరమనీ సలహా ఇచ్చాడు. యాగం చెయ్యవలసిన విధానమంతా చెప్పాడు. యజ్ఞానికి పనికివచ్చే గుర్రం భద్రావతీపురంలో ఉన్నదని తెలిపాడు. అప్పుడు ధర్మరాజు, కృష్ణపరమాత్మను రావించి ఆయన అనుజ్ఞ తీసికొని యాగానికి పూనుకున్నాడు. యజ్ఞాశ్వాన్ని పట్టుకుని రావడానికి భీమసేనుడు బయలుదేరాడు. అతని వెంట, ఘటోత్కచుడి కుమారుడు మేఘవర్ణుడు, కర్ణపుత్రుడు వృషకేతుడు బయలుదేరారు. అలా బయలుదేరి వెళ్ళి భద్రావతీపురం చేరుకున్నారు. పురం వెలుపల ఉద్యానవనంలో ఆగారు. అక్కడవున్న సరోవరంలో నీళ్ళు త్రాగడానికై యజ్ఞాశ్వం వచ్చింది. అప్పుడు మేఘవర్ణుడు తన రాక్షసమాయ ప్రయోగించి గుఱ్ఱాన్ని ఎత్తుకొని ఆకాశానికి ఎగసిపోయాడు తనను ఎదిరించడానికి వచ్చిన రాజసైనికులతో యుద్ధంచేసి పారద్రోలాడు. అదివిని యౌవనాశ్వుడు, గొప్ప సైన్యంతో దండెత్తి వచ్చాడు. యౌవనాశ్వుడికీ - కర్ణపుత్రుడైన వృషకేతుడికీ పెద్ద యుద్ధం జరిగింది. ఆయుద్ధంలో చివరకు వృషకేతుడే నెగ్గాడు. యౌవనాశ్వుని ఓడించి, ఆయన ప్రాణాలు కాపాడాడు. యౌవనాశ్వుని పుత్రుడగు సువేగునికీ — భీమునికీ కూడ భయంకరమగు గదాయుద్ధం జరిగింది. ఏమయితేనేం? రాజు తన యజ్ఞాశ్వాన్ని ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. పాండవులతో పాటు గుర్రాన్ని తీసుకుని తానూ, తన యావత్పరివారంతోసహా బయలుదేరి హస్తినాపురానికి వెళ్ళాడు, యౌవనాశ్వుడు. అక్కడ ధర్మరాజు ఈ విజయవార్త విని ఎంతో సంతోషించాడు. యౌవనాశ్వుణ్ణీ, ఆయన పరివారాన్నీ ఘనంగా సత్కరించాడు. రాజు, పాండవులనూ, శ్రీకృష్ణపరమాత్మనూ దర్శించి మిక్కిలి ఆనందంపొందాడు. ధర్మరాజులవారి అశ్వమేధయాగానికి సర్వ విధాలా తోడ్పడతానని మాట ఇచ్చాడు శ్రీకృష్ణుడు కొన్నాళ్ళు పాండవులవద్ద ఉండి మళ్ళీ ద్వారకా పట్టణానికి వెళ్ళిపోయాడు. ఇదీ జరిగిన కథ.]

శ్రీకృష్ణుడు ద్వారకానగరానికి వెళ్ళిపోయిన పిమ్మట వ్యాస మునీంద్రుడు హస్తినాపురానికి విచ్చేశాడు. అప్పుడు ధర్మరాజు ఎదురుగావెళ్ళి. ఆమునీంద్రుడికి మ్రొక్కి, తీసుకొని వచ్చాడు. అర్ఘ్యమూ పాద్యమూ ఇచ్చి- పూజించాడు. సింహాసనంపై కూర్చుండబెట్టి- సమస్తమర్యాదలూ చేసిగౌరవించాడు. పిమ్మట. "మునీంద్రా! పూర్వం మరుత్తుడనేరాజు యజ్ఞంఎట్లాచేశాడు? నాకు వివరంగా చెప్పవలసినది". అని కోరాడు. అప్పుడు వ్యాస మహర్షి ఇలా చెప్పసాగాడు.

వ్యాసులవారి ధర్మోపదేశాలు

"ధర్మజా! ఆ యజ్ఞవైభవం యావత్తూనీకు చెపుతాను విను; పూర్వకాలంలో మరుత్తుడనే చక్రవర్తి అశ్వమేధ యాగంచేయ తలపెట్టాడు ఆయజ్ఞానికి దేవగురుడగు బృహస్పతులవారిని ఆచార్యత్వం వహించమని కోరాడు. అయితే దేవేంద్రుడికదిఇష్టంగాలేదు. తమగురువగు బృహస్పతి-మరొకరి యజ్ఞం నడిపించడానికి వెడతాడనేటప్పటికి ఆయనకు ఎక్కడలేని అసూయ పుట్టుకొచ్చింది. బృహస్పతి వద్దకుపోయి ఆ యాగానికి వెళ్ళవద్దని నిర్బంధంచేశాడు. అందువలన బృహస్పతి వెళ్ళలేదు. అప్పుడు మరుత్తుడు, ఆవిషయం నారదమహర్షివలన విన్నాడు. వెంటనే బృహస్పతి తమ్ముడగు సంవర్తుని వద్దకు వెళ్ళి ఎట్లాగయినా తన యాగం గట్టెక్కించమని వేడుకున్నాడు. సంవర్తుడు మహాతపస్వి. గొప్ప

మహిమకలవాడు. రాజుకోరిక మన్నించి–యజ్ఞంచేయించడానికి బయలుదేరాడు. ఇంద్రుడూ బృహస్పతీకూడావద్దని ఎన్నివిధాల వారించినప్పటికీ. వినలేదు. వెళ్ళి-వారు ఎన్ని విఘ్నాలు తలపెట్టినప్పటికీ లెక్క-చెయ్యక తనప్రభావంవలన మరుత్తచక్రవర్తి యాగాన్ని మహావైభవంగా నడిపించి, జయప్రదంగా పూర్తిచేయించాడు. ఆవిధంగా మరుత్తచక్రవర్తి-సర్వపాపవిముక్తుడయి-ఉత్తమమగు విష్ణుపదం అందుకున్నాడు-" అని ఇట్లా వ్యాసమహర్షిచెప్పగా విని, ధర్మరాజు—" మహాత్మా! మేయేధర్మాలు చేయడంవలన నరుడు సకల పాపములనుండి విముక్తుడయి తరిస్తున్నాడు? ఆధర్మాలునాకు చెప్పవలసినది."అనిఅడిగాడు. అంతట వ్యాసుడు మరలచెప్పడం మొదలు పెట్టాడు—

"వేదాలూ, ధర్మశాస్త్రాలూచదివి, వాటి సారంచక్కగాగ్రహించి ఆప్రకారంగాధర్మాలు ఆచరించిన బ్రాహ్మడు మోక్షపదవి పొందుతున్నాడు. అదేవిధంగా ధర్మం తప్పక—న్యాయంగా ప్రజలను పాలించిన క్షత్రియుడూ, క్రయవిక్రయాది వర్తకంలో ఒకరిని వంచించక ధర్మంగా ప్రవర్తించిన వైశ్యుడూ, హరినామస్మరణచేస్తూ బ్రాహ్మణభక్తి కలిగి ఉండేశూద్రుడూ తప్పక ముక్తికిపోతున్నారు. నాలుగువర్ణాలవారూ తరించే ధర్మమార్గాలు ఇవి. ఇహ పోతే స్త్రీలు ఆచరించవలసిన ధర్మాలుచెపుతాను, సావధానంగావిను-చక్కని పురుషుడు కంటబడితే అతనివెంట వెళ్ళడం. బిత్తర బిత్తర చూపులుచూస్తూ ఊరికేరెప్పలల్లార్చడం, ఏవో సెగలుచేస్తూ మాట్లాడడం, వెలికత్తెను పిలుస్తున్నట్లో, మరేవోనెపంపెట్టో గట్టిగా పత్తిపలకడం, పలుమార్లు పకపక నవ్వడం, పదేపదేపొరుగిండ్లకు పోవడం. మాటిమాటికీ స్తనాలమీద ఉన్నపమిట జారవిడవడం తానెంతోసిగ్గుకల దానిలానటించడం. పరపురుషుడు చూస్తుండగా చంకనున్నబిడ్డను పదేపదేముద్దాడడం. గోడఎక్కి నిక్కి-నిక్కి చూడడం, జుట్టుముడి, లేకకొప్పు సవరించుకోవడం. భర్తకూ అత్తమామలకూ ఎదురు చెప్పడం—ఇట్లాంటివి జారస్త్రీలక్షణాలు. పతివ్రతలగు స్త్రీలకు ఇట్లాంటి పనులుకూడవు. ఏఆడది పువ్వులమ్మే దానితోటీ, దాసీలతోటీ పనిమనుషులతోటీ, పెంపుడుతల్లితోటీ, మగని విడిచిన పతితోటీ, మంత్రసానులతోటీ, తార్పుడుగత్తెతోటీ, బిచ్చగత్తెతోటీ, ఆకులమ్మే దానితోటీ, విధవరాలితోటీ — స్నేహంచేస్తున్నదో ఆ ఆడది కులటగాని కులస్త్రీ కాదు. వీరిలో ముఖ్యంగా దాది, తార్పుడుగత్తె వీరిద్దరూ తోడయితే, జారస్త్రీని వేయి విధాల కాపాడగలరు ఎంతటిఅపాయంనుండిఅయినా, రక్షించగలరు, వీరిద్దరూ అండగాఉంటే వ్యభిచారిణి ఎంతటి సాహసాలకయినా తెగిస్తుంది. కాబట్టి అభిమానంకల మగవారు—ఇటువంటి స్త్రీలకెప్పుడూ చనువివ్వ కూడదు. పుట్టింది మొదలు చచ్చేపర్యంతంకూడ ఇటువంటి స్త్రీలను నమ్మరాదు ధర్మరాజా. స్త్రీలబుద్ధి అతి చంచలం. ఎప్పుడో ఒకప్పుడు వారిమనస్సు పరపురుషుడిపైమళ్ళుతుంది. ఒకవైపుమగడూ, మరొకవైపూఅత్తా మామలూ, కత్తులబోనులో పెట్టిఉంచినట్లు ఉంచితేతప్ప. స్త్రీలుమాట వినరు. విధవరాలగుస్త్రీ-ఉపవాసాలతోదేహాన్ని శుష్కింప చేసుకోవలసిందేకాని— కమ్మని రుచులుమరిగి పంచభక్ష్య పరమాన్నాలతో దేహాన్నిపోషించుకో కూడదు. మాసిన వలువలు కట్టవలసిందేకాని-చీనిచీనాంబరాలు ధరించకూడదు. ఆభరణాలపైనా అలంకారాలపైనా మక్కువ పడకూడదు. ఉన్నద్రవ్యాన్ని దానధర్మాలకు వినియోగించాలేకాని వడ్డీలకిచ్చి కూడబెట్టకూడదు తల్లిదండ్రుల అధీనంలోనే ఉండి బ్రతుకు వెళ్ళవార్చాలేకాని, పొరుగిండ్లలో పోయిఉండకూడదు. హరినామస్మరణచేస్తూ కాలం గడపవలసిందేకాని. అనవసరమైన ప్రసంగాలతోనూ, దుర్భాషలతోనూ ప్రొద్దుపుచ్చకూడదు. ఇవి విధవరాలగుస్త్రీ ధర్మాలు. ఈధర్మాలుతప్పినస్త్రీ తనభర్తతోసహా అనేక కల్పాంతాల కాలం పలువిధాలయిన

నరకకూపాలలో కూలి, బాధలనుభవిస్తుంది. స్త్రీలకు ఎన్నటికీ స్వాతంత్ర్యంలేదు చిన్నతనంలో తల్లిదండ్రుల అధీనంలోనూ, పెద్దదయిన పిదప పెనిమిటి ఆజ్ఞలోనూ, వృద్ధాప్యంలో కొడుకుల అధీనంలోనూ స్త్రీ-మెలగవలసి ఉన్నది అంతేకాని తన ఇష్టప్రకారం తిరిగేవీలులేదు ఏ స్త్రీకి నాలుక, చెక్కిళ్ళు, నీలిరంగుగా ఉంటాయో, ఏ స్త్రీ పాదాలు భూమిమీద సరిగా ఆనకుండా ఉంటాయో, అటువంటి స్త్రీ వైధవ్యం అనుభవిస్తుంది; తప్పదు ఏ పురుషుడు విధవరాలితో సంభోగక్రీడ సాగిస్తున్నాడో ఆ పురుషుడు అంతులేని రౌరవాది నరకంలో కూలుతున్నాడు ధర్మరాజా! నీవు అడిగిన ధర్మాలు—కొన్ని చెప్పాను. జూదగాళ్ళనూ, నాస్తికులనూ, మత్సరగ్రస్తులనూ, కొండెములు చెప్పేవాళ్ళనూ నీవు దగ్గరికి చేరనీయకు నీ ప్రజలను న్యాయంగా ధర్మంగా పరిపాలించు-ధర్మపరిపాలనవలన నీకు మోక్షం సిద్ధిస్తున్నది అంతేకాదు ప్రజానుకూలుడవై పరిపాలన సాగిస్తే నీకు ధనం, ధనం వలన ధర్మం, ధర్మంవలన యశస్సు ప్రాప్తిస్తాయి. క్షత్రియుడికెప్పుడూ ధర్మపరిపాలన అత్యావశ్యకము. కనుక ధర్మపరిపాలన సాగించి శ్రీహరి స్మరణచేస్తూ కాలంగడుపు నాయనా! నీకు ఇహంలో సుఖమూ, పరంలో మోక్షమూ లభిస్తాయి. శ్రీహరిని ధ్యానించని బ్రాహ్మడు, బ్రాహ్మడయినాసరే—చండాలుడితో సమానుడు. శ్రీహరిని సేవించే చండాలుడు, చండాలుడయినాసరే — బ్రాహ్మణతుల్యుడూ ముల్లోకపూజ్యుడూ అవుతున్నాడు నాయనా!—" అని ధర్మోపదేశం చేశాడు వ్యాసమహర్షి. అదివిని ధర్మరాజు—"మహర్షివర్యా! మానవులకు విష్ణుభక్తి ఏతీరునకలుగుతుంది.? ఎవడిగృహంలో లక్ష్మీదేవి స్థిరంగావాసంచేస్తుంది? సెలవీయండి—" అని అడిగాడు. అప్పుడు వ్యాస భగవానుడుమరలచెప్పసాగాడు. "ధర్మనందనా! ఎవడు తనశక్తివంచన లేకుండా పితృకర్మలు నెరవేరుస్తున్నాడో, ఎవడు తీర్థయాత్రలు సేవిస్తున్నాడో, ఎవడు వితరణబుద్ధీ, వినయమూ కలవాడో, ఎవడు పరస్త్రీని కన్నెత్తిచూడడో, ఎవడు శౌర్యాంకలవాడో, ఎవడు పొగడ్తలంటే గిట్టనివాడో, ఎవడు సత్యమూ, శుచిత్వమూ కలవాడో, ఎవడు తల్లిదండ్రులనూ, బంధుజనులనూ భక్తితో పోషిస్తాడో, ఎవడు పాపంచేయ వెరుస్తాడో, ఎవడు సప్తసంతానాలు పొందుతున్నాడో, ఎవడు సమస్త భూతకోటియందు దయకలవాడో, ఎవడు చేసినమేలు మరువనివాడో, అటువంటి పుణ్యాత్ముని గృహంలో లక్ష్మీదేవి చాలాప్రియంతో ఎల్లప్పుడూ వాసం చేస్తూఉంటుంది. లక్ష్మీదేవి ఎక్కడుంటుందో విష్ణుమూర్తి అక్కడే ఉంటాడు కాబట్టి అటువంటివారు హరిభక్తులు, హరిప్రియులు అవుతున్నారు. జూదగాడు, దుష్టుడు, దుర్వ్యసనాలు కలవాడు, దొంగ, సజ్జనుల దూషించేవాడు, అబద్ధాలకోరు, దయలేనివాడు, ఇళ్ళు తగులపెట్టేవాడు, లోభి, నిరంతరం తనపొట్టతాను చూచుకునేవాడు, మహాగర్విష్ఠి—ఇటువంటివారి వద్ద లక్ష్మీదేవి ఒక్క క్షణం ఉండదు ధర్మరాజా! పరులయింట భుజించే బ్రాహ్మణుని, వేద విద్యలు ఎట్లా విడిచిపోతాయో అట్లాగే వీరిని లక్ష్మీదేవి విడిచివెళ్ళిపోతుంది. నాయనా, ధర్మనందనా! మునుపు నీవు దుర్వ్యసనంవలన జూదం ఆడావు అందువల్ల లక్ష్మి నిన్ను విడిచి పెట్టింది. నీవు అష్టకష్టాలూ అనుభవించావు. చివరకు ఎంతో అనర్థం వాటిల్లింది. అదంతా మా వంటి వారం చూడలేక మిక్కిలి బాధపడిపోయాము. కాబట్టి నాయనా! ఇహనయినా నీవు ధర్మం తప్పక నడుచుకో. నిరంతరం శ్రీహరిపాదపద్మముల పయి చిత్తం నిలుపుకో. అంతేకాదు నాయనా! వ్యతీపాతయోగం, వైధృతియోగం, సంక్రాంతి, పర్వదినాలలోనూ, తీర్థయాత్రలోనూ, వ్రతంలో ఉన్నప్పుడూ పితృకర్మలందునూ,— ఇటువంటి సమయాలలో స్త్రీని ముట్టరాదు నాయనా. అట్లా స్త్రీని పొందే పురుషుడిదగ్గరికి—లక్ష్మీదేవి రావడానికి జంకుతుంది. నీవు అడిగిన ప్రకారం ధర్మాలు విడమర్చి చెప్పాను. ఆ ప్రకారం ఆచరించు. ఇహ ఇప్పుడు నీవు అలసత్వం చేయక అశ్వమేధ యాగం నెరవేర్చ వలసి ఉన్నది.

కాబట్టి శ్రీకృష్ణుణ్ణి పిలిపించు నాయనా. సమస్త శుభాలూ చేకూరడానికి ఆ శ్రీకృష్ణుడే కదా కారకుడు—" అని ఈ ప్రకారం చెప్పి, వ్యాసుడు ఊరుకున్నాడు వెంటనే ధర్మరాజు—మహాబల శాలియగు భీమసేనుణ్ణి పిలిచి— "తమ్ముడూ! నీవు తక్షణం ద్వారకాపురికి వెళ్ళు—ఆ శ్రీకృష్ణ పరమాత్మను దర్శించి, యజ్ఞానికి యోగ్యమైన చైత్రమాసం వస్తున్నదని చెప్పు. చెప్పిఆయనను బంధుమిత్రసహితంగా వెంటపెట్టుకునిరా; పుర జనులందరినీ పిలుచుకునిరా నాయనా"— అని చెప్పాడు. అంతట భీమసేనుడు అన్నగారి పాదాలకు ప్రణమిల్లి ఆయన ఆజ్ఞ చొప్పున ద్వారకాపట్టణానికి బయలుదేరివెళ్ళాడు

ద్వారకాపట్టణం మహావైభవంతో వెలిగిపోతున్నది వైకుంఠాన్ని తలదన్నుతున్నట్లున్నది ఆశోభ వర్ణించ నలవికాదు ఆపుర వైభవాన్ని మహాఆశ్చర్యంతో తిలకిస్తూ భీమసేనుడు అపరస్వర్గంలాగాఉన్న శ్రీకృష్ణుని రాజభవనంలో ప్రవేశించాడు. ద్వారపాలకుల ద్వారా తనరాక చెప్పి పంపించాడు శ్రీకృష్ణుని అనుమతిపై పరిచారకులువచ్చి భీమసేనుని సకల మర్యాదలతో మందిరంలోనికి తీసుకుని పోయారు.

భీమసేనుడు వెళ్ళేటప్పటికి కృష్ణపరమాత్మ భోజనంఆరగిస్తున్నాడు ఆయన భోగంవర్ణింప తరం కాకుండ ఉన్నది. పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించారు. కమ్మని మధురపానీయాలు రకరకాలు తెచ్చిపెట్టారు లోకంలో కమ్మని రుచులుగల అనేకరకాల పక్షుల మాంసంతోను, జంతువుల మాంసంతోను, సుగంధద్రవ్యాలుకలిపి కమ్మని వంటకాలువండి వడ్డించారు. అప్పడాలు, వడియాలు, రకరకాల కూరలు, పిండివంటలు, ఊరగాయలు, పచ్చళ్ళు, పెరుగు, పాలు, పాయసం, అన్నం తిన్నవారికి సయితం నోరూరిస్తున్నవి. శ్రీకృష్ణుడు మణిమయపీఠం మీదకూర్చున్నాడు. దేవకీ దేవి బంగారు పళ్ళెరంలో సన్నబియ్యపు అన్నం వడ్డించగా తృప్తిగా భుజిస్తున్నాడు. రుక్మిణీ సత్యభామలు చెరియొక వైపున కూర్చుండి ఆయనకు వింజామరలు వీస్తున్నారు. ఆవిధంగా ఏమహారాజుకులేని రాజభోగం అనుభవిస్తున్న శ్రీకృష్ణుణ్ణిచూచి భీమసేనుడు భక్తితోప్రణామం చేశాడు వాసుదేవుడు చిరునవ్వులు చిందిస్తూ భీమునివంక చూచాడు. "బావా, భీమసేనా! నీవుచెప్పదలచిన విషయాలన్నీ తరువాత చెపుదువుగాని, ముందువచ్చి భోజనం చెయ్యి. నీవు అసలే భోజనప్రియుడవు ఎంత ఆకలిగొనియున్నావో, పాపం! భోజనంచేస్తేగాని నీబుద్ధిపనిచెయ్యదు బావా! సిగ్గుపడకు. ముందుభోజనం కానీ" అని సరసమాడాడు. అందుకు భీమసేనుడు చిరునవ్వునవ్వి "బావా, వాసుదేవా! ఎంతనంగనాచివయ్యా! అక్కడ నేనేమో భోజనప్రియుడయినట్లూ నీవేమో కానట్లూ. అందుకే కాబోలు, పురిటిలోనే తల్లి పాలుచాలక పూతన పాలుత్రాగావు అమ్మ పెట్టిన ఉగ్గుపాలతో తృప్తిపడక వ్రేపల్లెలో ఉన్న వెన్న, పాలు పెరుగు దొంగిలించావు. యశోదమ్మ పొత్తునఅన్నం తిన్నది చాలక ఇంద్రోత్సవంనాడు అన్నరాసులన్నీ మెక్కికూర్చున్నావు. అమ్మ పెట్టినఅప్పచ్చులతోతనివి తీరక కుచేలునిచేతి అటుకులు గుంజుకున్నావు అంతేకాదు వాసుదేవా. బ్రహ్మాండ భాండాలన్నీ బొజ్జలోదాచుకొన్నా నీకుతృప్తి తీరలేదయ్యా? మరినీపొట్టముందునాపొట్టఎంత! అవునాబావా!" అని తిరిగి సల్లాపాలు ఆడాడు భీమసేనుడు సరసాలు చాలించిన పిమ్మట కృష్ణపరమాత్మ సరసనకూర్చొని, సమస్తపిండివంటలూ పదార్థాలూ వడ్డించగా తృప్తితీర భోజనంచేశాడు భీమసేనుడు తరువాత వారిరువురూ విశ్రాంతి మందిరంలోకి వెళ్ళిపోయారు, అక్కడ కూర్చుని కర్పూరతాంబూలాలు సేవించారు. పిమ్మట శ్రీకృష్ణుడు భీమసేనుణ్ణి-వచ్చినకార్యమేమని అడుగగా భీముడు విషయమంతా సవిస్తరంగా చెప్పాడు అన్నగారి ఆజ్ఞవినిపించి సపరివారంతో హస్తినాపురానికి విచ్చేయమని కోరాడు. అప్పుడు కృష్ణుడు కృతవర్మనుపిలిచి- "పురజనులందరినీ ధర్మరాజులవారి అశ్వ

మేధం దర్శించ ప్రయాణసన్నాహంచేయించు. పురరక్షణకు మానాయనగారు వసుదేవుణ్ణీ, మాఅన్న బలరాముణ్ణీ నియోగిస్తాను—" అని చెప్పాడు. కృతవర్మ వెంటనే ఆ విషయం పట్టణమంతటా చాటింపుచేయించాడు ఇంకేం? ద్వారకాపురవాసులు—ఆబాలగోపాలం మహా సంతోషంతో ధర్మరాజులవారి అశ్వమేధయాగం చూచేటందుకు సమస్తసన్నాహాలతో హస్తినా పురానికి ప్రయాణమై వెళ్ళిపోయారు. ఆవిధంగా పురజనులను ముందుపంపి పిమ్మట శ్రీకృష్ణుడు తండ్రియగు వసుదేవుని చెంతకుపోయి నమస్కరించాడు. తాను ప్రయాణమై పోతున్నానని చెప్పాడు. అప్పుడు వసుదేవుడు శ్రీకృష్ణుణ్ణి చూచి—"నాయనా, కుమారా! నీవుయజ్ఞంచూడ డానికి పోతున్నావు కాబట్టి ఈసమయంలో విష్ణుకథలంటే వినడానికి ఇష్టంలేని వారినీ, అన్యాయవర్తనం కలవారినీ, పురుషార్థాలు సాధించనివారినీ, తపస్సుచేయని వారినీ, మిత్ర ఘాతకులనూ, స్వామి ద్రోహులనూ, పతితులనూ, యుద్ధంఅంటే భయపడేవారినీ, పరస్త్రీలను కోరేవారినీ అల్లుళ్ళసొమ్ములు అపహరించే అధములనూ ధర్మబాహ్యులనూ, విసూషకులనూ దుర్వ్యసనాలు కలవారినీ, అధికప్రసంగాలు చేసేవారినీ విశ్వాసఘాతకులనూ, ఋతుకాలధర్మాలు పాటించని వారినీ, కష్టదశలో ఉన్నవారినీ, లోభులనూ, ఖలులనూ, ఆత్మస్తుతి చేసుకునే వారలనూ, కలహాలకు కాలుదువ్వేవారినీ, కృతఘ్నులనూ ఆత్మబృత్యులను వంచించేవారినీ, ఆతతాయులనూ—వీరంతా ఎంతధనికులూ గొప్పవారూ అయినాసరే వెంటతీసుకుని పోవద్దునాయనా.." అనిచెప్పాడు. తరువాత "నాయనా, కృష్ణా, నిన్ను చూడనిది నేనొక్కక్షణం బ్రతుకగలనటరా, నన్నుకూడా నీవెంటతీసుకుని వెళ్ళు"- అనిఅడిగాడు. కాని కృష్ణుడు "నాయనాగారూ! తాము నగర రక్షణార్థం ఇక్కడ ఉండకతప్పదు నేనువచ్చేదాకా ఎట్లాగో ఓర్పుపట్టిఉండండి. యజ్ఞం అయిపోగానే వచ్చేస్తాను.." అని చెప్పి తండ్రినిఒప్పించితాను సమస్తబంధుమిత్ర కళత్ర సహితంగా భీమసేనుని వెంటబయలు దేరాడు. ఆవిధంగా సుముహూర్తాన పల్లకీలు, మేనాలు, పరివారంతో బయలు వెడలి-సాత్యకి ప్రభృతులు వెంట పరివేష్టించిరాగా ఉత్తమాశ్వం అధిరోహించి దేవేంద్రుని చందాన మహా వైభవంగా ప్రయాణం సాగించాడు శ్రీకృష్ణుడు. అట్లా వెడుతూ ఉండగా — పరివారంతోపాటు వస్తున్నవృద్ధవేశ్యలను భీమసేనుడికిచూపి శ్రీకృష్ణుడు, అతనితో పరిహాస మాడాడు. "బావా! భీమసేనా! ఈవృద్ధవేశ్యలను నీవు పరిగ్రహిస్తావా ఏమిటి? నీభయంకర ఆకారానికీ నీకూ వీరుఅన్నివిధాలతగిపోతారు బావా!—" అని పలికాడు. అప్పుడు భీముడు నవ్వుతూ "వాసుదేవా! మునుపునీవు మధురాపురంలో కుబ్జఅనే గూనిదాన్ని చక్కని చుక్కను చేసిపొందావు. మునుపునీపాదఘాతిచే రాతిని నాతిగాచేసి అనుగ్రహించావు. ఇటువంటి పనికిమాలిన వారినందరినీ బాగుచేయడం నీకు తెలుసుకాని నాకేంతెలుసు వాసుదేవా? నీఅనుగ్రహం ఉంటే ఎందుకూ కొరగాని అందవికారంగల ఈ వృద్ధవేశ్యలు అందాలరాణులు కారటయ్యా?—" అని బదులు పలికాడు.

సరోవరతీరంలో కృష్ణుని విడిది.

ఇట్లావారు పరాచకాలాడుకుంటూ కొంతదూరం ప్రయాణం చేశారు. అంతట ఒకచక్కని సరోవరం వారికి కనుపించింది. చుట్టూపూలపొదలతోనూ, ఫలవృక్షాలతోనూ పక్షులకలకలధ్వనులతోనూ, ఎంతోరమణీయంగా ఉన్నఆసరోవర తీరంలో విడిది చేయడానికి నిశ్చయించుకున్నాడు కృష్ణుడు పరివారాన్ని అక్కడ ఆగమని ఆజ్ఞాపించాడు ఆవిధంగా సైన్యం యావత్తూ సరోవరంవద్ద గుడారాలుదింపి అక్కడ విశ్రాంతి తీసుకున్నది శ్రీకృష్ణుడు తన భార్యామణులతో ఒక విశాలమగుచల్లని చెట్టునీడన విశ్రమించాడు. కొంతసేపురుక్మిణీ, సత్యభామాదులతో సరససల్లాపాలాడుతూ కులాసాగా గడిపాడు. తరువాత ఆచేరువలో

ఉన్న పల్లెనుంచి కొందరు గొల్లలు శ్రీకృష్ణుని దర్శించ వచ్చారు. ఆగొల్లవారి వేషాలు వింత గొలుపుతున్నాయి. ముఖాన తెల్లనిపట్టెవర్ధ నాలు తీర్చి నామాలు పెట్టారు. నడుముకు గొంగళ్ళు చుట్టారు చెవులసందున ఇంతింత పొడవున నెమలిఈకలు దూర్చారు. కాళ్ళకు చెప్పులు తొడిగారు పెరుగు, పాలు నెయ్యి కుండలతో నింపిన కావళ్ళు బుజానపెట్టారు. మెల్లమెల్లగా ఆగొల్లలు గొల్లకృష్ణుని సన్నిధికి వచ్చి కావళ్ళు దించారు. ఆయనకు సాష్టాంగపడ్డారు సంతోషంతో కౌగలించుకున్నారు. తాముతెచ్చిన ద్రవ్యాలు పరమాత్మకుకానుకగా సమర్పించారు. చుట్టూచేరి కూర్చున్నారు. "కిష్టయ్యా! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు నిన్ను చూశామయ్యా! మాకంటికే కనిపించక ఇన్నాళ్ళుఏడనుంటివయ్యా? మమ్మల్ని మరిసిపోతివా ఏంటి? అరెరె! ఎంత సిత్రంగా మారిపోయినవు! కొండగోగుపూవుల చాయనున్న ఈకంబళి వోరు నేసిరయ్యా కిష్టయ్యా? చక్కనిచుక్కలు కూర్చినట్టున్న ఈతెల్లగురువిందల పేరెవరు గుచ్చినారయ్యా? చంద్ర నిప్పుల చందానఉన్న ఈగాజుపూసలు ఏడ తెచ్చుకున్నవయ్యా? ఆనల్లని తిరునామం ఏడదొరికె? అబ్బా! గబ్బుపుడుతుందదే? ఆ మెడమీద జడలేందీ? అయాలాడటం ఏందీ? మనిసివే మారిపొయినవే? ఈబొడకోడె ఏడ సంపాదించినవు? ఏంటికత? నీచుట్టూఉన్న ఈ గొల్లలు ఏడనుంచి వచ్చిరు? ఇంత ఇంత వేసాలేసుకున్నరే?" అని ఈవిధంగాపల్లెనుంచి వచ్చిన ఆవెర్రి గొల్లల మూఢవాక్యాలు విని గోపాలకృష్ణుడు ఎంతో ముచ్చొందాడు. వారందరినీ తగువిధంగా ఆదరించి సంతోష పెట్టాడు. అంతట ఒక గొల్లపడుచు ఒకపాల కుండతెచ్చి కృష్ణుని ముందుపెట్టింది. ఒక గోపిక పెరుగు దుత్తలుతెచ్చి ఇచ్చింది. ఒక గోపకన్యక తులసీదళాలు పూలతోకూర్చి కట్టిన మాలతెచ్చి మెడలోవేసింది. ఒక యాదవాంగన కమ్మనిపిండివంటలు తెచ్చిఇచ్చింది. వారందరూ గోపాలకృష్ణుణ్ణి పెక్కువిధాల పొగిడారు. ఒక గోపకాంత పుటకతేనెతెచ్చి అందించింది. ఆమెనుచూచి గుర్తుపట్టాడు కృష్ణుడు. ఒకప్పుడు ఆసుందరి అధరామృతం గ్రోలాడుతాను. అదిగుర్తువచ్చి తనలోతాను చిన్నినవ్వు నవ్వుకొన్నాడు. శ్రీకృష్ణుడు. ఇంకొక్క ఇందీవరాక్షి అందలపూమాలతెచ్చి మెడలో అలంకరించింది. చేతులుచాచి వెనకటి సంగతిగుర్తుచేసింది. తానామెను తన బిగి కౌగిలిలో చేర్చుకున్న విషయం జ్ఞప్తితెచ్చుకుని ఆసుందరిని కన్నుగీటాడు కృష్ణుడు. మరొక బంగారు బొమ్మలాంటి గోపెమ్మవచ్చి బిల్వ ఫలాలు సమర్పించింది. ఒయ్యారంగా తన గుండ్రని కుంభస్తనాలుచూపి చిరునవ్వి నవ్వింది. తాను ఆమె కుచమర్దనంచేసిన సంగతి గుర్తు తెచ్చుకుని వాటివంక ఓరచూపులు చూస్తూకూచున్నాడు వాసుదేవుడు. వేరొక వన్నెలాడి నెమలిపింఛాలు కుంచెగట్టి తెచ్చి కృష్ణుడిముందు పెట్టింది తనకొప్పుచూపి ఏదో జ్ఞాపకం చేసింది తానామె కొప్పుపట్టిలాగిన విషయం గుర్తుతెచ్చుకుని కనుసైగచేశాడు కంసమర్దనుడు. ఆవిధంగా ఆగొల్లపడుచులు ముసిముసి నవ్వులు నవ్వుతూ, సైగలుచేస్తూ తమకు ఆతనితోగల పూర్వపు చెలిమిని పలు విధాల ప్రకటించి—ఆయనను సంతోషంలో ముంచారు. కొంతసేపు అలాగడిపిన తరువాత కృష్ణుడు, ఆ గొల్లలనూ గొల్లపడుచులనూ ప్రేమతోఆదరించి, పంపించివేశాడు తాను తన పరివారంతో ఆరాత్రి ఆ సరోవరతీరంలోనే సుఖంగా గడిపాడు. మరునాడు వేకువజాము ననేలేచి సైన్యాలతో బయలుదేరి కాళిందీనదీ తీరానికి చేరుకున్నాడు అక్కడ సైన్యాలను ఆపి — తాను యశోదానందులున్న చోటికి వెళ్ళాడు. వారికి నమస్కరించాడు. "నేను హస్తినాపురానికి వెడుతున్నాను. మీరు కూడా ప్రద్యుమ్నాదులను వెంటపెట్టుకుని హస్తినా పురానికి బయలుదేరండి. కుంతీదేవి వసుదేవుని చెల్లెలు. అర్జునుడితల్లి. నాకు సాక్షాత్తు మేనత్త కాబట్టి మీకన్నా పూజ్యురాలు మీరామెను దర్శించి పూజించుట మర్యాద

ధర్మరాజులవారి అశ్వమేధ యాగం కూడా కళ్ళారాచూచి వద్దురుగాని. సత్వరం బయలు దేరి రండి_"అనివారికి చెప్పాడు తరువాత ప్రద్యుమ్నాది కుమారులనుచూచి "మీరుమన ద్వారకానగరంలోవలే తిరికూర్చోటానికి వీలు లేదు ధర్మరాజులవారి యాగానికి అనేకవిధాల తోడుపడవలసి ఉన్నది. మీపిరికితానాలు, పిల్ల తానాలు అక్కడ చూపకండు. సింహరాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు గోదావరీనదిని చూచి సమస్త తీర్థాలు బెదిరిపోయి చూచి నట్లుగా మీరక్కడ అర్జునుని పరాక్రమంచూచి ముఖాలు తేలవేయకండి. మీరూ మీవీరత్వాన్ని ప్రదర్శించి అతనిమెప్పు పొందండి" అని పలికాడు. తరువాత హస్తినాపురానికి వెళ్ళినప్పుడు తాను తనకోడండ్రు, దేవకీదేవి, కుంతీదేవి వద్దఉండి పరిచర్యలు చేసేటట్లున్నూ, ఉషా కన్య తనచెలులతో ద్రౌపదివద్ద ఉండేటట్లున్నూ, ప్రద్యుమ్నాది యాదవయువకులు ధర్మరాజుల వారిని సేవించేటట్లున్నూ తనబాల్య సఖులగు గోపాలకులు అర్జునుని కనిపెట్టుకొని ఉండే టట్లున్నూ ముందే అందరికిచెప్పి ఏర్పాట్లు చేశాడు. పిమ్మట కృతవర్మను, భీమసేనుని చూచి "మీరిద్దరు మనసైన్యాలను వెంటపెట్టు కొని మెల్లగావెనకాల రండి నేనుముందుగా హస్తినాపురానికి వెళ్ళిపోతాను" అనిచెప్పాడు, ఇట్లుచెప్పి శ్రీకృష్ణుడు గుర్రంఎక్కి కొద్ది మంది పరిజనులతో వేగంగా ప్రయాణం సాగించి హస్తినాపురం చేరుకున్నాడు.

(సశేషం)

ఆంధ్రభాష - అవ్యవస్థ

శ్రీ 'గాండీవి'

భాషకు నిఘంటు వ్యాకరణములు రెండును రెండు నేత్రములు. అవి నిర్దుష్టములై యుండవలెను. నేటికి వెలువడిన వానిలో శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు బృహద్గ్రంథము. ఇప్పటి కాఱు సంపుటములు వెలువడినవి. ఏడవదికూడ వెలువడినట్లు తెలియుచున్నది. ఈ నిఘంటువున లేని పదములు పెక్కు గోచరించు చున్నవి. ఒక కొన్ని యిటఁ బ్రదర్శించు చున్నాను.

1 అస్థిర. "క, న్గొన్న మహోగ్ర పాతకమగుందనువస్థిర మృత్యు వెప్పుడున్ సన్నిహిత స్థితిన్ మెలఁగు" (ఉ. రా. 3-46) ఇది చరిత్రాదులలోనిదిగా గ్రాహ్యము.

2 ఆలజాలము "ఆలజాలంబు నీరిలో నాడు జాడ" ఉ. హ. 5-110 దీనిని గూర్చి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చర్చించి "మీన పదము" అను నర్థమును సప్రమాణముగా నిరూపించి యున్నారు. (చూ. తెలుఁగు మెఱుఁగులు.)

3 ఆడంగి ఈ పదము గ్రామ్యములోఁగలదు. నిర్మూలమని కాఁబోలు 'సూ.ని' కర్తలు పేకొంచిరి, "అద్దిరా మదియించి రాడంగులందఱిఁ, జదియఁగొట్టెద నంచు గద ధరించి" వరాహ 11-103.

4 ఆరాత్. 'ఆరాన్నిపతత్సుమంబు' ఉ. రా. 3-210.

5 ఉద్దేసించు.'అలరంగఁ బ్రమథాధిపుల నుద్దేసించి. పండితా.దీక్షా 140 పు. 'తన్ను మహాభక్తతతి యుద్దేసించి' బసవ.

6 ఉపధావించు. 'వె,న్వెంటందివ్యక రేణువ్రజ ముపధావింపంగ.' కాశీ 3. 199.

7 ఉపపురందరుఁడు.'హుంకారములులేవె యుపపురందర హరోత్పాటనంబునకుఁబాల్పడవుగాక.' పాండు 5-176.

8 ఉల్లాఘము. ఇది 'శ.ర' లో గలదు. 'సూ. ని' గ్రహింపకపోవుట శోచనీయము. "కంబుకంఠి కదంబంబు పయిఁబట్టిన యుల్లాఘంబు." వసు 6-9.

9 ఎడుమ - ఆశీరర్థక ప్రత్యయము. ఇది "'డుమ' అనియో 'డుము' అనియో నిర్ణయింపరాకున్నది." (వ్యా. సం. సర్వ 1390 పు.) అని శ్రీ వజ్ఝలవారు వ్రాసి 'ఎడుమ' ప్రత్యయమునే స్వీకరించిరి. ('డుము' అని వ్యవహరించినను 'ఎడుము' అనియే వారి యభిప్రాయము. చూ. వ్యా. సం. సర్వ 1388 పు. 1389 పు. విస్తర 304 విషంభా. ఉద్యో. 16, 362. 372) పు. శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు 'ఎడుము' అసలు ప్రత్యయమనియు దాని యవధారణ రూపము 'ఎడుమ' అనియు

నవంబరు 1960 భారతిలో వ్రాసిరి 'అయ్యోడుమని' అనుచోట 'అయ్యోడుము'+ ఆని " అనుపది శ్రీ దీపాలవారి పదచ్ఛేదము. "అయ్యోడుమయని" అనురీతి నుండు నప్పుడు "ఏడుము" యొక్క యవధారణ రూపమగు 'ఏడుమ' ప్రయుక్తమగుటచే సంధి లేదని వారి తలంపు. "అయ్యోడుమ + అని" అను పదచ్ఛేదమున "అయ్యోడుమని, అయ్యోడుమయని" అను ద్వివిధరూపములు సిద్ధించుచునే యున్నవి. శ్రీ పిచ్చయ్య శాస్త్రిగారు 'ఏడుమ' అనుదాని నవధారణముగా నైనను నంగీరించుచునే యున్నారు ఈ క్లేశముకంటె 'ఏడుము' ప్రత్యయమని యంగీకరించుటయే యుచిత తరము 'ఏడ ము'లోని ముపర్ణమును నిర్వహించు ప్రయోగము చూపఁగలిగినచో వారి వాదమునకు బలముండును. ఆ ధ్ర శబ్ద చింతామణిలో "ఆశీషికాప్రత కాతా వెడుతేత్యాద్యా భవన్తికాకళ్ళు (క్రియా 18.) అను సూత్ర మొకటి గోచరించుచున్నది. "ఏడుతేత్యాద్యా" అనుచోట "గాతా వెడుమిత్యాద్యా - గాతా వెడమెత్యాద్యా అను పాఠాంతరములు బాలసరస్వతీయముననే చూపబడెను. వీనిని బట్టి 'ఏడుమెత్యాద్యా' చింతామణి పాఠము కాఁదగును "ఏడుము + ఇత్యాద్యా-" 'ఏడుమ్మిత్యాద్యా' చింతామణి పాఠమన్నచో గణభంగము వాటిల్లును. కాన నిదియు 'ఏడుమ' పాఠమునే బలపఱుచుచున్నది. ఈ పక్షమున 'డుమ కాతో'అను నాథర్వణము ప్రక్షిప్తమగును.

ఇక్కడ మఱియొక విషయము శ్రీ పిచ్చయ్య శాస్త్రిగారు "తము-తమ" అనునవికూడ నాశీరర్థకము లనుచున్నారు. కాని మకార స్థితిని నిర్వహించు ప్రామాణిక ప్రయోగము లేదు. సంస్కరణ లోపమువలన ముద్రణములకెక్కినంత మాత్రమున నిది యంగీకార్యము కాదు శాసన ప్రయోగములు సాకల్యముగాఁ బ్రమాణీకరింపఁ దగినవి కావు గాన 'ఈ ప్రతము' అను శాసన ప్రయోగము ప్రామాదికము. 'ఈ వ్రతన్' అను దానితోపాటు 'ఈ వ్రతము' అనునదియు సామ్య భ్రమచే వచ్చినదే. దీనిలోని పక్షమును నిర్వహించు ప్రామాణిక ప్రయోగము గాని లాక్షణిక వచనముగాని లేదు. శాసనము ప్రబల ప్రమాణమన్నచో 'ఏడుమ' ప్రత్యయమునే యంగీకరింపవలసి వచ్చును. చూ. గిడుగు వారి వ్యాసావళి. చిన్నయ సూరి నీతిచంద్రిక 139 పు

కాఁగా 'ఏడుమ' అనునది ప్రత్యయమని నిఘంటువునఁ జేర్చ వలెను. 'ఏడుము' అని యైనఁ గావచ్చునని సూచించిన సూచింప వచ్చునని ఫలితార్థము ఇది వివాదాంశమగుటచేఁ గొంత విస్తరించి వ్రాయవలసి వచ్చినది.

10 ఎసప్పు. "భువిశివ నిర్మాల్యా భూతయన నెసపి." పండితా. దీక్షా 75 పు.

11 కంబకట్టు. 'కంబకట్లును మేలుకట్లును జుంబి, తంబులై యొప్ప నూతన ఫలావళులు' పండితా. పర్వత 420 పు. "కంబకట్టులు మేలుకట్టులునయ్యో" నన్ని కుమార.

12 కంభము. 'కంభాల యెత్తున గంటల వెనుక, గంభీరమగు కొల్చు గాదెలలోన' పండితా. దీక్షా 130 పు. 'కంభ' శబ్దము సంస్కృతమునఁ గలదు.

13 కతిచిత్ "తస్మిన్నద్రౌ కతిచిదబలా విప్రయుక్తస్స కామీ" మే. స. స. 1-2.

14 కలవాఁడు. 'కంబుకంఠి నీవు కలవాఁడు కలవాఁడు' కాశీ 3-47. 'లేనివాడు' అను పదమువద్ద సూ. ని. కర్త ఈ పద్యమునే యుదాహరించినారు.

15 కానినేయుఁడు. 'కాశికా పట్టనముమీఁదఁ గానినేయ' భీమ 2-114 "కార్య సంసిద్ధిఁ బొందెదు కానినేయ. భీమ 3-213. ఈ శబ్దసాధుత్వమును గూర్చి స్థలాంతరమునఁ జర్చించి యున్నారు. చూ. జయంతి

16 కాకి కడకంటి చూపుపై వచ్చుట "కాకికడకంటి చూపుపై రాక మున్న" కాశీ 3-84 దీనిని 'కాకి' శబ్దము నొద్దఁ జూపి యిది మరణావస్థా సూచకమని తెలుపవలెను." యావత్ స్వస్థి మేదేహః" అను మూలమునకిది తెనిఁగింపు.

17 క్రేకన్ను. "ప్రాకటంబుగ వచ్చు పశ్యాంగనలను, గ్రేకంట జూచుచుఁ గేలిసేయుటలు" పండితా. పర్వత 318 పు. "క్రేకంట లింగంబు డాకన్నుఁజూచి" బసవ 197 పు. "క్రేఁగన్ను' సూ. ని. లో, గలదు.

18 గలత్. 'నవలతా గలదంతాంతలతాంతనఃలు.' హ.న 3-20.

19 గళకంబళము. 'గళకంబళాభోగఁ గాతరాకు' పాండు 5-232 'గళ కంబము' అని చూపిరి.

20 గ్రామ దైవతము. 'గ్రామ దైవతములు కాశినగర.' కాశీ 6-192 'గ్రామదేవత' యనుట వ్యవహారముననే కాక ప్రౌఢ్యముగను గలదు

21 చక్కిలింత. "చక్కిలింతలు పుచ్చుఁ బ్రక్కలు వొడుచు" పండితా పురాతన 457 పు. 'చక్కిలిగింత' కలదు.

22 చక్కిలి గిలిగిలి. 'క్రిక్కించుఁ జక్కిలి గిలిగిలి యనుచు. పురాతన 457 పు. 'చక్కిలిగిలి - చక్కిలిగింత (చక్కిలి + గిలిగిలి) శ. ర" అని సూ. ని. లోఁ గలదు

23 చిహ్నానము. శ్రీహర్షుఁడనియెడి చిహ్నానంబు శృ. నై 6-25 'చి. హ్నానలన్ భూపతి' శృ. నై 8-87.

చీరతెర "విఘ్నమృగములఁ బట్టంగ వేసినట్టి, చీరతెరలను సంస్కృతిఁజిగురుగొలుపు" కాశీ 2. 55. 'చీర' శబ్దమువద్ద 'తెర చీర' అనునది ప్రౌఢ్యమాధార

ముగాఁ జూపినారు. 'చీరతెర' ప్రౌణ్యమునను లేదు. " బద్ధుంవిష్ణుమృగాన్ దిశు వాగురాభిరివావృతమ్" అనిమూలమునఁగలదు.

25 చైయన. "చైయన నైవేద్య శబ్దేనకీమభి, ధీయతే."పండితా, దీక్షా 63 పు. "చెయన సద్భక్తి సహితుఁడై గణము. హీయత" మహిమ 198 పు. "చయ్యాన అభిధీయ్యతి" అనుముద్రణము. సంస్కర్త్ర ప్రమాదకృతము. 'చైయన' అనునది 'ఐ దంతమగు చకారమునకు లక్ష్యము కాఁగలదు. 'చైవు'తో పాటుగ దీనిని నిఘంటుకర్తలంగీకరింపనగును.

26 ఝంకృతి. "చెలఁగి యాసజము లై ఝంకృతులిడఁగ." పండితా. వాద 703 పు. 'చేరమమురజల ఝంకృతుల్ సెలఁగ-మహిమ 161 పు.

27 తరటుసేయు "రే, చిత వల్గితగతులఁద రటుచేయఁగ నదియున్. పాండు 1-163

28 తలకాయ. "కన నికృతంబులైన తలకాయలు క్రమ్మఱ వచ్చెనోయనన్" వరాహ 11-97

29 త్రపుసి 'త్రపుసీ కుసుమాభరణా.' భీమ 6-47. 'త్రపుషి' మాత్రము సూ. ని. లోఁగలదు. 'త్రపుస' అనునది 'కల్వ' ఆధారముగాఁ జూపఁబడెను 'త్రపుస పుష్పలతామతల్లీ పటోలికా' భీమ 2 56 అనుచో 'ఆ' కారాంతమగు 'త్రపుసా' శబ్దమును శ్రీనాథుఁడు 'త్రపుస' అని 'అ' కారాంతముగాఁ బ్రయోగించినట్లు కనఁబడుచున్నది. కాని 'త్రపుసిపుష్పలతామతల్లీ పటోలికా' కవిపాఠము కానోపుననితోఁచుచున్నది.

30 త్రియంబకుఁడు. "త్రియంబకం సంయమినందదర్శ" (కుమార) అను కాళిదాస ప్రయోగముగలదు. 'త్రియంబకము' అనునదియు గ్రహింపఁదగినదే. "కడుఁద్రియంబకనగాగ్రంబు నందుండి" పండితా. పర్వతా 368పు. 'జనిత పూర్వాపరసంఘట్టనలఁద్రి' యంబక ఇత్యర్థయనఁగ" దీక్షా 94 పు

31 నదీనుఁడు. 'నన్ను నదీనుఁ జేయవే.' వసు 2-129. "పాథోధిసింధు...... నదీనశ్చాథ" త్రి. ని.

32 నన్నాఱు. 'నన్నాఱువిండ్లమానమగు దూరంబున.' కాశీ 5-192

33 నవలా. 'నవలా' నవలాలిత దృష్టిజాలముల్' వసు 3-49. ఇంకను గలవు. వసు 3-158, 4-94; 122: 6-83. మను 5-84 'నవల' అనునదియుఁ గలదు. ఇవి సూ. ని. లో లేకుండుట వింత.

34 నాసికాపుటము. "నాసికా, పుటశిఖరాగ్ర దృష్టియగు" భీమ 4-38 చూ శృ.నై 7-155. ఉ.రా. 4-185.

35 నాసికము 'నయన త్రయంబునున్నత నాసికంబు'పండితా.వాద 657 పు సూరి సూత్రమైనను జ్ఞాపకమందు లేదు!

36 నిట్టు పాసెము. "శిష్యులును నేను నిట్టు పాసెంబు వడితి,మి" భీమ 2-100. ఇది యప పాఠమనియు "ఛాత్రులును నేను నిట్టుపాసంబు వడితి,మి" అని యుండవలెననియు శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు వ్రాసిరి. ఈ పక్షమున 'నిట్టుపాశము' వద్ద నీ విషయమును సూ. ని. చేర్చవలెను.

37 నిశి. 'అమవస నిశి యనుచు నీవు అలసని పెదరా' చాటువు

38. నిశిచరి."నిశిచరీ ఘూతియైన శుభప్రకాశమూర్తి" హ°.న. అవ. 19 ప.

39 పనిపాట. 'అడ విధాతకుం జదువులమ్మ సదాపనిపాటఁ జేయు' కాలహ 2-72 దీనిని ' పని ' శబ్దమునొద్ద నుదహరింప వలెను.

40 పళ్యాలలాటుఁడు. 'పరమదయానిధాన శివపళ్యాలలాట' ఉ. రా 7-432.

41 పొత్తిపంచె. 'పొత్తిపంచెలుఁగరతిత్తులు నడప, తిత్తుంబ' పండితా. పర్వతా. 351పు 'పొత్తిచీర' అనునది కలదు.

42 పఖ్యము.' పరమ పావన కళాప్రఖ్యంబులగుచు' పండితా. పురాతన 306పు. 'ప్రఖ్య' మాత్రము సూ. ని. లో (గలదు.

43 ప్రతికోటి. "ప్రఖా, కోటి పేళికిఁ బ్రతికోటియనఁగ" కాలహ. 4-3

44 ప్రబ్బికోలు. 'పరగఁబొగడికోలుఁబ్రబ్బికోలు. సభా 2-49.పొగడికోలు వద్ద నన్నయ ప్రయోగమే చూపబడినది.

45 ప్రాహుణము. 'చతు ప్రాహుణ కాయమాన సుషమా సంపత్స ముద్దామమై' భీమ 3-15.

46 ప్రాహుణికము. 'పాథేయ మెవనికిఁ బ్రాహుణికము' భీమ 6-6 కాశీ 3-190.

47 బేకు. మజ్జనం, బాడి శివార్చనమ్యాడబేకు'కాశీ 3-190 కాలహ 1-35

48 భస్మము, "భస్మమయ్యెడు మతద్బంధులు సుతులు, విస్మయంబుగ నిష్ఠ భస్మమై పోదురు" పండితా.మహిమ 57పు. (ఇట'అయ్యెడుమ' అనుచోట బాఠాంతరము లేదు.)

49 భస్మసాత్కృతుఁడు. పావకసముఁజూచుచు నసుర భస్మసాత్కృతుఁ డయ్యెన్. ఆది 1-131. 'భస్మసాత్కృతను'. ఆది 6-163.

50 భక్షము 'అక్షణంబున బంచ భక్షముల్ గుడిచి' ఇచట 'భక్ష్యము' సంస్కర్తృ లోపకత్వము. "భక్ష...భక్షణే ఇతి కవికల్పద్రుమః భక్షతి భక్షతే ఇతి దుర్గాదాసః (శబ్దకల్పద్రుమకోశము) "భక్ష. పు. భక్ష. ఖాదనే. కర్మణి వాఘఞ్ అశనే భక్ష్యేచ 'నషట్ కర్తుః ప్రథమ భక్షః. శ్రుతిః...గావస్య సోమస్య ప్రథమస్య భక్షా. సి. కౌ. ధృతశ్రుతిః" (వాచస్పత్యమ్.)

51 భరిత భోజనము. 'భరిత భోజనంబుగా వడ్డించి' హార 2 125. 'భరితార్పణంబుగా వడ్డించువారు' అని ప్రభులింగ లీలలలోఁ గలదని శ్రీ బండారు తమ్మయ్యగారొక సందర్భమునఁ దెలిపిరి. సూర్యరాయ నిఘంటువు 'ఆంధ్ర' నిఘంటువు గదా! ఆంధ్ర మహా కావ్య ప్రయుక్త శబ్దములను గ్రహించి వివరింప నక్కఱ లేదా ?

52 మధ్యలోకముల ఇది. 'శ. ర.' 'మోనియర్ విలియమ్స్'లలో గలదు సూ. ని. లో లేదు. కారణము మృగ్యము.

53 మనువృత్తి. 'మనువృత్తులుచేకొను' కాశీ 4. 93.

54. మాద్యత్. 'మాద్యత్కరులపయి' సభా 1-249, చూ. జై. భా. 8-167 పాండు 4-234; పారిజా 5-59

55 మాహా. 'అత్యవదాత మహాకుల గ్రామణి. హ. న. 5. 5 'మాహానాథ విహార వాహన' రఘువ 2-1.7.

56 మృగీమదము. "భూషణో, జ్జ్వలమణులన్ మృగీమదము వాసనయున్' పారిజా 1-20. సం, చారి వధూ కుచోరుఘనసార మృగీమదగంధసారకా, శ్మీర సువాసనల్' ఉ. రా. 1-22. 'కురంగీ మదా, సిత.' ఆముక్త 2-31. పాండు. 2-7.

57 మేంఠము. 'కంఠనాళాగ్రమునయందు మేంఠ శిరము' కాశీ 7-98 పూ. ము. ఇట 'సూ.ము' లో 'మేండ శిరము' అని ముద్రితము. ఇది తప్పు. ఏలన యతి భంగము వాటిల్లుచున్నది. "మేండ మేంఠ" శబ్దములకు మావటివాఁడను నర్థము కన్పట్టుచున్నది. 'గొఱ్ఱె' అను నర్థము కలదో లేదో! "మేంఢ మేంఢక" శబ్దములకు 'గొఱ్ఱె' యనునర్థముకలదు. 'మేంఢ' శబ్దము నిలిపినను యతిభంగమేర్పడును. ఇట 'మేంఠ' శబ్దమును శ్రీనాథుఁడు 'గొఱ్ఱె' యనునర్థమున వాడుట మాత్రము స్పష్టము.

58 మేనవదినియ. 'లంజె, నో మేనవదినియనో మఱందలనో' పండితా. పురాతన 341 పు.

59 లజ్జవండు. 'లజ్జవండుగా, నదవదయైన తల్లికి' హర. 2-59. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పరిష్కరణమునను 'లజ్జవండు' అనియే యున్నది. సూ. ని. లో లేదుగాని 'లజ్జబండ' అనున దొకటి కలదు. 'పట్టణమునకేగె లజ్జబండ తనమునన్' ఉ. హ. శ్రీ ప్రభాకర శాస్త్రిగారు 'లజ్జబంత - సిగ్గుమాలినవాఁడు' అని యర్థము చెప్పిరి. ఈ పదము కవికర్ణ రసాయనమునను, గౌరన హరిశ్చంద్రలోను గలదనిరి. (చూ. తెలుఁగు మెఱుఁగులు) 'లజ్జవండు' అనునదికూడ 'లజ్జబండ' వంటి దియే కానగునని తోఁచెడి.

60 లసమానము. "లలనా, లసమాన దృష్టిజాలము, లసమూంబకు" వసు 3-50 చూ. నిరం 1-4; 2-143; 4-5.

విస్తరభీతిచేఁ జూపలేదుగాని యింకను నిట్టి పదములు గలవు. ప్రయోగ ప్రదర్శనములోని లోపములు స్పష్టపరచుటకు వేఱే వ్యాసము కావలెను. ఇప్పటికి 'స్వస్తి.'

ఆధ్యాత్మిక భౌతికవాదములు పరస్పర విరుద్ధములా?

శ్రీ కాశీనాధుని సాంబశివరావు, బి. యస్. సి.

"తెలివి యొకింతలేని యెడ తృప్తుడనై కరిభంగి
సర్వమున్ తెలిసితి నంచు గర్వితమతిన్ విహరించితిఁ
దొల్లి
యిప్పుడు జ్వలమతులైన పండితుల సన్నిధి నించుక
బోధ
శాలినై తెలియనివాడనై మెలగితిన్ గతమయ్యె
నితాంత గర్వమున్"

లన్నాడు భర్తృహరి తన సుభాషితములలో. ఇదే భావాన్ని ఒక మహనీయుడు Little knowledge leads to dogmatism, a little more to questioning and Still more to prayer అని చమత్కరించాడు. ఒక విషయాన్ని, అది ఎదయినా కానీయండి లోతుగ తరిచి విచారించిన కొలదీ తెలిసికొనిన దానికంటె తెలుసుకోనవలసినదే అపారంగా మిగులుతూ వుంటుంది. ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు, మేధావులు అని తలంచబడే అయిన్‌స్టీన్ వంటివారలే ఈసత్యాన్ని రుజువు చేశారు. "నాకు తెలిసినదే నేను గ్రహించినదే, నేను నమ్మినదే పూర్ణసత్యం. మిగిలినవారు తెలుసుకొన్నది, నమ్ముచున్నది సహేతుకంకాని ఆధారంలేని దిగువస్థాయిలోని ఒక అసత్యం" అనేవాదన విజ్ఞులలక్షణం కాదు. ఎదుటివారి నమ్మకాలు వారి విద్యా సంస్కారముల, ఆయాదేశకాల పరిస్థితుల ప్రతిబింబములేగాని వేరుకాదు. వారిజ్ఞానము అసమగ్రము అసంపూర్ణమూ అయితే కావచ్చు కాని, పూర్ణంగా అసత్యమూ వట్టికల్ల అని తేలికగా ఎగరగొట్టి వేయడం విజ్ఞత అనిపించుకోదు. సాఫీగానడవడానికి ముందు పసికున్రవాడు వేసేతప్పటడుగులు వంటివి లేదా పుత్రానందము పొందబోయే స్త్రీ యొక్క ప్రసవవేదన వంటిది కావచ్చు "ఇతరుల" అసమగ్రజ్ఞానమూ నమ్మకాలూనూ. కానివారియెడల కావలసినది సానుభూతి ఆదరణ. వారి నమ్మకాలలో వారికుండే నిజాయితీనీ, వారికి తెలిసిన విషయజ్ఞానమునూ సరియైన మార్గములోనికి మళ్లించి చేసి సత్యాన్వేషణయందు అనేకమార్గములలో వారిదికూడ ఒకటిఅనీ, అయితేఅది అనంత జీవితయాత్రలో మొట్టమొదటి మైలురాయి మాత్రమేననీ నచ్చచెప్పి సరియైన బాటకు వారిని త్రిప్పుటయే నేటి పెద్దల ముఖ్య కర్తవ్యం. ఎదుటివాని అభిప్రాయాలలోగూడ కొంతసత్యముండవచ్చునేమోననే దృష్టియే సహృదయుల దృష్టి. కాని ఆధ్యాత్మజీవనమునే పరమావధిగానెంచి మనప్రాచీనఆర్ష సంప్రదాయములలో పెరిగిన మన పెద్దలకూ, నేటిఆధునిక భౌతిక విజ్ఞానయుగ ప్రవాహంలో కొట్టుకుపోతూన్న పిన్నలకూ వైరుధ్యము నానాటికీ పెరిగిపోతూ వుండడం దురదృష్టకరం అనడంఅతిశయోక్తికాదు ఈవైరుధ్యం తప్పదా? లేక దీనిని సమన్వయపరచడానికి ఏమన్నా అవకాశమున్నదా? ప్రతిసమస్యకూ పరిష్కారంకూడా బీజప్రాయంగా సమస్యలోనే యిమిడివుండడం ప్రకృతి సహజ లక్షణం. లేనిచో సమస్య అనేదివుండదు, పరిష్కారం అంటకంటె వుండడానికే వీలు లేదు. సిద్ధాంతము [Thesis] అనుమానం [doubt] పూర్వపక్షం [Anti Thesis]. సమన్వయం [Synthesis] అనేది జ్ఞానవిజ్ఞానసముపార్జనలో అనివార్యఘట్టాలు హేతువాద విజ్ఞానాన్ని సమన్వయాన్ని అనుభవంతో మేళవించ గలిగినప్పుడు కలిగేది కేవలం మూఢనమ్మకం మాత్రమేకాక [Blind faith] ప్రగాఢ అచంచల విశ్వాసముకూడాను. [Enlightened Conviction] అప్పుడే వివేచనా జ్ఞానము గల్గినబుద్ధికీన్ని అనుభవజ్ఞానము గల్గిన హృదయమునకున్నూ Head and heart సహకారము, అన్యోన్యతకల్గి పూర్ణమైన సమగ్ర జీవితావలంబనానికి [Full and integrated, Harmonious life] అవకాశము కలుగుతుంది. అనంతమైనమనఆర్ష విజ్ఞానసాగరము ఈఆధునిక భౌతికవిజ్ఞాన నదీ ప్రవాహములను తనలో యిముడ్చుకొనలేదా!

ఈసృష్టిలోని ప్రతిప్రాణి కోరేది సుఖం. ఇది తిరుగులేని సత్యం. ఈసత్యాన్ని ఎవరూ ఏమతమూ ఏవిజ్ఞానమూ కూడా ఖండించలేదు. ప్రాణుల యొక్క ప్రతివ్యాపారమూ ఈసుఖాపేక్షచేతనే ప్రేరేపింపబడుతోంది లోతుగా విచారిస్తే బాధకూడ సుఖాన్ని పొందేటందుకు పడేతపన, ఆరాటమే [Negative Ananda] ఆత్మహత్యచేసుకొనే కోరేవాడుకూడ తాను పడే ఈబాధలపీడను వదలించుకొని ఏదో ఒక అవ్యక్త ఆనందాన్ని మధురానుభూతిని పొందుదామనే కోరుకుంటాడు Evil indicates the distance which good has yet to traverse అన్నాడొక తత్త్వవేత్త. ఆనంద పిపాసలేని జీవి కాని, సుఖామృతాన్ని కోరని జీవికాని ఈసృష్టిలో లేదనుట నిర్వివాదాంశము. ప్రతివ్యాపారము, ప్రతిస్థాయిలోనూ ప్రేరేపింపబడేది ఈసుఖాపేక్షచేతనే. మానవుడు తాను నిర్మించుకొంటున్న రాజకీయ, ఆర్థిక సాంఘిక, మతవ్యవస్థల యొక్క చరమ లక్ష్యము ఆనందప్రాప్తియే ఈసమస్త బాహ్య క్రియవ్యాపార తరంగములన్నియూ ప్రేరేపింపబడేది గంభీరమైన అగాధమైన ఆనంద సాగరమునుంచియే. ఈకల్లోలితతరంగసముదాయములన్నియూ తిరిగిచేరేది ఆఆనంద సాగరములోనికే అయితే అట్టిఆనందము ప్రతి జీవికి తానుచేయుచున్న క్రియావ్యాపారముల వలన లభ్యము అగుచున్నదా లేదా అనేది వేరే ప్రశ్న. దానికి కారణము లేవైనా కావచ్చు కాని అనుక్షణమూ మానవుడుగాని తదితర జీవరాసులుగాని ప్రేరేపింపబడేది ఈ సుఖాపేక్షచేతనే అనే విషయంలో మాత్రము ఎట్టిశంకగాదావుండుటకు వీలులేదు మొట్టమొదటగా స్థూలంగా అగుపడే ఈ పదార్థము (Matter) మానవుని ఆకర్షించుచున్నది. బాహ్యేంద్రియములకు స్థూలంగా ఒక ముద్దుగా కనబడే ఈ పదార్థము యొక్క స్వరూప స్వభావాదులేమిటి? సర్వప్రాణులను ఆకర్షించే దీని అంతర్యమేమిటి? అనివిజ్ఞులైన కొందరు విచారణ మొదలుపెట్టారు. వీరినే విజ్ఞానవేత్తలు [Scientists] అంటారు డాల్టన్, న్యూటన్, అయిన్‌స్టీన్ మున్నగు వారంతా ఈకోవకుచెందినవారే. ఈపదార్థమును చిన్నిచిన్ని ముక్కలుగా విభజించి విభజించి చివరకు విభజింపబడలేని ఒకబహు చిన్ని అణువు (Atom) వరకుపోయినారు నవీనశాస్త్రజ్ఞులు ఒక సూదిమొనమీదకొన్ని లక్షల అణువులను వుంచవచ్చును. ఇంత సూక్ష్మఅణువునుకూడ దరిమిలా శాస్త్రజ్ఞులు పగలగొట్టి ఛేదించగా పదార్థరూపమైన ఆ చిన్ని అణువు మహాశక్తిగా పరిణమించడం జరిగింది. పదార్థరూపమైన మంచుగడ్డఆవిరి రూపంగానూ, కొయ్యముక్కపొగ, అగ్ని రూపంగానూ మారినట్లు, ఈఅణుపదార్థము సూక్ష్మశక్తిగా మారిపోయినది. శక్తిని ఘనీభవింపచేస్తే పదార్థమూ. పదార్థమును సూక్ష్మీకరిస్తే శక్తియూ పరిమాణం చెందడం తప్ప పదార్థానికీ శక్తికీ భేదము లేదన్నారు. అవస్థలలో భేదంతప్ప అసలు తత్త్వంలో భేదమేమియూ లేదనియూ రెండూ మూల తత్త్వంలో ఒక్కటేననియూ, ఒకే ఒకతత్త్వం యొక్క రూపాంతరాలు అవస్థలుమాత్రమే ననియూ ఆధునిక విజ్ఞానశాస్త్రం రుజువు చేస్తున్నది కొయ్య, పొగ, అగ్ని ఈమూడు కూడ ఒకే ఒక తత్త్వముయొక్క వివిధ అవస్థలు లేదా రూపాంతరాలు. అలాగే మంచుగడ్డ, నీరు, ఆవిరికూడాను. అలాగే పదార్థమూ, శక్తి (Matter is nothing but solidified form of energy and energy is nothing but matter in subtle form)

ఉదాహరణ:— ఎంతో కాంతిశక్తినీ, శబ్దశక్తినీ దట్టింపచేసి ఘనీభవింప చేసిన ఒక టపాకాయ అనేపదార్థమును విచ్ఛిన్నముచేసినపుడు తిరిగి శబ్దకాంతి శక్తులు ప్రభవిస్తున్నాయి ఇలాగే అనంతశక్తులు ఒక్కసూక్ష్మ బిందువుగా కేంద్రీకరింపబడి ఒక చిన్ని అణువుగా దట్టింపబడినపుడు ఒక సూక్ష్మ టపాకాయ తయారవుతోంది ఈ అణువనే టపాకాయ విచ్ఛిన్నమయినపుడు ఆటంబాంబుగా

(Atom Bomb) పరిణమిల్లి మహా మారణ శక్తులు ఉద్భవిస్తున్నాయి. సర్వ ప్రపంచాన్ని నాశనంచేయగలిగే అనంత శక్తులు ఈబహుచిన్ని అణువులో ఎట్లు కట్టింపబడి కేంద్రీకృతమై యున్నవి? మన ఉపనిషద్వాక్యములోని "అణోరణీయాన్ మహతో మహీయాన్" చిన్నదానికంటె చిన్నది మహత్తుకంటె మహత్తరమైనది అని పరమేశ్వరుని అనంతశక్తులను వర్ణించడంలోగల అంతరార్థము ఎంత గాంభీర్యమైనది? ఒక విశ్వజనీనమైన మహత్తరసత్యాన్ని ఎంత సూత్రప్రాయంగా వర్ణించగలిగినది ఆవాక్యము కాబట్టి ఆకారంతోగూడి బరువు. సాంద్రత గల్గి స్థూలంగా ఒక ముద్దువలె అగుపడుచున్న ఈసర్వభావ ప్రపంచాన్ని వస్తుజాలాన్ని శక్తిరూపంగా, శక్త్యాత్మకంగా చూడడం సాధ్యమగుచున్నది. మహత్తర అనంతశక్తుల యొక్క ఒకముద్దగా ఈవస్తువులను చూచుట సాధ్యము [Solidified mass of Energy]

ఈ భౌతిక ప్రాణికములు రెండున్నూ అవస్థాభేదముల కారణంచే ప్రత్యేక ప్రతిపత్తి కల్గివున్నట్లుగా బాహ్యదృష్టికి కనబడడమేగాని అసలు తత్త్వంలో రెండూ ఒక్కటే నని సైన్సు రుజువుచేసినదని చెప్పియుంటిమి ప్రాణికశక్తి భౌతికంగా స్థూలరూపంలో ఆహారపదార్థంగా సంతరబట్టే జీవులకుఆహార పదార్థము పోషకశక్తిని ప్రాణశక్తిని యిచ్చుచున్నది. లేనిచో జీవులకు ఆహారము తిన అవసరమేలేదు. పదార్థనికీ శక్తికీ ఈపరస్పర సంబంధం వుండబట్టే, ఆహారము తినడమనే ప్రక్రియ తద్వారా ప్రాణులకు పోషకశక్తులు లభ్యమవడమనే ప్రక్రియ సాధ్యపడుచున్నది. కావున ఆహారంలో (లేదా పదార్థంలో) ప్రాణశక్తి బీజప్రాయంగా వుందనటాని మన అనుభవంగూడ సాక్ష్యమే. ప్రాణికశక్తిగల్గిన కోవకుచెందినవే క్రిమికీటకాదులు. జంతువులు మానవులు వగైరా. బీజప్రాయంగా పదార్థంలో ప్రాణికశక్తి వున్నట్లే ప్రాణికశక్తిలో బీజప్రాయంగా మానసికశక్తివున్న దనిగూడ తేటతెల్లమవుతుంది. పిల్లి ఎలుకను పట్టుటలో, బల్లి క్రిమికీటకాదులను సంహరించుటలో నక్కజిత్తులమారి టక్కులలో వున్న నేర్పు, గణితశాస్త్రపద్ధతి, నిర్దుష్టమైన ఒక లెక్క (Mathematical Precision) ఇవన్నీ కూడ ఒకవివేచన ఆలోచనతో కూడుకొని యున్న మానసిక ప్రవృత్తులుకావా? అయితే ఈప్రక్రియ మానవునిలో వ్యక్తంగానూ (Conscious) మానవేతరమైన జంతుజాల ప్రపంచములో అవ్యక్తంగాను (Unconscious) జరిగితే జరగవచ్చు. కాని అసలు ఒక విధమైన మానసిక ప్రవృత్తి ఈవ్యాపారాలలో గోచరించుటలేదా? ప్రాణికశక్తిలో మానసిక శక్తియే బీజప్రాయంగావుండి ప్రేరేపించక పోతే పైనచెప్పినపిల్లి, బల్లి నక్క జంతువుల వ్యాపారములలో ఇట్టి మానసిక ప్రవృత్తి సాధ్యమా? కాబట్టి పదార్థంలో ప్రాణికశక్తి, ప్రాణంలో మానసికశక్తి బీజప్రాయంగా వున్నదనుట నిస్సందేహము. ఇదేక్రమంలో మానసిక శక్తిలో మానసికేతరమైన అధిమానస ఆధ్యాత్మశక్తులు వున్నవని కూడ తెలుసుకొనవచ్చును. అయితే అతి ఉన్నత స్థాయిలోనున్న ఇట్టి సూక్ష్మతమ శక్తులను ప్రత్యక్షంగా రుజువుచేయడం అంత తేలికపని కానప్పటికీ వాటిని కొంతవరకు అనుభవం ద్వారా పొందవచ్చును.

ఉదాహరణ:—

ఒక శాస్త్రవేత్త, పండితుడు, కవి, వేదాంతి, తత్త్వ జిజ్ఞాసువు, విజ్ఞానవేత్త జటిలమైన ఒక సమస్యనుగుర్చి సతమత మవుతూ వుండే సమయంలో ఒక పరిష్కారమార్గము హఠాత్తుగా మెరుపువలె మెరసినపుడు పొందే ఒక విచిత్రానుభూతి అధిమానస ఆధ్యాత్మ స్థాయిలలోనే సాధ్యము (Supermental and Spiritual Bliss) సర్వావయవములు రోమకూపములనుంచి ప్రాణమనస్సులవరకూ ఆనందశక్తిచే కంపించి విలక్షణమైన అనుభూతిపొందడం అనుభవవైకవేద్యమే. అప్పుడే

మనశ్శక్తి వివేచనాశక్తి. హేతువాదనాశక్తి తనకంటె ఊర్ధ్వస్థాయిలోనున్న ఇతరశక్తుల మధురామృతమును ఆస్వాదించుటకు అర్హత కలిగియుండును మానసికశక్తిలో యిట్టి అధిమానసిక ఆధ్యాత్మశక్తులు బీజప్రాయంగా వుండి మానసికశక్తులను ప్రేరేపిస్తూ వుండకపోతే మానసికశక్తులకిట్టి అనుభూతులు సాధ్యం కావు. మానవుని అభ్యుదయము మానసిక స్థాయిలోనే ఆగిపోయివుండేది. దైవాంశమని చెప్పబడే అధిమానస ఆధ్యాత్మశక్తుల ప్రేరణచేతనే మనస్సు ఉన్నతమైన గతికి చేరగలిగి ఉత్తమపురుషునిగా మారుటకు అవకాశము కల్గుచున్నది. త్యాగనిరతి, శాశ్వత సుఖాపేక్ష పరోపకార పారీణత మున్నగు లక్షణాలు వ్యక్తపడేది ఈఊర్ధ్వస్థితులలోనే. మానసికశక్తితో నిమిత్తములేకుండా మానసికశక్తిని కేవలము నిమిత్తమాత్రంగా సాధనమాత్రంగా చేసుకొని వ్యవహరించే బలీయమైన విశిష్టశక్తులే అధిమానసిక ఆధ్యాత్మిక శక్తులు. గర్భోత్పత్తి మొదలు నవమాసముల వరకు నిర్దుష్టమైన క్రమంలో సర్వావయవములతో ప్రాణమానసిక శక్తులతోగూడిన ఒక విచిత్ర శిశువును ఏశక్తి నిర్మించుచున్నది? బాల్య యౌవన కౌమారవృద్ధాప్యదశలు అనే ఈచక్రము క్రమబద్ధంగా తిరుగుటకు ఏశక్తి కారణము? సర్వవ్యాపారము మానివేసి హాయిగా నిద్రపోతూవున్న స్థితిలోగూడ మనంతిన్న ఆహారమును శక్తిగామార్చి ఆయా అవయవములకు తగినపుష్టినిచ్చి పనికిరాని మలమూత్రాదులను వర్జింపచేసి ఈమానవ యంత్రమును నిర్దుష్టంగా నడిపించే శక్తి ఏది? పురుషుని వీర్యములో వ్యుత్పత్తికాబోయే విచిత్రశిశువును సూక్ష్మరూపంలో వుంచినశక్తి ఏది? ఇట్టిశక్తియేగాదా ఆధ్యాత్మ, అధిమానస, మానస, ప్రాణ, భౌతికశక్తులుగా తరతమ భేదాలతో వ్యక్తమగుచున్నది! ఆర్ష విజ్ఞాన జనితమైన అన్నమయ, ప్రాణమయ, మనోమయ విజ్ఞానమయ ఆనందమయ కోశములనే పంచకోశముల అంతరార్థమిదియేగాదా? బాహ్యంగా అగుపడే ఒక మానవుడులేదా మానవాకారము ఇట్టి అనంతశక్తులముద్దగాదా? ఈఅనంతశక్తుల వివిధస్థాయిలనూ, వీటిపరస్పర అవినాభావ సంబంధమునూ, వీటిఅవస్థాభేదములనూ, ఆయా అవస్థలలో వాటిసహజ ప్రవృత్తులనూ ఈవిభిన్నప్రవృత్తులనూ వ్యాపారములనూ అనుక్షణమూ ఆనంద ప్రాప్తికి ప్రేరేపించి పరుగులు తీయించే మూలశక్తినీ సమగ్రంగా తెలుసుకొని అనుభవించిన జ్ఞానమే సమగ్రజ్ఞానము అవుతుంది ఏదిలోపించినా అది అసమగ్రమే. ఈఅసమగ్ర జ్ఞానమువలన బయిలుదేరిన సిద్ధాంతాలన్నీ అసమగ్రమే. ఈనాటిరాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు సమగ్రజ్ఞానము లేకపోవుటచేతనే అవి ఆశించిన ఫలములు ఆశించిన రీతిలో రాకపోవడానికి కారణము. కేవలము భౌతిక జ్ఞానమునే సమగ్ర జ్ఞానముగా భావించడం అసంపూర్ణజ్ఞానము.

అత్యున్నతస్థాయిలో బహుసూక్ష్మ శక్తియైన ఆధ్యాత్మ శక్తికిలోబడే మిగిలిన శక్తులన్నీ పనిచేయుచుండును వాటికి కేటాయించబడిన విధులను ఆయాశక్తులు వాటి శక్త్యానుసారంగా నిర్వహిస్తూవుంటాయి ఈశక్తులమధ్య పరస్పర సహకారమున్నప్పుడే పరస్పర త్యాగమున్నప్పుడే పూర్ణమైన ఆనంద జీవితము సాధ్యము భౌతికఇంద్రియములకూ ప్రాణశక్తులకూ మనశ్శక్తికి అధిమానస ఆధ్యాత్మిక శక్తులకూ నిత్యసంఘర్షణ జరుగుతూనే వుంటుంది. వీటిసమన్వయమే జీవిత లక్ష్యము. భౌతికములైన దేహేంద్రియాదులు తాత్కాలిక ఫలమును కోరేవి. అధిమానస ఆధ్యాత్మములు శాశ్వతఫలములను కోరుతూ వుంటాయి, ఈభిన్నకోరికల మధ్య మనశ్శక్తి నలిగిపోతూవుంటుంది సుఖదుఃఖములనే స్థితి ప్రాణికోటిలో ఒక్క మానసికశక్తి గల్గియున్న మానవుని స్థాయిలోనే సుస్పష్టంగా గోచరించేది. నేను, నాది అనే ఒక వ్యష్టిజ్ఞానము (Consciousness) అహంకారబీజము ఈస్థాయిలోనే ఏర్పడడం

చేత వ్యతిరేక ఫలితములు దుఃఖకారిగానూ అనుకూలఫలితములు సుఖకారిగానూ పరిణమిస్తూవుంటాయి. దిగువస్థాయిలోని భౌతిక ప్రాణికోటిలో ఇట్టి అహంకారబీజము పరిణతి చెందియుండక పోవుటచేత వాటి వ్యాపారములు, క్రియలు సహజప్రకృతి శక్తులచే ప్రేరేపింపబడుతూ ప్రకృతిబద్ధమైన శాసనములకు లోబడి ప్రేరేపింపబడుతూ పోతూవుంటాయి కాని "నేను, నాది" అనే అహంకారము గల్గిన మానవుడు ప్రకృతి శక్తులకు తాను బానిసకాదలచియూ ఆశక్తులను అధిగమించి వాటిని లోబరుచుకొని తానే అధినేతగా వుండాలనే ప్రయత్నిస్తాడు. మానవస్థాయిలో మానసికశక్తి యుక్తుడైన మానవునకు ఇది సహజ అనివార్య ప్రవృత్తియే తమోగుణ ప్రధానమైన భౌతిక ప్రాణికాదు. కేవలె ప్రకృతి శక్తులకు లోబడి నిస్సహాయస్థితిలో తాను లేననియూ రాజసమైన శక్తులతో గూడినవాడననియూ రాజసాహంకారముచే ప్రేరేపింపబడి ఏదోతీరని సుఖానుభూతమును పొందగలననే ధీమాతో ప్రకృతి శక్తులను ఎదిరించి సాధ్యమైనంత వరకు వాటిని లోబరచుకొని స్వప్రయోజన సిద్ధికి ప్రయత్నింపటం మానవస్థాయిలో సహజము, అనివార్యమేగూడ. అట్టిప్రయత్నములలో జయముపొందినపుడు అహంకార తృష్ణ కొంతవరకుతీరి తాత్కాలికమైన ఒక సుఖానుభూతిని పొందడం, అపజయము పొందినపుడు దుఃఖానుభూతిని పొందడం అనుభవైక వేద్యమే. అనంతరాజసశక్తులను ప్రదర్శించిన వారిలో ఆధునికయుగంలో హిట్లరు, నెపోలియన్ ప్రభృతులు పురాణ యుగంలో రావణాసుర, హిరణ్యాక్షాదులు రాక్షసులే నిదర్శనము. కాని ఎంతటి రాజస శక్తులైనను దానికంటె బలవత్తరమైన సాత్వికాది శక్తులముందు ఓటమి పొందకతప్పదు. ఇట్టి రాజసాహంకారములతో గూడిన అనేక మానవులమధ్య శక్తులమధ్య పరస్పరఘర్షణ తప్పదు. జయాపజయములు దైవాధీనమనే సూక్తిప్రకారం ఒకరి జయం వేరొకరిపరాజయంగా పరిణమించక తప్పదు దానితో రాజసాహంకారము దెబ్బతిని క్షోభించి, "గతమయ్యో నితాంతగర్వమున్" సూక్తిలోని సత్యాన్ని గ్రహించి, తానుఎన్ని రాజసశక్తులను సంపాదించగలిగినప్పటికీ సంపాదించవలసిన మహత్తరశక్తులు ఇంకాఎన్నో అనంతంగావున్నాయనీ తనకీశక్తులను సంపాదించిపెట్టి ప్రసాదించగలిగిన అతీతశక్తి ఏదో ఒకటివుండి తీరాలనీ తనఓటమికి గలకారణములను గాఢంగావిచారించి సత్వగుణమే ప్రధానమైనదనీ గ్రహింపగల్గును. ఈసత్వగుణంద్వారా ప్రవేశార్హత, పరిపక్వముపొందిన రాజసాహంకారమునకే సులువు సాధ్యము, అవసరముగూడ. జీవితసారాన్ని బహుముఖంగా పూర్ణంగా రుచిచూడగలుగుటకు రాజసాహంకారము మొదటిమెట్టు. ఈ స్థితియే మానవజీవితంలోని కురుక్షేత్ర మహాసంగ్రామం గీతోపదేశామృతాన్ని రుచిచూడాలనే ఆకాంక్ష, జిజ్ఞాసగలిగే దీస్థితిలోనే "Sweetest songs flow from saddest heart" మధురాతి మధురగీతికలు ఆలాపింపబడేది ఈ కల్లోలిత క్షోభపీడిత హృదయంనుంచే దీనితదుపరిపరిణామమే సాత్వికస్థితి. జీవితరహస్యాన్ని తెలుసుకొని ఆదర్శ ఆచరణలమధ్య ఊహా, వాస్తవికత ప్రపంచములమధ్య, ఆధ్యాత్మ భౌతిక జీవితముల మధ్య వంతెన నిర్మించి, పరస్పర వైరుధ్యములను సమన్వయించి, జీవితనాటక రహస్యమును గ్రహించి సర్వవిచిత్ర వ్యాపారకలాపములను రసదృష్టితో ఆస్వాదించ గలిగి ఆనందమయ జీవితమును నడపగలిగేది ఈ స్థితిలోనే భౌతికాది సమస్త కార్యములను నిర్వరిస్తూగూడ వాటికి అతీతంగా వుండగలిగి తామరాకులోని నీటిబిందువువలె, గీతాకారుని నిష్కామస్థితిలో వుండగలిగే స్థితప్రజ్ఞత్వము పొందగలిగేదికూడ ఈసాత్విక స్థాయిలోనే.

పైనచెప్పబడిన భౌతిక ప్రాణిక, మానసిక అధమానసిక, ఆధ్యాత్మికశక్తుల వివిధప్రవృత్తులనుసమన్వయ పరచగలిగి సమగ్రజీవితాన్ని ఆనందానుభూతినిపొందగలగడం సామాన్యమైన విషయంగాదు. సాధారణంగా మానవుడు సుఖమునుపొందుటకు చేసేప్రయత్నములలో భౌతిక ప్రాణికములు తాత్కాలిక సుఖము కొరకున్నూ, అధిమానస ఆధ్యాత్మికములు శాశ్వత సుఖము కొరకున్నూ తంటాలు పడడంలో వాటిమధ్యనున్న మనస్సు ఏవైపునకు మొగ్గవలెనో తెలియక సతమతమవుతూ వుంటుంది. భౌతిక ప్రాణికములు బలీయమైనప్పుడు వాస్తవిక ప్రపంచములోనికి లాగబడి మనస్సు ఆప్రవాహంలో కొట్టుకుపోతూ వుండడం, లేదా అధిమానస ఆధ్యాత్మములు తాత్కాలిక ప్రయోజన అస్థిరత్వాన్ని మనస్సుకు బోధించి శాశ్వత సుఖమువైపుకు దాని దృష్టిని మళ్లిస్తూ వుండడం అనుభవంలోనున్నదే. ఇట్టివైరుధ్యములను సమన్వయించడానికే దేశకాల పరిస్థితులనుబట్టి వివిధములైన మత, రాజకీయ ఆర్థిక సాంఘిక వ్యవస్థలు రూపొందుతూ వుండడం. ఒక్కొక్క వ్యవస్థ భౌతికప్రాణికములకే ప్రాధాన్యమిచ్చి వాస్తవికత, స్థిరత్వము గల్గియున్నవి ఇవియేగాని మిగిలిన అధిమానస ఆధ్యాత్మికములు వాస్తవికతా రహితమై కేవలము ఊహాజనితములు మాత్రమేననియూ వాస్తవిక ప్రపంచమువదలి పెట్టడం ఏదో ఊహా ప్రపంచములో గాలిలోమేడలు కట్టడం నేల విడిచిసాముచేయడం వంటిదనియూ సిద్ధాంతీకరిస్తే ఇంకొక్క వ్యవస్థ ఈ భౌతిక ప్రాణికములను నమ్ముకొని సుఖాన్వేషణ చేయడం కుక్కతోకపట్టి గోదావరి ఈదటం వంటిదేననియూ, నీటికొరకు ఎండమావుల వెంట పరుగిడటం వంటిది అనియూ, ఒక వేళ ఏదో ఒక విధమైన తాత్కాలిక సుఖము లభించి నప్పటికీ అది తిరిగి దుఃఖహేతువే గాని శాశ్వతశాంతి లబ్ధికి దోహదకారి కాదనియూ, అట్టిశాంతి లభ్యమవక పోవటానికి భౌతికప్రాణికాదులకున్న సహజఅనిశ్చలత, అస్థిరత్వమే, అసంపూర్ణతయే కారణములనియు నొక్కివక్కాణిస్తూ వుంటూంది. అనాది అని చెప్పబడే మన హిందూమతములోనే మూలసిద్ధాంతాలలో ఏకీభావమున్నా నిత్యజీవితంలో ఆసిద్ధాంతాలను ఆచరణలో పెట్టడంలోనూ, వాటినిసమన్వయ పరచడంలోనూ విభిన్న దృక్పథాలు వుండడం గమనించతగ్గవిషయం. మతప్రవక్తలని చెప్పబడే శంకర, రామానుజ మాధ్వాచార్యత్రయంలోనే ఈవిభిన్నత గోచరిస్తుంది శంకరుడు జగత్తుమిథ్య, బ్రహ్మసత్యం అని అంటే రామానుజ,మధ్వులు జగత్తుకూడా సత్యమే అన్నారు. శంకరుడు జ్ఞానంచేతనే మోక్షం లభ్యమవుతుంది అంటే రామానుజమధ్వాచార్యులు కర్మకు, భక్తికి ప్రాధాన్యమిచ్చి ఇవికూడ లేనిదే కేవలం జ్ఞానంచేత మోక్షం రాదన్నారు. నవీన విజ్ఞానులు అసలు భౌతిక ప్రాణిక మానసికములుదాటి ఆపైన ఏమీ లేదు. సృష్టిక్రమము ఈస్థాయిలలోనే ఆఖరు, ఒకవేళ ఇంకేదో ఆపైనవున్నదనిఅన్నా అది కేవలము ఊహాప్రపంచమే కాని వాస్తవిక సత్యమైన ప్రపంచము కాదని అంటారు పైగా మనస్సుపైనకూడ పెత్తనం చలాయించేవి ఈభౌతికప్రాణికము లేననియూ వీటిమార్పునుబట్టియే మనస్సుకూడా మార్పు చెందుతూ వుంటుందనియూ (Matter controls the mind) నవీన విజ్ఞానవాదుల సిద్ధాంతము.కాని ఈవాదనలో పటిమలేదని తాజానవీన విజ్ఞానసిద్ధాంతాలు చెప్తున్నాయి. అసలైనది మనశ్శక్తియేనని దానికిలోబడే భౌతిక ప్రాణికముల మనుగడవున్నదని సిద్ధాంతాలు బయలుదేరుతున్నాయి. పాలు కుడుస్తూవున్న పసిబిడ్డను, తనతల్లిహఠాత్తుగా కోపోద్రేకంలో ప్రక్కయింటి వాళ్లతో పోట్లాడుట మొదలుపెట్టగా పాలుకుడిచే ఆపసివాడు హఠాత్తుగా మరణించిన సంఘటన వార్తాపత్రికలలో చదివియేవున్నాము.

ప్రాణాన్నిచ్చే అమృత తుల్యమైన పాలు. ప్రాణాన్నేహరించే విషంగా మారినయి కోపోద్రేకమైన మానసికశక్తి భౌతిక పదార్థమైన పాలస్వభావమునే మార్చివేసినది. అన్నామలై విశ్వవిద్యాలయంలో జరిగిన వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సంగీత ధ్వనులను (Musical sound vibrations) విత్తనములమీద మొక్కలమీద ఆలాపింప చేసినఫలితము చాలాఆశ్చర్యము సన్నాయి. ఫిడేలు, స్త్రీపురుషగాత్రధ్వనులను ప్రసారింపచేసిన మొక్కలు మిగతామొక్కల కంటె చక్కనిపొడవైన కంకులువేసి పుష్టికరమైన పంటను అందించినయి. అమెరికాలో అనేకమొండివ్యాధులను, ఎట్టి చికిత్సకు లొబడని వ్యాధులను సంగీతధ్వనుల సహాయంతో పోగొట్టుతున్నారు. సంతోషము సిగము బలము ఎందుచేత. విచారముచే బలహీనత ఎందువలన? సంతోషవిచారమనే సూక్ష్మమానసికశక్తులు దేహప్రాణాదులనెట్లు నియంత్రీకరించుచున్నవో మన అనుభవం సాక్ష్యంగాదా? స్వతంత్రించి ఎట్టి వ్యాపారములను ఈభౌతికప్రాణాదులు చేయలేవని చెప్పుటకు ఇంతకంటె ప్రబల నిదర్శనము లేమికావలయును? మూర్ఛితునకు ఎంతో బలమువచ్చుట, ఆమూర్ఛితుని పట్టుకొనుటకు ఎందరో రావలసివచ్చుట ఎంతమందిపట్టినా ఆమూర్ఛితుడు అదుపులోనికి రాకుండుట దీనికికారణము? దేహ, ప్రాణముల కంటే అతీతమైన శక్తిఏదో ఈ దేహప్రాణములకు ఇంత బలీయమైన శక్తిని యివ్వకపోతే ఆ మూర్ఛితునకంతటి బలమెచ్చటనుంచి వచ్చినది? ఆశక్తి ఏదన్నాకానీయండి. అది మాత్రము దేహ, ప్రాణముల కతీతమయినదనీ ఆశక్తియే ఈదేహప్రాణములకే బలమును ప్రసాదించినదనీ ఒప్పుకొనక తప్పదు. దేహప్రాణాదులకంటె అతీతశక్తులు ఈదేహప్రాణాదులకు నియంత్రీకరించి వీటి మార్గమునూ, ప్రవృత్తినీ నిర్దేశించి నడుపుతూ వున్నాయని చెప్పుటకు ఈక్రిందివిచిత్రానుభవమే ప్రబలసాక్ష్యము. స్వప్నావస్థలో వీర్యస్ఖలనమవడం చాలవిచిత్రమైన అనుభవం. భౌతికములైన సమస్త ఇంద్రియములు వాటి వ్యాపారములన్నీ మానివేసి విశ్రాంతి తీసుకొని గాఢనిద్రలోవుంటున్నాయి. శృంగార సంబంధమయిన ఒక స్వప్నము రావడం. నిర్వ్యాపారముతోవున్న అన్ని ఇంద్రియములు హఠాత్తుగా ప్రకోపింపబడి వెంటనే వీర్యస్ఖలనం జరగడం అనుభవంలోనున్న విషయమే. ఏశక్తి ఈభౌతి కేంద్రియములను ప్రేరేపించి, నియంత్రీకరించి వాటివిధులను నిర్వర్తింప చేయిస్తూవున్నది? విశ్వమందలి ఈప్రత్యక్ష అప్రత్యక్ష గోళసముదాయములను క్రమబద్ధంగా అనాదినుంచి ఈఅనంత ఆకాశములో ఏశక్తి పరిభ్రమించేటట్లు చేస్తున్నది? చంద్రగోళముకంటె భూగోళము రెట్టింపుపెద్దది. వీటిమధ్యదూరము షుమారు రెండులక్షల ఏబదివేలమైళ్లుఅని నవీనశాస్త్రజ్ఞులఅంచనా. భూగోళముకంటె సూర్యగోళము కొన్నిలక్షలరెట్లుపెద్దది వీటిమధ్య దూరము షుమారు తొమ్మిది కోట్లమైళ్లు. సూర్యగోళముకంటె నక్షత్రము కొన్నిమిలియన్లు రెట్లుపెద్దది. వీటిమధ్య దూరము కొన్నివందల కోట్లుమైళ్లుఅని అంచనా. ఈ గోళము లన్నియూ పరస్పరాకర్షణచేత ఈఅనంతశూన్యంలో బంతులవలె వ్రేలాడుతూ ఉనికి కలిగియున్నవి. నిరంతరక్రమబద్ధమైన వీటి పరిభ్రమణలచేత కాలనిర్ణయము జరుగుట, ఋతువులు క్రమబద్ధంగా ఏర్పడుట, ఆయాఋతువుల ప్రభావంచేత సమస్తజడ, చైతన్యజీవకోటి వాటిమనుగడను సాగించుకొనగలుగుట ఏర్పడుతున్నది. ఇంతటివిచిత్రవ్యాపారము, ఊహించుటకు గూడ అలవిగాని ఈపరిభ్రమణము ఏమహాశక్తిచేత చేయింపబడుతున్నది? ఈపరస్పరత్యాగము పరస్పరసంబంధము,ఆకర్షణలకు మూలకారణమేది? నక్షత్రమండలానికి అవతలనుంచి ఎక్కడనుంచో ఉద్భవిస్తున్న కాస్మిక్ కిరణకాంతులచేతనే సూర్యునికి

ప్రకాశము కలుగుచున్నదనియూ, సూర్యుని ప్రకాశముచేతనే చంద్రునికి వెన్నెలకాంతి లభ్యమగు చున్నదనియూ నవీన శాస్త్రము సిద్ధాంతీకరిస్తున్నది. ఈ కాస్మిక్ కిరణ జాలము ఊహించలేని మహా వేగముతో ప్రయాణము చేయుచున్నదనియూ ఈకిరణ జాల సంఘర్షణలో ఉత్పన్నమైన మహత్తర వేడిమిని, ఉష్ణమును భరించుటకు మహా సముద్రములే లేకపోతే, ఆకిరణజాలవిజృంభణకు ఈగోళములన్నియూ భస్మీపటలమయి పోయేవనియూ, ఈసమస్త విశ్వరక్షణకు దేనికితగిన ఏర్పాట్లు, కట్టుదిట్టములు దానికి చేయబడేవున్న వనియూ ఇటీవల జరిగిన అంతర్జాతీయ విజ్ఞానవేత్తల మహాసభవారి యొక్క సిద్ధాంతములు. మన శాస్త్రములలో చెప్పబడే మహాసముద్రములలోని బడబాగ్నివంటిదేనేమో వీరు చెప్పేదికూడ. జలములో అగ్నివుండగలగడం అనే ఈ వైరుధ్యం, ఈసమస్య సృష్టిలో బహుశునాయాసంగా పరిష్కరింప బడుచున్నది. ఇట్టి పరస్పరవైరుధ్యములు అనంతంగా వుంటూనే వున్నవి, అవి వెంటనే పరిష్కరింపబడుచునే వున్నవికూడ. ఈమహాస్సృష్టిలో సృష్టిలోవున్న ఈవైరుధ్య సమన్వయ శక్తినేమానవుడుగూడ అనుకరించి పొందగలిగినప్పుడే జీవితం సార్ధకమవుతుంది. ద్వంద్వాతీతుడు కాగలగడమే జీవితలక్ష్యము.

(వశేషం)

బృందావనమ్

శ్రీ కే. వేం. నృ. అప్పారావు

3

గవాం దుగ్ధం లబ్ధ్వా వ్రజశిశుగణః పుష్టిమకరోత్
గతః ప్లీహా వ్యాధి స్తదుదర గతః పోతన కృతః
తదా కర్ణాభ్యాత్యంతం వికల హృదభూత్కంస నృపతిః
పరశ్రేయః శ్రోత్రే పతతి కుమతేః శూలహతివత్.

కృష్ణ స్యాయం మాతులః కంసభూపః
కింత్వత్యంతం ఖిన్న ఏతత్స్వభావః
వంశస్యైక స్యైక దేశేన వంశీ
తస్యైవాస్యే నార్జ్యతే చాపయష్టిః.

గోపాలా శ్చేత్ హృష్ట పుష్టా భవేయుః
నైరం కుశ్యం నైవతేమే సహేరన్
తస్మా దేతాన్ దుర్బలాన్ కారయిష్యే
తద్గో రూపం పుష్టి హేతుం హ్యపఘ్నన్.

ఇత్యాలోచ్య స్వీయ చిత్తే స కంసః
ఆహూయాహ ద్రాక్ తృణావర్త సంజ్ఞం
బృందారణ్యం యాహి సర్వం తృణంచ
క్రీణి హ్యత్ర ప్రేషయ ప్రీతయే మే

ఇత్యుక్త్వాతం ప్రేషయామాసభూపం
దత్త్వా తస్మై పుష్కలాః స్వర్ణ ముద్రాః
స్వర్ణం దృష్ట్వా మోహితా గోపకాశ్చ
వ్యక్రీణన్ స్వాన్ గోతృణాద్ర నమూల్యాన్.

యథాహి వాత్యోత్క్షిపతిక్షితే స్తృణం తథైవ బృందావన గోవ్రజాః
బలాత్ సనేతుం మధురాం ప్రచక్రమే గవాంగణే పశ్యతి దీన లోచ

న ఖలు తృణ వణిగ్ ధిగ్ దైత్య ఇత్యేవ మన్యే
యదయ మదయ మన్నం గోముఖాదా దదాతి
ఇతి మనసి విచింత్య శ్రీయశోదా కుమారో
ముఖ నిహిత తృణం తం ప్రైషయత్ స్వస్థలం ద్రాక్.

వీణావాసవదత్తము

శ్రీ పాలావజ్ఝల రామశాస్త్రి, ఎం. ఎ.

ద్వితీయాంకము.

(తాపసవ్యంజనముతోఁడి చారుఁడు ప్రవేశించును)

చారుఁడు— వత్సరాజు వేణువనమును బ్రవేశించినంతనే కపోతకునిఁ బంపితిని. అతఁడుజ్జయినిని జేరలేదాయేమి? ఎండుటాకుల మర్మరధ్వనివలె నున్నది. అరే! ఆయుధీయుఁడు.

భటుఁడు- భగవంతుఁడా! పానీయము భగవంతుఁడా! పానీయము గలదా?

చారుఁడు— భద్ర! కరకస్థములు తక్క వేఱు లేవు.

భటుఁడు— అదియే పరమ పవిత్రము.

చారుఁడు- అట్లే యౌఁగాక.

భటుఁడు- (దోసిలిఁబట్టి పానీయము త్రావి) భగవంతుఁడ! ఇప్పుడు నన్ను బ్రదికించితివి.

చారుఁడు— భద్ర! ఈవేళ చలిమిరికలది. నీ వెందుల కతి మాత్రముగఁ బానీయము త్రావితివి?

భటుఁడు - భగవంతుఁడ! భర్త వత్సరాజు వెదుళ్ళ జొంపములతోడి నాగవనమునందు మహా గజ యూథము ప్రవేశించెనని తెలిసి మిక్కిలి త్వరగా వచ్చెను.

చారుఁడు- (స్వగతము) అదియట్లే. వీని. నీరీతి నడిగెదను (ప్రకాశముగ) ఓయి! ఆరాజల్ప బలముతో నేల పరిభ్రమించుచున్నాఁడు?

భటుఁడు— ఏమి? అల్పబలమా? రెండువేలు పదాతి గణము, రెండు నూఱు లాము కొన్న తురంగములు. ఇరువది మత్త వారణములు.

చారుఁడు— మఱి యౌగంధరాయణుఁడు రుమణ్వంతుఁడు నిటకు వచ్చిరా, వెనుబడి వచ్చుచున్నారా?

భటుఁడు- ఆర్య యౌగంధరాయణుఁడు పురరక్షయందు నియుక్తుఁడయ్యెను. ఆర్య రుమణ్వంతుఁడు పుళిందక్షోభము నణచుటకుఁ బయనమయ్యెను.

చారుఁడు- (స్వగతము) ఓహో! లేఖలో నెట్లు చెప్పఁబడినదో యట్లే సర్వము నిది యథార్థము.

భటుఁడు - భగవంతుఁడా! నమస్కారము. వెళ్ళుచున్నాను.

చారుఁడు—స్వస్తి. (భటుఁడు నిష్క్రమించును) ఇప్పుడేమిచేయవలయునో కద. వత్సరాజు శిలీంధ్రకషండము నాగవనమును బ్రవేశించెను ఎవ్వఁడో యుజ్జయిని త్రోవను వచ్చుచున్నాఁడు.

(పుళింద వేషమునఁ జారుఁడు ప్రవేశించి) ఓయి! చక్కగా నొకమాట యడిగెదను. నిష్కర్మశీలురకుఁ దపస్సన్నట్లు నీ విచటఁ గూర్చుంటివి. సేనా సువోఁగం దెవతెఁ గొట్టుకాడుచుంటివి.

చారుఁడు ఓయి మత్సంధిక! నీవు నగరము పోకుండగనే వెనుకకు వచ్చితివా లేదా?

పుళిందుఁడు— ఓయి! నేను వెళ్లుచుండఁగా మార్గమునందే యార్య శాలంకాయనుఁడు కనఁబడెను.

చారుఁడు- ఆయనకెట్లు వత్సరాజు శిలీంధ్రషండమునఁ బ్రవేశించెనని తెలిసెను?

పుళిందుఁడు నగరమునందలి చారులచేత.

చారుఁడు యుక్తమే తరువాత నిప్పుడాయన యెక్కడ?

పుళిందుఁడు- ఆర్యశాలంకాయనుఁడు నచ్చటఁ బౌరగజమును జతుశ్శత పాదాత గణముతో నిలిపి శబరరాజు చూపిన త్రోవ వెంట నీలహస్తిని బట్టికొని యమునా కచ్ఛమున సాలవనమును బ్రవేశించి నిగూఢముగ నిలిచియుండెను

చారుఁడు- తరువాత తరువాత

పుళిందుఁడు- అప్పుడార్య శాలంకాయనుఁడు నన్ను బిలిచి శ్యేనుని వద్దకుఁబోయి వత్సరాజు ప్రవృత్తిని దెలిసికొనిరమ్మని పంపెను

చారుఁడు కపోతకుని శ్యేనుని వద్దకుఁబంపి యయుక్త మాచరించెను.

పుళిందుఁడు- చాలుఁగాని పరిహాసము. ఇచటి వృత్తాంత మేమిఁ

చారుఁడు- అంతయుఁ దెలిసినది రమ్ము. అచటికే పోదము.

(నిష్క్రమింతురు. ఇది ప్రవేశకము.)

(అంతటనుదయనుఁడు విష్ణుత్రాతుఁడు విదూషకుఁడును బ్రవేశింతురు.)

రాజు— సఖుఁడ విష్ణుత్రాత!

కరవిలూన దృఢోపశాఖ మ్రుదుమోత్కరము, దశన సముల్లిఖితము ప్రాంత నగచయమ్ము, పాదముద్రా విషమమ్ము నేల
గలిగి గజమ్మయనుట్టు లీకాన పోలుచు॥

విదూషకుఁడు- నాకు మఱి యాకలిచేత నన్నమయమువలెఁ దోఁచుచున్నది

విష్ణుత్రాతుఁడు- అందాశ్చర్యము లేదు.

రాజు వయస్యుఁడా! ఇప్పుడే నీ యీ యాకలి ప్రారంభమయ్యెనా?

విదూషకుఁడు- కోడికూతతోనే మొదలు పెట్టినది.

(అందఱు పరిక్రమంతురు.)

విష్ణుత్రాతుఁడు- దేవ! ఇటు చూడుఁడు. ప్రదేశ మెత్తుగా నుండుటచేత వారి విస్పష్టముగాఁ గానవచ్చుచున్నది

ఇంతలంతలు నౌ కరి సంతతులను
దొండములనార్చి దంతకాంతులు వెలార్చి
దుందుడుకుగా మెదలు వారి తుండవంత
ఫేన భుజగోర్మిమాల వాపియనితోఁచు

రాజు యుక్తముగాఁబలికితివి.

ఉపలముల పోలె నల్లనయి పటు బృంహి
తములు మంద్రగభీరమై దశనశబల
మైన గజఘట బెగ్గురుల్ పైనఁజెవర
నంబు ధారావన ప్రమాంబుదాళిఁబోలు॥

విదూషకుఁడు ఓయి! కందమూలములవలె దంతములున్నవి. మోదకములవలెఁగుంభములు. కర్ణములుమందెఁగలే కండ్లుకుళుత్థములవలె నున్నవి. అన్నరాశివలెఁదొండమున్నది.

రాజు అతిసాదృశ్యముగాఁబల్కితివి.

—ప్రవేశించి పాశికాధ్యక్షుఁడు—

భర్త జయించుఁగాక. ఆజ్ఞానుసారము సర్వదిశలయందు బలివిధానము జరుపఁబడినది. అగ్ని వేల్వఁబడినది. దక్షిణలు స్వీకరించి బ్రాహ్మణులు స్వస్తిపలికిరి. వారిచుట్టు ముట్టబడినది. పతాకల నెత్తియుంచిరి. తమగహన నివేశనమునద్వారా సమీపమునఁబురుషులుద్ధృతవేణు దండపాషాణాంకుశ పాశాయుధ సమృద్ధులతో నిలిచియుండిరి ఏనుఁగులు వచ్చెడిత్రోవలో నోదములు చర్మకంచుకములతోఁగప్పఁబడి యేనుగుగున్నలపాదముద్రలతో నంతరితములుగాఁ జేయఁబడిన పాదబంధనములుంపఁబడినవి భర్త యీకర్మవిధానమును జూడఁదగును.

రాజు-నీవుముందు వెడలుము. మేము నిదె వచ్చుచున్నాము.

పాళికాధ్యక్షుఁడు-అట్లే (నిష్క్రమించును)

(వనచరవేషముతోడిచారుఁడు ప్రవేశించును)

చారుఁడు సుశిక్షితమగు కరేణువుచే వంచింపఁ బడిన యూధపతినివలె వత్సరాజును బంధనమునఁ బ్రవేశపెట్టినేఁటికి భర్త ప్రద్యోతుని ఋణము నీగికొందును. (పరిక్రమించి) శిలింధ్రకషండమును బ్రవేశించితిని. వత్సరాజెచ్చటనుండునో విలోకించి) ఇదిగో యితఁడే. (దగ్గఱకువచ్చి) భర్త జయించుఁ గాక. మోసముకానిచో నేను నీలహస్తిని గనుగొంటిని

రాజు-(ఆనందముతో)-భద్రుఁడ! నీలగజము నెచ్చటఁ గనుగొంటివి?

చారుఁడు ఇటకు యోజనముమేరలో యమున మడుగునొద్ద సాలవనముకలదు. అచట మానలభరితయనెడి గురువింద పొదరు కలదు. ఆపొదప్రక్క నది చరించుచున్నది.

రాజు-సఖుఁడ విష్ణుత్రాత! నీలకువలయతనువన్న హస్తిచక్రవర్తికిలభింపఁగిదగినది. అది యన్యులకుఁ బట్టువడదు.

మఱినేను దానిఁ బట్టఁగ
గొలుతు గలాఁడనని తోఁచుఁగూరదు శ్రమమి
త్తఱి విశేషముగనా
కుఅవగు నీవీణ బంధనోద్యమసిద్ధిన్.

విష్ణుత్రాతుఁడు-దేవర యైరావతాదులగు దిగ్గజములనే పట్టఁగల్గినపుడీ వనగజముమాట యేమి?

రాజు-సఖుఁడ! నీవిప్పుడు పరికరము అన్నింటితో హస్తిబంధనమునఁ బ్రయత్నము సలుపుము. నేను నాగజవరమును స్వీకరించి శీఘ్రముగాఁ దీసికొనివత్తును.

విష్ణుత్రాతుఁడు-

ఇవిగడిపాలములును నదీ
నివేశములు రక్షణమున నిశ్చితములుగా
నివిగాన దేవరకు దు
ష్ప్రవేశ్యములు సర్వసైన్యసాహ్యాము లేకన్॥

విదూషకుఁడు-ఆర్యుఁడుచక్కఁగాఁజెప్పెను. అపరీక్షితమయినదేశము అపరీక్షితమయిన యన్నమువలె దుఃఖము నుత్పాదింపఁ గలదు.

రాజు-వయస్య!ఆహస్తిదర్శనమా యనియతము నిశ్చితముగా దొరకిన హస్తియూధమును వదలికొనిన నర్థహాని యగును. ఇందు విచారింపనేమున్నది. చూడుము.

అదియొ కనిపింపవలెఁగాని హస్తిబంధ
నైకపటు ఘోషపతి వీణనాకుఁగలదు
అత్యయము కల్గునందు వావ్యాళతుంద
సమసితాసితయసి నాకరమునఁగలదు॥

విష్ణుత్రాతుఁడు-హస్తిబంధన మొనర్చిన తరువాతనే యరుగవచ్చునుగదా.

రాజు—సాతిశయమగు వస్తువునందుఁగాలాతిక్రమము కూడదు సామముచే సాధింపఁదగిన గజపతికి సేనాదర్శనము కోపకారణముకూడనగును.

విదూషకుఁడు-ఓయి! ఏమిచేయుదము?

రాజు సఖుఁడ! విష్ణుత్రాత! నేనీ గజమును బట్టికొని సాయం సమయమగుసరికి సప్తపర్ణవేదికాద్వారమున నివాసమునకు రాఁగల్గుదును. నీవును;

హీనవ్యాధిత వృద్ధనిందితములున్
హేయమ్ముకాదంత ఖా
రాన్నమ్ములు ధేనుకమ్ములును
వర్ణాధిక్య సంపన్నముల్
కానంద్రోచిన ప్రాప్తరాజ్యసుఖముల్
గర్వాలసల్ పోతముల్
గానన్మేలగువానిఁ బట్టి వెరవుల్
గల్పింపుమా యిచ్చటన్॥

పిదప సాధనములతోఁగూడ నచ్చటికి నివసింపరమ్ము.

విష్ణుత్రాతుఁడు దేవరయాజ్ఞాపించినట్లే.

చారుఁడు భర్త! మోసగానివలె సమయము

దాటింపకుండ నే నచ్చటనుండఁగలను

రాజు-భద్ర! నీమాటయందు మాకీవఱకే ప్రత్యయము గలదు, గద.

చారుఁడు-కావుననే యిట్లుచెప్పితిని.

రాజు-ఏదీ సుందరపాటలము.

అశ్వబంధకుఁడు (ప్రవేశించి) భర్తః ఇదిగో సుందరపాటలము.

రాజు-తీసికొని రా(గుఱ్ఱమునెక్కి) విష్ణుత్రాత! నీవుపొమ్ము కాత్యాయనమిత్రుల నగ్రభాగమున నుండుమనుము.

విష్ణుత్రాతుఁడు దేవరయాజ్ఞాపించినట్లే! ఇది కష్టముకదా-

ప్రభువుతోటను బ్రతిషేధవామమతులు
దైవమా వక్రమైనది, దానియందు
నిలిచెఁగార్యమ్ము; పురుషుని స్నేహబుద్ధి
కంటె దుర్యశ; క్లేశదుఃఖకరమెద్ది।

(నిష్క్రమించును.)

చారుఁడు-(స్వగతము) వత్సరాజు పరికరములతో వచ్చెనా నీవుతప్పించికొని రమ్మని గదా ఆర్యశాలంకాయనుఁడు చెప్పెను. ఇతఁడుఇపుడు బలమునుజ్జగించి బయలుదేరెను. సర్వథాకార్యము సిద్ధించినది

రాజు ఏదీ ఘోషవతి

ఔపగాయకుఁడు (ప్రవేశించి)-(ఘోషవతిచేత నుంచికొని) భర్తః జయించుగాక ఇదిగో నేను సిద్ధముగానుంటిని.

రాజు-నీవునావెంటరమ్ము.

ఔపగాయకుఁడు చిత్తము.

విదూషకుఁడు-ఓయి! ఇదె కాత్యాయనుఁడు వింశతి మాత్రబలముతోఁబరివారము తీర్చి ముందఱనడచుచున్నాఁడు. నేను నీతోఁగూడనిప్పుడ వచ్చెదను.

రాజు-వయస్యుఁడా! మేము శీఘ్రముగా నేగవలయును. కావున నీవు విష్ణుత్రాతునితోఁ గూడిరమ్ము.

విదూషకుఁడు-ఓయి! నేనునీతోడనే వచ్చెదను.

రాజు వయస్య! నీవునిలువుము నాప్రాణముల మీఁదనొట్టు.

విదూషకుఁడు-ఇదిగోఉన్నాను. నీవు విజయం చేయుము. (నిష్క్రమించును.)

చారుఁడు-భర్త. ఇపుడాలసింపఁదగదు.

రాజు-భద్రుఁడ! నీవుముందుండి త్రోవచూపుచుండుము.

చారుఁడు అట్లే. ఇటు ఇటు.

(అందఱు పరిక్రమింతురు.)

రాజు- ఓహో! సుందర పాటలము యెక్కజవము.

ఈనదీ పార్శ్వముల వెంట నెసఁగు వృక్ష
గహన మిది యింతలోఁ బైనఁ గప్పికొనుచు
నెదురుగాఁబఱతెంచి నట్లేగుదెంచు
నెదురుపడినంత నా వెన్కనొదుగుచుండు॥

చారుఁడు-యమునమడుగుచేరఁబోవుచున్నాము.

ఆర్య! అదృష్టవశమునఁబ్రొద్దు పాతిక భాగము మిగులఁగనే చేరితిమి (పరిక్రమించి) భట్ట! అదిగో యావరణము. అతి ముక్తసాలచ్ఛాయలో నిలిచియున్నది.

రాజు-చెలికాఁడ! అవునదియే.

కాలిగోళ్లు సమస్వచ్ఛకాంతిఁగ్రాలుఁ,
గ్గార్ముకాకారమున వెన్నుఁగాచితోఁచు
హనుఁలాట కటమ్మును ఘనములంస
భాగము దృఢమ్ము వెడఁదలు వాఖుఁజెవులు
వ్యాయతావృత్తహస్తోచ్ఛ్రి తాగ్రకాయ
మైగజము నీలజీమూతమట్లై పొలుచు॥

చారుఁడు-(ఆత్మగతము ఇంకవిప్పాఁటినట్లగును. [ప్రకాశము]-ముహూర్తకాలము తిందుకచ్ఛాయల విశ్రమింతును. [నిష్క్రమించును]

రాజు-[అశ్వమునుండిదిగి] భృంగారువేది

చేటుఁడు-[భృంగారుకము చేతఁబుచ్చికొని] భర్తజయించుఁగాక. ఇదిగోభృంగారువు

రాజు-[ఆచమించి] ఔపగాయక! ఘోషవతి నిటిమ్ము.

ఔపగాయకుఁడు-భట్ట! ఇదిగో ఘోషవతి.

రాజు-[ఘోషవతిని చేతఁగొని మూర్ఛనము నొనర్చును.]

చేటు.డు-నేను గూడనింకనచ్చటనేఁగూర్చుండెదను. (నిష్క్రమించును)

రాజు-[ఆత్మగతము] ఇదియేమి నాబాహువు బలహీనమైనట్లుతోఁచుచున్నది,నాయెడమ కన్నదరుచున్నది.

ఔపగాయకుఁడు-అయ్యో! ఎదురుబొదురున గాకి కర్ణకఠోరముగ నఱచుచున్నది. ఈ గహనప్రదేశము బహుచోరనివాసము.ఏమి యగునో గద

(అంతట చోరసేనాపతి ఖడ్గహస్తుఁడగు చేటునితోఁబ్రవేశించును)

చోరుఁడు ఓహో! రాజులప్రభావమనఁగా నిది గదా. వత్సరాజీ వనమును బ్రవేశించునని విన్నంతనే ధ్వజట్టు పటాపంచలయినది. (ఇద్దఱునటునిటు పరిక్రమింతురు.)

రాజు- (వీణమీటిపాడును.) అల్పాక్షర—

అసదృశతేజో బలాతిశౌర్య
మసృణమనోజ్ఞవంశ! వినుమయ్య
వశము నాకగుము కువలయనీల
అసదుగాదు సుభద్రమగునుభద్ర!

(నేపథ్యమున భేరీపటహశంఖాకృష్టధ్వనులు చేయఁబడుచుండును.)

రాజు-హా! ఇదియప్రతినిధియగు నీలకువలయ హస్తియని మోసగింపఁబడితిమి. ఎవని చేతనో నన్నాకర్షించుటకై యీప్రణిధి నియుక్తుఁడయి యుండును

ఔపగాయకుఁడు- సాయుధులగు పురుషులచే నంతటఁముట్టడింపఁబడితిమి.

రాజు (ఔపగాయకునకు వీణనిచ్చి యశ్వము నారోహించి) — ఈప్రదేశమశ్వసంచార యోగ్యము కానియట్లున్నది. సరే. (అందఱు పరిక్రమించుచుందురు.

రాజు-ఓయి జయధన్వ! ప్రాగ్దిశనుండుమీవు.
నాగరిక కాత్యాయన! నన్నుఁజేర
రమ్ముచుందుఁడ! పృష్ఠభాగమ్ముపొందు
సవ్యమరిమంతుఁడోము: బుక్షపతి! నీవు
దక్షిణము; హంసకా!బిట్టుదాఁటిపోకు
మగ్రమందుండు మత్పార్శ్వమందు నగ్ని
జితుఁడ! యుండు,వ్యాఘ్రుఁడ! తేజిచేరికొనుము
శివునితోముమ్మగావుఁడు శేషభటులు॥

అశ్వశిక్షకుఁడు.సాధు ఆజ్ఞానుసారమందఱట్లే నిల్చిరి.

శాలంకాయనుఁడు— (ప్రవేశించి) దేవ! సాహసము చేయవలదు. హయగజకలిలమగు ప్రద్యోతమహాబలముచే బరీతుఁడవైతివి.

రాజు-అ; ఆదురాత్ముని ప్రయోగమాయిది. సరే.

ఇదిమొదలు వానికులమును
వధింతునాబాల బాంధవమ్ముగదావం
బొదవి తరుఘట్టనమ్మున
సుదారుణముత్కృణమువనముఁజూడినభంగిన్॥

శాలంకాయనుఁడు-కుశలియు నక్షతుఁడునగు నిన్ను మహాసేనుఁడు చూడ నిచ్ఛగించుచున్నాఁడు.

రాజు—(ఆత్మగతము) యథాక్రమముగా మొదలిడిన కార్యములు విద్వదనపహాస్యములు సఫలములునగును. కావున సామాదులతో నీయాపదనుత్తరింప వలయును. (ప్రకాశముగ) నీవెవఁడవు?నీగోత్రమేమి?

శాలంకాయనుఁడు-దేవ. పేరుచేతసూర్యదత్తుఁడను గోత్రముచేత శాలంకాయనుఁడను.

రాజు నేఁడెంత సుదినము అర్థమర్థమునను బంధించునన్నది యిదేగదా. సాధు రమ్ము.

శాలంకాయనుఁడు-అగ్నులవలె రాజులు నాత్యాసన్నులు. నాతిదూరగులగువారిచేసుఖసేవ్యులగుదురు.

ఔపగాయకుఁడు ఈధూర్తబ్రాహ్మణుఁడు ప్రతివాదివలె నున్నాడు.

రాజు-రమ్ము ఇపుడపోదము. వత్సేశ్వరలక్ష్మి నింక నీభ్రూవిక్షేపానువర్తినిగాఁజేసికొనుము.

ధృతిమతి విభూతివెలసిన సూర్యదత్తు
పైన నిజరాజ్యభారమ్ము పాదుకొల్పి
స్వస్థమైన మనమ్ముతో శయ్యఁ గూరు
చున్నఁడను నాదుకోర్కి యీఁడేఱెనేఁడు

శాలంకాయనుఁడు.-దేవర ప్రసాదమును ప్రతిగ్రహించితిని. కాని స్వామియుద్దేశము నతిక్రమింపకుండఁ జేయుట యిహపరములందును హితసుఖములకు నిదానముగదా.

రాజు.-ఓయి సూర్యదత్త! పూజ్యుఁడు భరతరోహకుఁడు నీగుణవిభూతికి నసహమానుఁడై యేకలముల కలహములో నొకదాని వధముచే వృత్తి నపేక్షించు చండాలునివలె నిన్ను నిత్యమును హింసింపఁగోరి యాసన్నాపాయములగు నిట్టి పనులయందు నియోగించుచున్నాడు. వానికి నీవు లగుడస్థానీయుఁడవైతివి.

శాలంకాయనుఁడు.-నేను మహాసేనుని భృత్యుఁడను. భరతరోహకునకుఁగాదు

రాజు.-ఆర్య! అతినృశంసుఁడగు ప్రద్యోతుని సమీపవర్తివగు నీకు వ్యాఘ్రసమీపమునం జరించు మృగమునకు వలెఁ బ్రత్యవాయము నియతమైయున్నది. కావున నచటియునికి మీకు శ్రేయస్కరముకాదు మరియు నార్యుఁడు పరిశీలించుఁగాక

నిదుద్రాటన్ జ్వలితాగ్నిఁ బట్ట వెరవు
న్నిర్మించుటొఁగాదె న
న్నొండువం జూచుటనే నవార్యుఁడను
బ్రద్యోతుండు నిన్నెట్టులున్
మడియం జేయక తక్కఁడాతఁడు
కృతాంహస్స్ఫూర్తి పౌరాళినిన్
గెడపెన్ సూదకు నాపితున్ గజములన్
గ్రేడించు మావంతునిన్।

శాలంకాయనుఁడు.-(కర్ణములు మూసికొని). శాంతం శాంతం. పాపమ్' నేను భర్తను గూర్చి యపవాదము వినఁజాలను. దేవర యస్థానమున వాగ్వ్యయము గావించుచున్నారు. ఎట్లందురా.

స్వామి యనురాగరక్షణ స్వస్త్యయనము
నంది నామనమిది యభేద్యమయి వెలఁగుఁ
గాన పరుషాక్షరాయుధ గణముచేతఁ
బరులుగావించు భేదమ్ము వమ్ముగాదె।
విడుమస్త్రము ప్రద్యోతునిఁ
గడుకొని భజియింపుమంతఁ గల్యాణమగున్
ఎడనోర్మికిఁ దేజంబునఁ
గడిమి మెఱయుటకును దేశకాలములుండున్।

రాజు.-ఛీ!

క్షత్రియుం డెవ్వఁడేని యశమ్ముతోడి
సహజమాన సుధారసజ్ఞత వహించి
తెరలి వ్యాయామకర్కశ దీర్ఘసుదృఢ
బాహువస్త్రము విడి శత్రువశత గొనునె।

అశ్వశిక్షకుఁడు భర్త. ఇతఁడు హస్తి నెక్కినాఁడు. సిద్ధముకమ్ము.

ఔపగాయకుఁడు.-హస్తిపకుఁడు సఖడ్గ భీషణమగు హస్తినిఁ బురికొల్పినాఁడు సింహనాదములొనర్చుచు వనగజకక్షనుండి వెడలెడి శత్రుబలమునుగూడ మనయోధు లుపలక్షించిరి.

రాజు.-ఔఁగాక.

ఇల సాళ్వద్విపమైన శత్రుచమువున్
హింసించి తత్కంఠ నా
ళల లత్కోష్ణనవాస్ర తర్పణమునన్
లాలించి సాలావృకం
బులు గృధ్రంబులు కాకకంక శునక
మ్ముల్ మాంసముల్గొంచు వ
ర్తిలఁ దజ్జీవ పరిగ్రహాప్తి సమవర్తిన్
బ్రీతునిం జేసెదన్

(ఔపగాయకాశ్వబంధకులతో నిష్క్రమించును.)

శాలంకాయనుఁడు.-అహో! క్షాత్రతేజము. నేను గూడ నాబలములకడ నుందును.

(నిష్క్రమించును.)

(సశేషము)

వెన్నెల

[కథానిక]

మపాసా

మదాం జూలియా రొంబరీ—వాళ్ళ అక్కయ్య రాకకోసం నిరీక్షిస్తూఉంది. వాళ్ళ అక్కయ్య మదాం హెన్రీటా లెతోర్. ఆవిడ స్విట్జర్లాండు వెళ్ళి తిరిగి స్వదేశానికి ఇప్పుడే వస్తున్నది.

మదాం హెన్రీటా, ఆవిడ భర్తా—సుమారు నెలాపదిరోజుల క్రితం స్విట్జర్లాండు వెళ్ళారు. తిరిగి దేశానికి వచ్చేటప్పుడు కాల్వెడాస్‌లోని తమఎస్టేటులో ముఖ్యమైన వ్యవహారాలు ఏవో ఉంటే భర్తను ఒక్కణ్ణీ ముందు అక్కడకి వెళ్ళనిచ్చి-తానుమాత్రం చెల్లెలిదగ్గరనాలుగు రోజులుండి పోదామని ఏకాఎకి పారిస్‌కు వచ్చింది, మదాం హెన్రీటా.

అది సంధ్యవేళ. మసక వెలుతురులో మదాం జూలియా తన యింటిముందు వసారాలోకూచుని ఏదోచదువుకుంటున్నది. అయితే ఆవిడదృష్టి చదువుమీద లేదు. ఏమాత్రం అలికిడి అయినా తల ఎత్తిచూస్తున్నది. అక్కయ్య రాకకోసం ఎదురుచూస్తున్నది.

చివరకు తలుపు చప్పుడయింది. అక్కయ్యరానేవచ్చింది. ఆమెను చూడగానే మదాం జూలియా గభాలునలేచి పరుగెత్తింది. మాటా పలుకూలేకుండానే అక్కచెల్లెళ్ళు ఒకరినొకరు కౌగలించుకున్నారు. అలాఎంతోసేపు మళ్ళీ మళ్ళీ కౌగలించుకుంటేకాని వాళ్ళకు తృప్తితీరలేదు. తరువాత ఇద్దరూ మాట్లాడుకున్నారు. ఒకరినొకరు కుశలప్రశ్నలు వేసుకున్నారు. ఒకరికుటుంబ యోగక్షేమాలు ఒకరుఅడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎన్నెన్నో ముచ్చట్లు-నవ్వుతూ పేలుతూ కబుర్లాడుకున్నారు. ఇంట్లోకి వెళ్ళిన తరువాత హెన్రీటా, తనహేటు తీసి అవతల పెట్టింది. దుస్తులు మార్చుకుంది.

అప్పటికి బాగాచీకటిపడింది. ఇంట్లో దీపాలు ముట్టించారు. ఆ దీపపు వెలుతురులో మదాం రొంబరీ మళ్ళీఒకమాటు అక్కయ్యను కౌగలించుకుని ముద్దాడింది. కాని ఈమాటు ఆవెలుగులో అక్కయ్య ముఖకవళికలుచూచి నిర్ఘాంతపోయి అలాగే నిలుచుండి పోయింది. మదాం హెన్రీటాకు — రెండు కణతల దగ్గరా గుండ్రగా ఉంగరాలు తిరిగిన జుట్టు- తెల్లగానెరసి పోయింది. తళతళ మెరుస్తూ కనుపించింది. తక్కిన తల వెంట్రుకలన్నీ నల్లగాపట్టుకుచ్చులా మెదమెదలాడుతున్నాయి. రెండు కణతల దగ్గర మాత్రమే ఆవిధంగా తెల్లజుట్టు నల్లటిపరిసరాలమధ్య ప్రవహించే రెండు వెండి వాగులలా కనుపిస్తున్నాయి! హెన్రీటాకు ఇరవైనాలుగేండ్లు. స్విట్జర్లాండు వెళ్ళేటప్పుడు ఆమె బాగానే ఉంది. మరి ఇంతలోనే-అకస్మాత్తుగా ఈ మార్పు ఎందుకు వచ్చినట్టు?

మదాం జూలియా నిశ్చలంగా నిలుచుని అక్కయ్య వంక తదేకంగా చూచింది. అక్కయ్య ఇంతలోనే ఇలా

మారిపోవడానికి కారణమేమిటా అని ఆశ్చర్యపోయింది. అలా చూస్తుండగానే హెర్నీటా కనులలో నీళ్ళు తిరిగాయి. అక్కయ్యకేదో జరిగింది. ఏదో ఆపద రాక పోతే మనిషి ఇలామారిపోదు-అని మనసులో నిశ్చయం చేసుకున్నది జూలియా. "అక్కా! ఏం జరిగిందక్కా ? నాకు చెప్పవూ?-" అని అడిగింది.

అదివిని మనోవ్యధతో క్రుంగిపోతున్న హెర్నీటా చిరునవ్వు నవ్వింది ఆ చిరునవ్వులో ఏదో విషవిషాదం చిందింది.

"ఏమీ లేదే,ఏముందికనుక?-నా నెరసిన జుట్టుచూచా ఇలా అడుగుతున్నావు?-" అన్నది మదాం హెర్నీటా.

ఏమీలేదని అక్కయ్య ఎంతచెప్పినప్పటికీ జూలియా ఒప్పుకోలేదు. ఏదో విషయం చెప్పకుండా దాచిపెడుతున్నదని గ్రహించింది. అక్కయ్య బుజాలమీద చేతులువేసి, ఆమె ముఖంలోకిచూస్తూ మళ్ళీఅడిగింది.

"అక్కా! ఏం జరిగిందక్కా? నాకు చెప్పవూ? చెప్పకపోతే ఊరుకోను. ఒకవేళ నీవుఅబద్ధంచెప్పినా— నేను కనుక్కోగలనులే!" అన్నది.

అక్కచెల్లెళ్ళిద్దరూ ఒకరి ముఖంలోకి ఒకరు చూచుకుంటూ నిలుచుండిపోయారు. మదాం హెర్నీటా ముఖంలో కత్తివాటు వేసినా నెత్తురు చుక్కలేదు. మనిషి సొమ్మసిల్లి పడిపోయేటట్లున్నది. ఆవిడ కనుకొలకులనుండి ముత్యాల్లా రెండుకన్నీటి చుక్కలు వెలువడినాయి.

చెల్లెలు మళ్ళీ అడగడం మొదలు పెట్టింది. "ఏమయిందే అక్కా? అసలు ఏం జరిగింది? నాకుజవాబు చెప్పవే?-" అన్నది జూలియా.

అప్పుడు మదాం హెర్నీటా-మెల్లగా, వంగిగొంతుతో—

"నేను-నేను ఒకాయన్ను ప్రేమించాను!—" అని బదులుచెప్పింది.

ఇలాచెప్పి ముఖం చెల్లెలి బుజంమీద వాల్చుకుని వెక్కివెక్కిఏడవడం మొదలు పెట్టింది

తరువాత కొంతసేపటికి ఆమె ఏడుపు తగ్గింది.కన్నీళ్ళుతుడుచుకునిపక్కకువచ్చి నిలుచున్నది. తన మనసులో వేధిస్తున్న రహస్యాన్ని చెల్లెలికిచెప్పి ఆ విధంగానయినా కొంత ఊరట చెందుదామనుకున్నది.

ఆ తరువాత అక్కచెల్లెళ్ళు చెట్టాపట్టాలు పట్టుకుని చీకటిగాఉన్న గదిలో ఒకమూల సోఫాదగ్గరికి వెళ్ళారు ఇద్దరూ ఆ సోఫాల్లో కూలబడ్డారు. చెల్లెలు,అక్కమెడచుట్టూ చెయ్యివేసి-ఆమెను దగ్గరికి లాక్కొని, ఆమెచెప్పేది వినడంమొదలు పెట్టింది.

* * *

"అయ్యో! ఏమనిచెప్పేదే? ఆనాటి నుండి నాకు పిచ్చెక్కి పోయిందనుకో. క్షమించరాని ఘోరం ఇది. నావిషయం నాకే అర్థం కావడంలేదే. చూడు చెల్లాయ్! నీమటుకు నీవు జాగర్తగా ఉండవే అమ్మా. మనలాంటి ఆడవాళ్ళు న్నారు చూచావూ-మనంచాలా మనో దౌర్బల్యం కలవాళ్ళం. ఇట్టే, లొంగిపోతాం. ఒక్కక్షణంలో-అకస్మాత్తుగా,

మనకు తెలీకుండానే-ఏదో పిచ్చిదిగులు వచ్చి ముసురుకుంటుంది. మనమనస్సును ఇష్టేలాకొక్కొని పోతుంది. దాంతోమనకు వళ్ళు తెలీదు. ప్రేమకోసం తపించి పోతాం. కొన్ని కొన్నిక్షణాలలో పురుషులకు ఇష్టే వశమయిపోతాం.

"మావారి విషయం నీకుతెలుసును' మీబావ అంటే నాకు పంచప్రాణాలని కూడా నీవెరుగుదువు. కానిఆయన అదో రకం మనిషి. దేనికీ తొందరగా బయట పడడు. అనుభవంతో పండిపోయిన మనసు ఆయనది. చాలా తెలివైనవాడు కానిఉన్న చిక్కల్లాఏమిటంటే — స్త్రీల కోమల హృదయాన్ని ఆయనఅర్థంచేసుకోలేడు. ఆ హృదయతరంగాల సంగీత మాధుర్యాన్ని ఆయన అనుభవించలేడు. ఎప్పుడూ అంతే. ఎప్పుడూ అలాగే- ఆ మంచితనం, ఆమందహాసవదనం,ఆదయ, ఆ నిండుతనం-అన్నీ-అలాగే ఆయనలో ఎప్పుడూమూర్తీభవించి ఉంటాయి. మనిషిలో మార్పుచూడం. అయ్యో, ఏం చెప్పేదే. ఒకొక్కమాటు నాకు వెర్రి ఆవేశం వచ్చేది. నన్నాయన బలవంతానా, మొరటుగా దగ్గరికి లాక్కుంటేబావుండు ననిపించేది, నాముఖాన్ని ముద్దులతో నింపివేస్తే ఎంతహాయిగా ఉండునని పించేది. మారెండుఆత్మలూ ఐక్యమై మధురానంద డోలికలలోఊగి పోవాలని [illegible] దాన్ని. పోనీ-ఆయన నీచత్వా [illegible] మే. ఆయనకు దుర్బుద్ధిపుట్టినా నాకు సంతోషమే. నాకు కావలసిందల్లా ఒక్కటే. నిరంతరం ఆయన నాకోసం తపించిపోతేచాలు. నా లాలింపులకోసం, నాఆనందాశ్రువుల కోసం-అల్లాడి పోతేచాలు. అంతే.

"ఇదంతా నీకు అర్థంలేనిపిచ్చి వాగుడుగా కనిపించవచ్చు నమ్మాయ్. కాని మనం ఉన్నాం జూచావూ-ఆడవాళ్ళం. మనపుటకేఅంత. ఇహ ఏం చేస్తాం దానికి ?

"అయినా ఆయనకుద్రోహంచెయ్యాలన్న దుర్బుద్ధి నాకెన్నడూ పుట్టలేదు. మరి-ఇన్నాళ్ళకు, ఇప్పుడు - ప్రేమ లేకుండా, మరేదీలేకుండా, అకారణంగానే ఆదిసంభవించింది. కేవలం చంద్రుడి మూలంగా, లూసరన్ సరోవర తీరాన ఒక వెన్నెల రాత్రి ఇది జరిగింది.

"నేనూ, మావారూకలసి ప్రయాణం చేసిన ఈమాసం రోజులలో నేను పడిన యాతన అంతా—ఇంతా కాదనుకో: చెల్లాయ్! మావారికి నావిషయమే పట్టలేదు, నాఉత్సాహాన్నంతా పాడుచేసివేశాడు. వినువీధుల్లో విహరించే నా వాంఛా కుసుమాలన్నింటిని నేలబెట్టి కాల రాచాడు నాసంగతే విచారించలేదనుకో! అయ్యో! ఏమని చెప్పేదే అమ్మా! తెలతెలవారుతుండగా కొండలు ఎక్కేదిగేవాళ్ళం. గుర్రాలెక్కిస్వారిచేసే వాళ్లం. తళతళ లాడేకొండలు, కోనలు, ఆ అడవులు, ఆ లోయలు, ఆ వాగులు—

పంతలు, ఆ ఉద్యాన వనాలు ఆ సుందర దృశ్యాలు ఏమని చెప్పేదే! ఎవేవో వాంఛలు నామనస్సులో మొలకెత్తేవి. ఎక్కడలేని ఉత్సాహం పొర్లివచ్చేది. నేను మావారితో అనేదాన్ని, 'ఏమండీ! చూడండి అదృశ్యాలు. ఎంత మనో హరంగా ఉన్నవో. ఒక్కమాటు ఇలా నాదగ్గరకురారు. నన్ను ముద్దాడరూ' అనేదాన్ని. ఆయన చిరునవ్వునవ్వి ఊరు కొనేవారు. అంతే మరి మాటాలేదు పలుకూలేదు. 'ఈదృశ్యాలు అన్నీ ఇం చక్కగాఉన్నాయికనుక మనంముద్దాడా లాంటావు. అంతేనా.' అనేవారు ఎప్పు డయినా.

"ఆయనమాటలు వింటూంటే నా హృదయం వికలశకలాలయ్యేది. అవును. గాఢంగా ప్రేమించుకున్న ప్రేయసీప్రియులు ఈలాంటి మనోహర దృశ్యాలు చూచినప్పుడు ఇంకా ఎంతో ఉల్లాసపడరూమరీ! కానీ ఆయనకు ఈ గొడవేపట్టదుమరి! నేనెంతగా పరితపించి పోతున్నానో ఆయన అంత నీళ్లుగారి పోతున్నాడు. ఏమయితేనేం నాలో పెల్లు బికివస్తూన్న ప్రేమవాహినులకు ఆయన అడ్డుకట్టలువేశాడు. మరి, నామనోవ్యథ ఆయనకు ఏమనిచెప్పగలను. ఏలావ్యక్తం చెయ్యగలను. అది నాలోనే తుకతుక ఉడికిపోసాగింది. ఆవిరితోనిండిపోయింది. దాన్నిమూతవేసి బిగించారు.

"ఫ్లొరెన్ హోటల్లో మేము నాలుగు రోజులు మకాంచేశాం. ఒకనాటిరాత్రి మీ బావ తల నొప్పిగా ఉన్నదని చెప్పి భోజనం అయిన వెంటనే వెళ్ళి పడుకున్నాడు. ఈతలనొప్పులూ ఈ వళ్లు నొప్పులూ ఆయనకు రోజూమామూలే! నాకేమితోచింది కాదు ఒక్క దాన్నీ ఆలా సరోవర తీరానికి షికారు వెళ్లాను.

"ఆరాత్రి ఎంతమనోహరంగా ఉందనీ. దేవకన్యల కథల్లో వింటూంటామే అలాంటిరాత్రి. పూర్ణచంద్రుడు ఆకాశ మధ్యంలో ప్రకాశిస్తున్నాడు. చుట్టూ ఎత్తైనకొండలు, మంచుశిఖరాలు అన్నీ కూడా వెండి పోతపోసినట్లు తళతళ మెరిసి పోతున్నాయి. వెండి కిరీటాలు పెట్టుకున్నట్లు కనుపిస్తున్నాయి. సరో వరంలో నీరు తళతళ లాడుతూ చిన్న చిన్న కెరటాలతో కదిలి పలయాలుఅల్లు తున్నాయి. గాలిమందంగాఉంది. చల్లని మెల్లనిగాలి. ఎవేవో పరిమళాలు మోసు కొని తెస్తూన్నగాలి. అదివంటికి తాకితేనే చాలు అకారణంగానే మనస్సులోఎవేవో మధురమైన ఊహలు పుట్టుకొస్తాయి. అప్పుడు నామనస్సు ఎలాఉన్నదను కున్నావు. ఎన్నెన్నో ఉద్వేగాలు నన్ను పట్టి ఊపివేస్తున్నాయి. నామనసు పర వశమయిపోయింది!

"కొలనుగట్టున పచ్చికమీద కూర్చు న్నాను. ఆవిశాలమధుర కొలనువంక

తదేకంగా చూడసాగాను. అప్పుడొక విషాద పూరితమైన అనురాగం, ఒక విచిత్రభావన నాలో మెరుపులా మెరిసింది. నేను విరహతాపంతో అల్లాడిపోతున్నట్లు నాకు తెలిసింది. నిస్సారమైన నాజీవితంపై నేనే తిరుగుబాటు చేయాలనిపించింది. 'ఏమిటీ! నాజీవితంఇంతేనా! ఇలాంటి చల్లని వెన్నెల రాత్రిలో — ఇలాంటిచక్కని సరోవరతీరాన — మనసారా ప్రేమించిన పురుషుడి కౌగిట్లో ఉండే భాగ్యం నాకులేదా? భగవంతుడు ప్రసాదించిన ఇలాంటి మధురవేళలందు తనివితీరా ప్రియుని అధరామృతంగ్రోలే ప్రాప్తం నాకు లేనేలేదా? ఇలాంటి చక్కని వెన్నెల రాత్రులందు - నీడల్లో శయనించి పురుషసుఖం అనుభవించే యోగ్యతనాకు లేదా? నాజీవితం, నా యౌవనంఇలా వ్యర్థమైపోవలసిందేనా?-' అని నాలోనేను పరితపించసాగాను.

"నాకు దుఃఖం ఆగిందికాదు. ఏదో ప్రియమైన వస్తువును పోగొట్టుకున్న పిల్లల్లా వెక్కివెక్కి ఏడవడం మొదలు పెట్టాను. అప్పుడు నావెనకాల ఏదో అలికిడి అయినట్లు వినిపించింది. ఎవరో పురుషుడు నావంక గుచ్చి గుచ్చి చూస్తున్నట్లు తోచింది. నేను తిరిగి చూచాను. నేనుముఖం అటుతిప్పగానే నన్నుచూచి ఆమనిషి గుర్తుపట్టాడు.

'మీరు ఏడుస్తున్నారా మేడమ్?--' అని అడిగాడు.

"అతను ఒక బారిస్టరు. చిన్నవాడే వాళ్ళమ్మగారిని వెంటపెట్టుకుని ప్రయాణం చేస్తున్నాడు మేం తరుచుగా కలుసుకుంటూనేఉన్నాం. కనుపించినప్పుడల్లా అతను నావంక అదే పనిగా చూస్తుండేవాడు.

"అతనిప్పుడు అకస్మాత్తుగా అగుపించి, నన్నిలా అడిగేటప్పటికి - సమాధానం ఏమనిచెప్పాలో నాకుతోచలేదు. పైగా రాత్రివేళ- అనిర్జన ప్రదేశంలో నేను ఒంటిగాకూచుని ఏడుస్తున్నానాయె;మరి అతను ఏమనుకుంటాడో అని గాభరా పడ్డాను. చివరకు వంట్లో బాగాలేదని చెప్పాను.

"అతను నాపక్కనే నడవడం మొదలు పెట్టాడు. అతని ప్రవర్తన సహజంగా మర్యాదగానే ఉన్నది. కాని మరోలా అనుకోవడానికి వీల్లేదు. 'ప్రయాణంలో మీరు ఏమేమి వింతలూ-విశేషాలూ చూచారు? — అని అడుగుతూ నాతో మాట్లాడసాగాడు. నా మనసులో ఎన్నెన్నో ఉన్నాయి. అవే అతను మాటల్లోకిమార్చి-చెపుతున్నాడు. అతనలా ఎంతో మధురమైన, మనోహరమైన విషయాలనువర్ణించి చెప్పుకపోతూ ఉంటే నాహృదయం ఆనందంతో పరవళ్ళుతొక్కింది. ఆనందమంటే ఏమిటో అతను బాగా అర్థం చేసుకున్నాడు— నాకంటె కూడా బాగా అర్థం చేసుకున్నాడు. అంతేకాదు. ఉన్నట్టుఉండి అతను మహాకవి ఆల్ఫ్రెడ్ డీ ముసెట్—రచించిన ప్రేమగీతాలు కొన్ని పాడి వినిపించాడు. నామటుకు నేను ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి అయిపోయాను. చెప్పతరంకాని ఉద్వేగం వచ్చి నన్ను ఆవహించింది. ఆ చుట్టూఉన్న కొండలు, ఆ చక్కని సరోవరం, ఆ చల్లనివెన్నెల-

అన్నీ ఏకమై మధుర సంగీతం పాడు తున్నట్టనిపించింది నాకు.

"అదంతా ఒక మాయలా — ఒక స్వప్నంలా జరిగిపోయింది. ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో మాత్రం చెప్పలేను, చెల్లాయ్!

"ఇహ అతనంటావా? ఆమరునాటి ఉదయం అతను వెళ్ళిపోయేటప్పుడు తప్ప నేను మళ్ళీ అతన్ని చూడలేదు.

"వెడుతూ వెడుతూ—తన అడ్రెస్ ఉన్న కార్డు మాత్రం ఒకటి నాకిచ్చి వెళ్ళాడు--అంతే!"

* * *

ఇలా తన కథంతా చెల్లెలికి చెప్పి. ఆమె బుజాలమీద వాలిపోయి వెక్కి-వెక్కి ఏడవడం మొదలుపెట్టింది మదాం హెన్రీటా

తరువాత మదాం జులియా — ఎంతో సంతృప్తితోనూ, నిశ్చలంగానూ, ఐక్కయ్యను చూచి - ఆమెతో మెల్లగా ఇలా అన్నది—

"అక్కా! మనం ఉన్నాం చూచావూ? మనం సాధారణంగా పురుషుణ్ణి కాదు ప్రేమించేది — పురుషుడి ప్రేమను ప్రేమిస్తాం. ఆనాటిరాత్రి నీవు నిజంగా ప్రేమించింది వెన్నెలను కాని — ఆ పరపురుషుణ్ణి కాదు. ఆ రాత్రి ఆ వెన్నెలే నీకు ప్రియుడు!" —